చెన్నపట్టణము డిసంబరు ౧౯౨౬

సంపుటము 3 అక్షయ సంవత్సరము మార్గశిరమాసము సంఖ్య ౧౨

విశ్వాసము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

రాక బందరు; కదియును రైలు మీఁదఁ;
జేరె నా రైలు గుడివాడ స్టేషనుకును
ఎక్కువారును దిగువారు త్రొక్కటంబు
గూరుచుండిరి; నే నట్టె కూరుచుంటి.

ఏను గూర్చున్న పెట్టెలో నెడము గలదు;
వలదనుచు నెక్కవచ్చెడువారిఁ ద్రోచి
నాదరిని గూరుచుండిన చౌదరి యొకఁ
డరయు చుండె నిట్టట్టు నాగరకు కొఱకు.

కరకరని తెల్లవల్వలుఁ గనుల జోడుఁ
జేతబెత్తముఁ దాలిచి తేఁత వయసు
బ్రాహ్మణుం డొక్కఁ డెక్కనర్హ మగుచోటు
నారయుచు నుండె నపుడు ప్లాట్ఫారమునను.

అప్పుడు చౌదరి యాతని
చొప్పరసెఁ, బిలిచెఁ, నతఁడుఁ జొత్తె నుండెఁ;
గుప్పున వచ్చెఁ లోనికి
నుప్పరి యొక్కండు; ప్రక్క నొదికిలి నిలిచెఁ.

చాలఁగాఁ జోటుగల దతఁ డేలొ కాని
కూరు చుండఁ డప్పుడు వానితీరు సూచి
పాఱయును మట్టితట్టయుఁ బాఱఁ జూచి
తొలఁగి పొమ్మని చౌదరి తొందరించె.

మూల నొదిగి నిల్చుండు; దండాలు బాబు,
ప్రక్కబండ్ల నన్నెవ్వరు నెక్కనీరు;
తిరిగి తిరిగి వచ్చితి నంచు దేవురించు
వాని నోదార్చి నే నిల్వ నాన యిడితి.

చే విసరి పిల్చెఁ జోదరి; చేరె బ్రాహ్మ
ణుండు; నాతని ప్రక్కఁ గూర్చుండె; నపుడు
వెలి నిలిచి యొక్క వృద్ధుఁడు పలుకుచుండె
నభ్యనుజ్ఞఁ గాంక్షించు చున్నట్టు లిట్టు.

ఇంట నిబ్బంది తెలఁగానే స్వయముగ
వెంటఁ గొనివచ్చి నే దిగవిడుతునోయి!
చూడు నామాట యని వృద్ధుఁ డాడుమాట
వింటి; "మీ రల్లు మామలా?" యంటి నేను.

"ఒక్కతే బిడ్డ, కనులముం దుండుననుచుఁ
బెండ్లి చేసితిఁ బొరుగూరి పిల్లవాని
కీతనికి నిచ్చి; యుద్యోగరీతి చేత
నీతఁ డన్యదేశమ్ములనే వసించు."

అంచు నావృద్ధుఁ డేదో వచియించుచుండె;
నల్లుని మొగిమ్ము మటమట లాడుచుండె;
అట్టిటఱి బిట్టు మొఱఁగుచు నరుగుదెంచె
నుప్పరిని జేరఁగా నొక్క యూరఁగుక్క.

చూచి మూచూచి మునికాళ్ల లేచి యేచి
తోఁక నాడించుకొనుచుఁ దుందుడుకు తోడఁ
దన్నునాకఁగా నాలుకఁ దడవుకొనుచు
ముక్కుచునుమూలుగుచునున్న కుక్కఁ జూచి.

ఉప్పరి మొగమ్ము వెడతెల్విఁ దెప్పతిల్లెఁ;
దలుపుఁ దెఱచి దానికి గోము సలుపఁ దలఁచె;
దుమికి దుమికి లోనికి నది దూఁకఁ జూచె;
ధిక్కరించెఁ జోదరి తల్పుఁ దెఱవకుండ.

మొఱఁగుచునె యుండెఁ గుక్క; చీఁదఱఁగొను
నాగలేక కోపమున నానాగరకుఁడు [చును
చేతికఱ్ఱతో నాకుక్క మూతిమీఁదఁ
గొట్టె; నాయుప్పరిని జెడఁ దిట్టె మఱియు.

అంతలో గుఱ్ఱపుంబండి నమ్మగాఁతు
లరుగుదెంచి రిర్వురు; వారి నరసినంత
నల్లుని మొగమ్ము పయిఁ దెల్వి వెల్లివిరిసె;
మామ దిగులొందె, వచ్చితి రేమి? యనియె.

అత్త పలికెఁ దాళపుఁ జెవిగుత్తి విడిచి
వచ్చితి రటంచు నల్లుతోఁ; వగపు మఱపు
మురుపు మెఱపించు చల్లుఁడు మోవి గఱచి
కొనుచు జవరాలి మొగముఁ గన్గొనలఁ జూచె.

చుఱుకుచుఱుకుగా జవరాలు సూచెఁ, జూచె
మరలనాతఁడు, జవరాలు మరలఁ జూచె;
చూపు చూపు పరస్పరసూక్ష్మభావి
తముల వివరించె వైద్యుత తంత్రులట్లు.

చూచుచుండిరి నలువు రీచోద్య మపుడు;
సూక్ష్మవేదనమ్మున మనస్సులు లగించె.
కుక్కగోడును నుప్పరి బిక్కమోము
నెవరిమదికిని నెక్కనే యొక్క దయ్యె.

వాచ్యమునకంటెఁ జాతురి వ్యంగ్యమునకుఁ
బ్రబలమనుమాట నాకప్డు స్పష్టమయ్యె
వావిడిచి చేయి మొఱఁ జెవి వైచికొనక
కన్నుసన్నలే యెల్లర్థఁ గాంచుకతన.

మామయుల్లుకును, నల్లుని మోముకులుకు
తల్లి పయిపూఁతయును, గాఁతు జల్లిచేఁత,
అమ్మగల నెయ్యపుంజూపు మేల్మితీపు
లరయు చొక్కింత నే నబ్రమందు నంత.

రైలు కదలెడు వేళయ్యె; నాలుమగల
జాలిచూపులు కన్నీళ్ల నోలలాడెఁ;
గుక్క మొఱ యెక్కువయ్యెను; బిక్కమొగము
పెట్టి యుప్పరి గుండెపైఁ గొట్టుకొనియె.

చూచినాఁడ నే నీరెండుచోద్యములను;
రెండుపాయలై మనసు వర్తిల్లె నాకు;
ఈలమ్రోఁతయు, నంతలో రైలుకూఁత
తొట్రు గల్గించె; రైలును దోన కదలె.

కదలి రైలు ప్లాట్ఫారము గడచిసాఁగె;
దల వెలికిఁ జొన్పి యట్టె చూడ్కులు నిగుడ్చి
యువకుఁ డుప్పరియును జూచుచుండి రొదిఁగి
కూర్మియిల్లాలిజాడయుఁ గుక్కజాడ.

యువకుఁ డపుడు తన్ను నొంటిగ విడి దుఃఖ
పడుచుఁ దిరిగియేఁగు పడుచుఁ గనియె:
ఉప్పరీఁడు తన్ను నొంటిగ విడలేక
ప్రక్కఁబట్టి వచ్చు కుక్కఁ గనియె.

దూఁకుచుండె రైలు తొందరగా దాని
తోడఁ గుక్కగూడ దూఁకుచుండె.
రైలుబండి ప్రక్కఁ గాలాడ కాకుక్క
రాక మాకు నబ్బురంబుఁ గూర్చె.

అంతదాఁక వింత యైయున్న యువకుని
లీల మాకు మదులఁ దూలిపోయె:
అంతదాఁక రోఁత యైయున్న యుప్పరి
గోల మాకు మదుల నోలగించె.

రోఁజు చిట్లు కుక్క నూజెళ్ల స్టేషను
దాఁక రైలువెంట దూఁకివచ్చె.
ఎదిరిరైలు నప్పుడే బందరున నుండి
చేరుకొనియెఁ బ్లాటుఫారమునకు.

ఉప్పరీఁడు రైలు తప్పించుకొని వెలి
కరుగ నెఱుఁగఁడయ్యె నిఱుకటమున;
రైలువాండ్రు కుక్క రానీక తఱిమిరి;
నాకు నంత ప్రాన్కి లేకపోయె.

ఎదిరి రైలులోన నేతెంచుచున్నట్టి
మిత్రవితతితో సమేలముగను,
అచటిరైలు కదలు నందాఁకఁ బనిలేని
పనిని నేను గాలమును గడపితి.

ముందుగానె కదలె బందరు వచ్చు మా
రైల్, హుటాహుటించి రాఁ దొడంగె;
నంతదాఁకఁ గొంత యాయాసమును దీర్చు
కొన్నకుక్క మరల వెన్నడించె.

కనుల నీరునించుఁ గనుఁగొంచు, నుప్పరీఁ
డెచ్చరించుఁ; గుక్క యెగిరి కొంచుఁ
బైకిరాఁ బ్రయత్నపడుఁ, గ్రిందఁబడుఁ, గొంత
దూరమగును, మరలఁ జేరుకొనును.

ఉప్పరీని నప్పు డోదార్చితిమి కుక్కఁ
జూచుకొనఁగఁ జక్కఁ జోటొసంగి;
చెప్పరోరి! కుక్కచొప్పును నీచొప్పు
ననుచుఁ గనికరించి యడిగితిమి-ని.

ఒక్కకన్ను కుక్కప్రక్కకు, మఱియొక్క
కన్ను మాదు ప్రక్కకు న్నిగుడ్చి
చెప్పఁదొడఁగె నప్పు డుప్పరి తన పడు
త్రిప్పు లల్ల కుక్కమెప్పు లెల్ల.

"ఒప్పుకొంటిమి గుడివాడ యొద్దఁ గొంత
మట్టిపని; చేయుచున్నాము; తట్ట పాఱ
విడిచిపెట్టిన మాపొట్ట గడవదండి;
యుప్పరులమండి; లేదండి యుప్పుగంజి.

ఇల్లులేదండి; పదిమంది పిల్లలండి;
తల్లి గాలివానకు నేటివెల్లువఁ బడి
నిరుడె చనిపోయెనండి; మాకరమమేమి
చెప్పనండి; మీకెందుకీ చీదఱండి!

పెద్దవానగాలి బెజవాడ బందరు
దేశములను నిరుడు నాశపఱుచు
టెఱుఁగరేమి బాబు! లీసీమ నీర్చొచ్చు
గొట్టి పైర్లు నేల మట్టమయ్యె!

వడిగ వచ్చిపడిన బుడమేటి వెల్లువఁ
జెల్లిపోయెనండి పిల్లతల్లి;
అప్పుడండి, చావుఁ దప్పించెనండి, యీ
దొడ్డకుక్క నాకు బిడ్డలకును.

మనిసి బుద్ధికంటె మాదొడ్డ బుద్ధండి;
మసలదండి యెపుడు మమ్ము విడిచి;
వింత బాబు, దీని విశ్వాస; మెన్నని
చెప్పఁగలను దీని గొప్పపనులు!

కొంప గోడులేక కొండ్రలలోన మే
ముండఁగలమె దీని యండలేక;
చివ్వుమంచు లేచి చెల్లాడిచంపును
బందినైనఁ బ్రాచుఁబామునైన.

దానిగంజి ముందు, తర్వాత నాగంజి;
నేను దాని వీడలేను, నన్ను
నదియు వీడలేద యిదినఱు; కాకుక్క
ప్రాణమండి నాకు బాబులార!

కూలిడబ్బు తెచ్చుకొందును బందరు
వెళ్లి; నేను రాత్రి మళ్లివత్తు;
గంజినూకకైనఁ గంట్రాక్టరెప్పటి
కూలినప్పు డియక నాలిపెట్టు.

ఇచ్చునప్పుడైనఁ దెచ్చేఁడు; దండుగ
మంటిపనులు తనకు నింటికడను
జేయవలెను; మీఁదనేయిచ్చు; నందుకై
తట్టు, పాఱ సెంటఁబెట్టుకొంటి.

కుక్కఁ జిక్కఁ బట్టుకొండని పిల్లల
కప్పగించి దాని కందకుండ
నక్కనచ్చి నేను టిక్కెట్టు కొనుకొంటి;
నెట్టకేల కిచట నెక్కఁగంటి.

ఎపుడు నన్ను విడిచి యెఱుఁగదు గావునఁ
గుఱ్ఱగాండ్ర దూసికొన్నదండి!
వచ్చెనండి నన్నుఁ బసిపట్టి; రైలొద్దఁ
దాఁకనైతి దాని గోఁకనైతి.

కొన్న టిక్కెట్టు చెడునని కొంత భయము,
కోపగింతురు మీరని కొంత భయము,
కదలనీదయ్యె; నే రైలు వదలనైతి;
జాలిమాలితి; నాకూలి కూలిపోను.

కుక్క నాకు నింక దక్కునా, మాతండ్రి!
గుండెపగిలి నేలఁ గూలునేమొ?
పైన మాపి నాదు ప్రాణంబయిన వేఁపిఁ
బట్టుకొందుఁ గ్రింది తట్టు కుఱికి."

అను చాయుప్పరి కన్నీర్
దొనదొనఁ గాఱఁగ నేల దూఁకంబోయెన్;
బెనుప్రొక్కి నాపి నేని
ట్లని చెప్పితి వాని కప్పు డాశ్వాసముగాన్.

కుక్కకై ప్రాణములను బోఁగొట్టుకొనకు;
నేలకుఱుకకు; నీ కుక్క నీకు దక్క
నవలి స్టేషను రాఁగానె యచట నీకుఁ
గొని యొసంగుదుఁ దిక్కెట్టు కుక్కకొఱకు

అంటిఁ; బెట్టెలోని యందఱుఁ దత్కథ
నాలకించి యెంతొ జాలిగొనిరి.
ఆదిఁ గసరుకొన్న చౌదరికన్నులు
చెమ్మరించె, నీరు క్రమ్మరించె.

కుక్కకు నీకున్ మఱువై
లెక్కన్ దిక్కెట్టుడబ్బు లే నిత్తును; నీ
కిక్కడ వీ రెత్తురు గద,
కుక్కను నీవెంటఁ దోడుకొని పోగదరా!

అని యా చౌదరి మిగులన్
గనికరమునఁ బలికె; వాఁడుఁ గళవళ పడుచున్
గనుచుండెఁ గుక్కరాకన్;
గనఁగా లేనైతిఁ గుక్క కష్టము నేనున్.

ఒడలెల్ల నుఱుఁగు గట్టెను;
బడఁబాఱుచునుండె; వెనుకఁ బడుచుండె; నిఁకన్
గడుదూర మైన నిటు పరు
గిడఁజాల దటంచుఁ దోఁచె నెల్లరమదికిన్.

చేర నున్నాము కొత్తరంస్టేష నింక
నొక్కమైల్‌దూరమున నదియుండు నేమొ!
కలదు రైల్‌రోడ్డు కడ్డమై కాల్వయొకటి
దాని వంతెనపై రైలు దాఁటుచుండె.

కుక్క రైలుతో వంతెన నెక్కి దాఁటఁ
జోటులేదయ్యె; రైలెల్ల దాఁటు దాఁక
నిలువరాదయ్యె దానికి; నీట నుఱికి
యీఁది యావలిదరిఁ జేరుకోఁ దలంచె.

కాల్వలోనికి నుఱుకుటఁ గంటి మేము;
కుక్క యావలియొడ్డున కెక్కు జాడ
గానరాదయ్యె; రైల్ వచ్చెఁ గొతరంబు;
గుక్కకొఱకని తిక్కెట్టుఁ గొంటి నేను.

ఐదునిమిషములయ్యె; రాలేదు కుక్క;
కూలె నాకొంప యని వాఁడు గోలపెట్టె;
నిల్వలేఁడయ్యె రైలులోఁ; గాల్వదరికి
వెళ్లిచూతు ననెన్; మాకుఁ గాళ్లు వణఁకె.

కొన్నతిక్కెట్టు నేనును, గొంతడబ్బు
చౌదరియు నీయఁబోఁ, గుక్క చచ్చె నేమొ
నీటఁబడి; నాకు నివి యింక నేటి కనుచు
దిగులుగుండెలతో వాఁడు దిగెను రైలు.

"దిగితి నిప్పుడు; నే నింక దిగిననేమి;
దిగక చచ్చిననే; మది తీఱియుండు.
ఆశ గుడివాడ నన్ను వెంటాడినపుడె
రైలుదిగనైతి! నాకుక్కఁ గోలుపోతి!

కుక్క చచ్చెనేని కూలి నా కింకేల?
కుక్కలేక రైలు నెక్కఁజాల!
కుక్క నాకు దిక్కు: కుక్కకు నే దిక్కు!
దక్కు నాకుఁ గుక్క కొక్కదిక్కు.

బాబులార! కుక్కతోఁ బోదు నే" నంచు
గుండెమీఁద బాదుకొంచు వాఁడు
తట్ట పాఱమూట తలపెట్ట కొకపెట్ట
పరుగు వాఱెఁ గాల్వప్రక్క కపుడు.

దూఁకె రైలుతో సుదూరము, గుండెల
కధిక దుస్సహప్రయాసమయ్యె.
అట్టిదింక నీఁదు టెట్టులు? చలినీటఁ
బడినతోన గుండె పగిలెనేమొ?

పలికెఁ దసకుఁ బ్రాణపద మని యా కుక్క
నరయఁగల్గె నేమొ యాతఁ డచట?
ఉసురుతోడ నున్నదో లేదో? యది యుండ
కున్న వాని జీవ ముండఁగలదె?

నొచ్చుకొంటి నేను:— నా జెల్లలో వాని
దింపనైతిఁ; గుక్కతిక్కైన
విలిచి యీయనైతి; "విప్రులు పశ్చిమ
బుద్ధు" లన్న నుడి సుబద్ధ మయ్యె.

తీగ నేఁ గాల్వదరినైన లాగియున్న
నాగు రైల్, కుక్క వానికి నబ్బియుండు.
కారణం బద్దు నని గార్డు గారి కపుడు
వెలిచియుంటిని, దుది కొడు గలిచికొంటి.

తఱియయ్యె రైలు గదలెను
మఱి మామాపనుల మేము మసలితి, మైనర్
మఱపునకు రాదు, నామది
నెఱవుకొనెన్ గుక్కగాధ నిత్యస్ఫూర్తిన్.

సంపూర్ణము

లోకయాత్ర

శ్రీ శివశంకరశాస్త్రి [సాహితీసమితి]

[౧౯–౨౪]

౧

నాయకుడు

లోకవికసన మాత్మవీక్షా
లోకమున ఘటియించు రాధా
వల్లభా, కైకొమ్ము దాసుని
వందనం బిదిగో!

భక్తితో చిత్తమున నీపద
పంకజమ్ములు నిలిపి కరుణా
వీక్షణోత్సుకవృత్తి దాసుడు
వేచియున్నాడు!

తెల్లవారుచు ప్రొద్దు గ్రుంకుచు
దినము లెన్నో గడచి పోయెను
గాని నీ కీదాసజనుపై
కరుణ రాదాయె!

క్లేశరేఖావ్యాపగతము లై
కేవలము సుఖ మొందగా దగు
వాసరమ్ములు గడచుచున్నవి
వ్యర్థముగ నాధా!

యౌవనోత్తా లోర్మ్మ లల్లన
సంతకంతకు సణగుచున్నవి,
మంధరమ్ముగ దరియుచున్నది
మరణయామవతి!

తొలగిపోయె మనోరథమ్ములు
దూరముగ, నిక నొక్కకోర్కెయె
వేచుచున్నది మానసమ్మును
విడువ కనిశంబున్.

వందనము గైకొమ్ము రాధా
వల్లభా, లోకైకనాధా,
దీను గారుణ్యార్ద్రశీతల
దృష్టి గన్గొనవే!

సంస్కృతవాఙ్మయమందలి గద్యకావ్యములు

విద్వాన్ సూరిగుచ్చి వీరభద్రుఁడుగారు

ప్రపంచమందలి భాషలన్నిటిలో సంస్కృతమే మిక్కిలి పురాతనమైయున్నది. అందువలననే మనలాక్షణికులెల్లరు "తల్లి సంస్కృత మెల్లభాషలకును" అని నుడివియున్నారు. భాషాతత్త్వశాస్త్రజ్ఞులగు పాశ్చాత్యులుసయితము భాషలన్నిటిలో సంస్కృతమే ప్రాచీనమని నిశ్చయించి మాతృభాష సంస్కృతము గాదనియు, వీనికన్నిటికిని మూలము మఱియొకటి యుండవలయుననియు నసందిగ్ధముగా వ్రాసియున్నారు. మాతృభాష, సంస్కృతమైనను, గాకపోయినను భాషలన్నిటిలోఁ బురాతనమైనదని యందఱు నంగీకరించియే యున్నారు. ఇట్టిసంస్కృతమే యనేక భాషల కనేకనూతనవిషయములలో మార్గము చూపియున్నది. వ్యాకరణాదిశాస్త్రములలో నీ సంస్కృతమున హిందువులు చేసినంతపరిశ్రమ యేభాషలో నెవరిచేత నింతవఱకుఁ జేయఁబడియుండలేదు. వివిధశాస్త్రములలోను వివిధములగు గ్రంథములు లెక్కలేనన్ని యీ సంస్కృతమునఁ గలవు. ఇంతవాఙ్మయముగల యీ సంస్కృతమున గద్యకావ్యము లేడెనిమిదికన్న నెక్కువలేవనుట యెల్లవారికి నాశ్చర్యమును, విషాదమును గలిగింపక మానదు.

బాణుఁడు తన హర్షచరిత్రములోఁ దనకుఁ బూర్వమున్న వచనకావ్యముల నీ క్రిందిశ్లోకములలోఁ బేర్కొనియున్నాఁడు.

కవీనా మగలద్దర్పో
నూనం వాసవదత్తయా;
శక్త్యేవ పాండుపుత్త్రాణాం
గతయా కర్ణగోచరమ్."

(వాసవదత్తచేఁ గర్ణగోచరమైన శక్తిచేతఁ బాండుపుత్త్రులకువలెఁ గవులకు గర్వభంగమైనది.)

"పదబంధోజ్జ్వలో హారీ కృతవర్ణక్రమస్థితిః;
భట్టారహరిచంద్రస్య గద్యబంధో నృపాయతే."

(పదబంధోజ్జ్వలము, మనోహరము, కృతవర్ణక్రమస్థితియు నైన భట్టారహరిచంద్రుని గద్యప్రబంధము రాజనఁదగియున్నది.)

బాణుఁడు పేర్కొనిన గద్యబంధవాసవదత్తలును, బాణునికాదంబరీహర్షచరిత్రములును, దండిదశకుమారచరిత్రమును, వామనబాణుని వేమభూపాలచరిత్రమును, ధనపాలుని తిలకమంజరియు ననునవిమాత్రమే మనకుఁ బ్రస్తుతము కన్పట్టుచున్నవి. క్రీస్తుశకము ఆఱవశతాబ్దముననున్న దండి తన కావ్యాదర్శములో

"గద్యంపద్యంచ మిశ్రంచ
త్త్రైధై రా ర్యా శ్చతుర్విధమ్."

అని గద్యమునుగూడ నొక ప్రభేదముగా సంగీకరించి యుండుటచే నింతకుఁబూర్వమే కొన్ని గద్యకావ్యములు వ్రాయఁబడి యుండవలెనని యూహింపవలసి యున్నది. అవి కాలక్రమమున నశించియుండవచ్చును. కొన్ని నశించినను మొత్తముమీఁద నీ సంస్కృతవాఙ్మయమునఁ బదునేనుకంటె నెక్కుడు గద్యకావ్యములు వ్రాయఁబడి యుండలేదని చెప్పవచ్చును. ఇంత వాఙ్మయముగల సంస్కృతమున నీ గద్యకావ్యములు నశించుటకుఁ గాని, తక్కువగా వ్రాయఁబడుటకుఁగాని ప్రబలములైన కారణము లుండియుండవలయును.

సాహిత్యకలానముల్లాస మనునది యనల్పకల్పనాకుశలమును, సంతుష్టమును నైన మనసుయొక్క ప్రతిబింబమేకదా! మనుష్యునకానందము గల్గినపు డతఁడు తనభావమును స్వరము మధురమైనను గాకున్నను సంగీతరూపముగనే వెలిపుచ్చునను యందఱకును ననుభవసిద్ధమే. ఇట్లు తనభావము గానరూపముగా నచ్చుటకు పద్య మనుకూలమైనట్లు గద్య మనుకూలము గాదుగదా! అందువలననే యేభాషలోనైనను మొదటఁ గవిత ఛందోరూపమున బయలువెడలుట. సంగీతకల, సాహిత్యకల అను నీ రెండును సమానమైన యోగక్షేమములు గలవని 'సంగీతంచ సాహిత్యంచ సరస్వత్యా స్తనద్వయ' మ్మను సూక్తి వలనఁ దెలియుచున్నది. కాఁబట్టి గానమునకు గద్య మనుకూలింపమిచేఁ బ్రాచీనములైన ఋగ్వేదాదులు పద్యరూపముననే వ్రాయఁబడినవి. మఱియు నాకాలమున లిపి లేకపోవుటచే నేమి, జ్ఞాపకముంచుకొన వీలగునను నుద్దేశముతో నేమి, యట్లు ఛందస్సులో విస్తారముగా గ్రంథములను మనపూర్వులు వ్రాసియుందురు. తరువాతను రానురాను పద్యకవితయే కవిత్వమనియు, గద్య కవిత కవిత్వముగాదనియు నను దురభిప్రాయము ప్రబలఁజొచ్చినది. ఇట్టి యభిప్రాయ ముండఁబట్టియే బాణుఁడు తన హర్షచరిత్రములో నీరీతిగా వ్రాసియున్నాఁడు:

"ఉచ్ఛ్వాసాంతే ప్యఖిన్నా స్తే
యేషాం వక్త్రే సరస్వతీ;
కథ మాఖ్యాయికాకారా
న తే వంద్యాః కవీశ్వరాః"

(ఉచ్ఛ్వాసాంతమున నఖిన్నులును నవిచ్ఛిన్నప్రతిభ గలవారునునైన ఆఖ్యాయికాకారులగు కవీశ్వరు లెట్లు వంద్యులుగారు!)

గద్యలోవ్రాసినఁ దాము గవులముకామను నుద్దేశము గలవా రగుటచే వ్యాఖ్యానములు, లక్షణగ్రంథములు మొదలగువాని నన్నిటిని మనపూర్వులు ఛందస్సులోనే వ్రాసియున్నారు. దానంజేసియే యిప్పుడు కొన్నిటికి రచయితల యభిప్రాయములు బోధపడకుండుటయు, నందువలన విపరీతార్థములు తీయుట కవకాశములు గల్గుచుండుటయు, సంభవించుచున్నది. వచనములో వ్రాసిన నిట్టివిపరీతార్థములు తీయుట కవకాశము గలుగదుగదా!

కొంద ఱిది దేశభాష గాదనియు, దేశభాష గానున్నపుడె గద్యరచనమున కావశ్యకత యున్నదనియు, నందువలన సంస్కృతమున

గద్యవైరళ్య మాశ్చర్యమును గలిగింపఁజాలదనియు నుడువుచున్నారు. మరియు వారు ప్రాకృతభాషనుండి పాణిన్యాదులచే సంస్కరింపఁబడినదగుటచేత సంస్కృతమని పేరువచ్చినదని యందురు. దానికి బలముగా వారీక్రింది యుక్తులను జెప్పుచున్నారు.

“అప్పుడు ప్రాకృతమే దేశభాషగా నుండెడిది. ప్రకృతిసిద్ధమైన భాషగనుక ప్రాకృతమని పేరువచ్చినది. అందువలననే దీనికి దేశభేదమును బట్టి మాగధీ, మాహారాష్ట్రీ, శౌరసేనీ, పైశాచీ అను మొదలగు నామములుకూడఁ గలిగినవి. ఇట్లే మనప్రాచీనపండితులుకూడ నభిప్రాయపడియున్నారు. “ప్రాక్-పూర్వం + కృతం=ప్రాకృతం, అనిగదా వ్యుత్పత్త్యర్థము. అందువలననే ప్రాకృతము మొదటను, సంస్కృతము తరువాతను శాస్త్రకారులచే వ్రాయఁబడినది. పాణిన్యాదివైయాకరణులచే సంస్కరింపఁబడినది కాన సంస్కృత”మని నమిసాధువుచెప్పియున్నాఁడు. పైనవ్రాసినదానినిబట్టి సంస్కృతము దేశభాష కాదనియు నందువలన సంస్కృతసాహిత్యములో గద్యవైరళ్యము కలిగెననియు పైవారి యభిప్రాయమైయున్నది.

కాని యీయభిప్రాయము మిక్కిలిదుర్బలమైయున్నది. భాషయనఁ దమయభిప్రాయము నితరులకుఁ దెలియఁజేయు సాధనావిశేషమే కదా! ఈ సంస్కృత మెప్పుడును వ్యవహారమునందు లేనియెడల నిది యొకభాషయే కాఁజాలదు. అప్పుడప్పుడు వ్యవహారమునం దుపయోగింపఁబడిన భాషారీతియే ఋగ్వేదమునందును, నుపనిషత్తులయందును మనకు లభ్యమగుచున్నది. పాణిని సూత్రములలో “దూరాద్ధూతే” అను మున్నగువానినిఁబట్టి యిది వ్యవహారమం దుండెనని విశదమగుచున్నది. కాఁబట్టి యిది దేశభాష కాదనుట మహాసాహసము. మరియుఁ బైవారుచెప్పిన ప్రాకృత సంస్కృత పదార్థనిర్వచనము సరికాదు. ప్రకృతి సంస్కృతమనియు, దానినుండివచ్చినది ప్రాకృతమనియుఁ బూర్వపండితులయొక్కయు, నవీనులగు పాశ్చాత్యభాషాతత్త్వశాస్త్రజ్ఞులయొక్కయు నభిప్రాయమై యున్నది. గనుక గద్యవైరళ్యమునకుఁ బైవారు చెప్పినవి సరియైన కారణములు కాఁజాలవు.

మరియు ఛందోబద్ధమైన వాణి సంగీతముతోఁగూడి యొకచోట వైకల్యమున్నను సర్వాంగసుందరి చూచువారినివలె, సన్నివేశ విశేషముచే, వినువారి మనస్సు నాకర్షించును. భావాదులు లేకపోయినను గద్యకవిత్వమువలె ఛందోబద్ధకవిత్వము త్వరలో వెల్లడిగాదు. అందువలననే పద్యరచనయం దాసక్తిమెండుగానుండుట. కావ్యమార్గమున నడచువాఁ డెవఁడు తనకు స్ఖాలిత్యము రానీయనిమార్గము నవలంబింపకుండును? అందఱును సుకరమును, సులభమును నైనమార్గమునే యవలంబింతురుగదా!

గద్యరచనమునకు స్వతస్సిద్ధము, నాకర్షకమునైన సౌందర్యములేదు. అయినను రసభావాది నిబద్ధము, సరసపదభూయిష్ఠమునైన గద్యకవిత్వము పద్యకవిత్వముకన్నఁగూడఁ ద్వరగా సహృదయుల నాకర్షించును. పక్షపాతములేని సహృదయుఁ డెవఁడు కాదంబరీ

రసము ననుభవించుచు నలసములైన పద్యములనువలె నభిమానింపకుండును? 'కాదంబరీరసజ్ఞానామాహారోఽపి నరోచతే!' (కాదంబరీ రసజ్ఞుల కాహారముగూడ రుచింప) దను సూక్తిని బట్టి యంతకన్న నెక్కువగాఁగూడ నభిమానింతురనియే యనవలసియున్నది. అయినను గద్యసృష్టిప్రయత్నము మిక్కిలి యోర్పుతోను, కష్టముతోను నెదుర్కొనవలసియున్నది. అందువలన గద్యరచనమునకు సంసిద్ధులగువారు మిక్కిలియరుదుగా నుందురు. సులభమైనమార్గమును విడిచిపెట్టి కష్టసాధ్యమైనమార్గము నెవరు నవలంబింపరుగదా! ఈపైయభిప్రాయమునుబట్టి సంస్కృతవాఙ్మయములో గద్యకావ్యములు తక్కువగానున్నవని మనమూహింపవలసి యున్నది. ఇంతవఱకును సంస్కృత వాఙ్మయమున గద్యకావ్యములు తక్కువగానుండుటకుఁ గారణములుమాత్రమే విమర్శింపఁబడియున్నవి. మఱియొక వ్యాసమున వానియందుఁ బ్రజలకుఁగల యాదరణము, శైలి మొదలగువిషయములనుగూర్చి విమర్శింపఁబడును.

ఎడఁబాటు

[ఆదిపూఁడి సోమనాథరావు గారిచే ననువర్తింపఁబడినది]

నీవు ననువీడిచనఁగానె నిలయమెల్లఁ
బ్రాణమెడలిన కాయంబుపగిది నుండె
ఘోర శోకాంధకారానఁ గూలియుంట
శూన్యముగఁ దోఁచె జగమెల్ల సుఖములెల్ల
నకటు, పూర్తిగ మృగ్యమై నట్టులుండె
ఒంటిగా నన్ను మరణ మీయుర్విలోన
ద్రోసినట్టులు నామదిఁ దోఁచుచుండె
నెమ్మి నామదికంతయు నీవె కాన
నీవు పోయిన నిఁక నాకు నిలుచునద్ది?

కొద్దివైనను హాయిఁగాగూడి మనము
మెలఁగిన దినమ్ములన్నియు స్మృతికి రాఁగ
నశ్రుపూరితమైన నా యక్షులకును
నెచటఁజూచిన దుఃఖమున్ హెచ్చుజేయు
క్రొత్తదా ఘోరకష్టమే గోచరించె.

ఇంపుగాను మనము పఠియించినట్టి
యెలమిఁ గ్రొత్తగ నీవు నాకిడిన యట్టి
రమ్యమైనట్టి పుస్తకరత్నమదిగో!

అరయ నెటఁజూడ నీప్రియమైన పనియొ,
మంచిమాటయొ, రూపంబుఁగాంచి నేఁడు
విడువని నిరాశలోఁబడి వేఁగునన్నుఁ
గటకటా వెక్కిరించిన కరణిఁదోఁచె.

కడఁగి మనుజుండు గాంచు సుఖంబు లెల్లఁ
గంటి నీతోడఁ గాలమ్ముఁ గడపినపుడు
చనిన నీ వింక నాకు నాదినము లిపుడు
తెగని చుట్టగఁజుట్టిన వగపుచేతఁ
భీకరాకృతిఁ దాల్చె నీవిధిని నేఁడు.

—ఎల్లా హ్వీలర్ విల్‌కాక్సు.

ఎవరు?

మిన్నికంటి గురునాథకవి గారు

చూపెడురాక, నీ నెలవుఁజూపవు; చూపెడుపోక, యేడకో
చూపవు; చూపెడాతనునుఁ జూపవు వ్యక్తివిభేద; మంతలోఁ
జూపెడ వొద్దనున్నటులు చూపవు కారణ మెందుకోసమో?
నీ పనులెల్లఁ జిత్రములు నీవెవరోకద, సాక్షికుండవో?

ఉ. ఎన్నివిధాలఁ బట్టుకొననెంచినఁ జిక్కవు, మింటితోడ నీ
కున్నదొ మైత్రి? వెల్గుఁగని యొంటిగఁ బర్వెదు, వెల్గుతోడ నీ
కున్నదొ మైత్రి? రేఁ దిరుగుచుండెదు నక్కుచు, దొంగతోడ నీ
కున్నదొ మైత్రి? తెల్పఁగదవోయి యెవండవు, జాలికుండవో?

చ. హిమమును, నీవుఁ దోడుగ జనించితిరో యల రేయికన్నెకున్;
భ్రమరము, నీవు నొక్కబడిపంతుల చెంగట విద్దెలన్ సమ
గ్రముగ గ్రహించినారొ? పలుగాకులపొందిక గల్గియున్నదో?
క్రమముగఁ జెప్పు మెవ్వఁడవు? రాజువో, దొంగవొ, జాలికుండవో?

ఉ. క్రొవ్వెద నల్లగల్వ విరిఁగ్రుచ్చి, కనుంగవఁదీర్చి కాటుకన్,
నవ్వుమొగానఁ గస్తురి గనంబడ బొట్టుఁ గుదిర్చి, నల్లనౌ
మవ్వపు వల్వఁ దాల్చి ప్రియుమన్ననకేఁగెడు పువ్వుఁబోఁడి, నీ
వెవ్వఁడవోరి, మాయమొనరించితి వక్కట! సాక్షికుండవో?

ఉ. కాల్చినబొగ్గువంటి గురుకాయము సూచి యెవర్తె మోహముం
దాల్చి పరిగ్రహించి ప్రమదంబునఁగూర్చెనో? చిత్ర! మాబిడం
బిల్చుచు విప్రలంభమున వేఁగెదు నేఁడును; మంచుబొట్టులన్
రాల్చెద, వేడ్చెదో? తెలుపరా పురుషుండవొ, జాలికుండవో?

ఉ. పిల్లలు నిన్నుఁజూచి కడుభీతిని గెవ్వునఁ గేక వేయుచుం
దల్లుల చాటు కేఁగెదరు దండధరుండవొ? లేక మావలెం
గాళ్లును గన్నులుం దలయుఁ గాయము సర్వము నీకు లేదొ? నా
యుల్లము సంశయించెడుఁగదోయి, వచింపుము సాక్షికుండవో?

ఉ. అందఱు సూచుచున్న సమయంబున గిన్నెలక్రింద నుండలం
బొందుగఁ జేర్చి మాయమయిపోవఁగ విప్రవినోది సేయు; నీ
చంద మదేమొ, గిన్నియల చాటునఁగాక యదృశ్యముం బొన
ర్పం దొరకొంటి వస్తుసమవాయ! మెవండవు, సౌఖికుండవో?

ఉ. కిమ్మనఁ డొక్కఁడైనఁ; బరికింపదు నేలయుఁ; బిట్టగూడ నీ
డమ్మునఁ గీచుకీచన; దెటం జివురాకయినం జలింప; దీ
వెమ్మెయి మచ్చుమందు నొలికించితొ ద్రష్టలపై? విచిత్రకా
ర్యమ్ములు సేయు నీ వెవఁడవయ్య, వచింపుము సౌఖికుండవో?

ఉ. పవానముఁ బూనియుంటె; గుహామధ్యమున న్మనుచుంటె; పారవ
శ్యానఁ దనర్చుచుంటె; వణిమాదుల నేర్పునుగంటె; క్షుత్తృడా
ధీనముగాని మన్కి గడిదేజితి యోగివిధంబునన్; నిజం
బైనభవచ్చరిత్ర దెలియంబడ దెంతటి సౌఖికుండవో?

ఉ. వేదురు గూబమూఁకలకు విందులువెట్టెడు కీచురాలతో
నేదియొ ముచ్చటాడెద; వొకించుక సేపయినన్ శ్రమమ్ము పెం
పేదఁగ నిల్వ వొక్కెడఁ, జరింతు మహీతలమెల్ల; సౌఖ్య సం
పాదిభవ త్ప్రసక్తి; దెలుపంగదె నీకలిదండ్రు లెవ్వరో?

సీ. ఒక్కొకవేళ నల్దిక్కులకుం బాఱి, గండడంచును ఘటోత్కటమదంబు
ఒక్కొకకాలమం దుబ్బుచుఁ గొండల, పిండు బెండుంబోలె విసరుచుండు
ఒక్కొకసమయమం దుల్లాసముగనుండు, బూపాత్మజాసుఖాశ్లేషణముల
ఒక్కొకప్పుడునింగి కుఱికి నిర్ఘోషభీ,షణవార్షుకాభ్రసంచయము నడఁచు
మిన్నులఁ గానల నల్లతో మేల్మమాఁడు, సాంద్రవటవిటపిచ్ఛాయ సంచరించు
ననెడు నీయానడతవిని యంధకాసు,రునకు బాంధవుండవొకొ; నీవని తలంతు.

వ. నేను సాయంసమయవిహారమున కేఁగి యీపద్యముల వ్రాయునప్పటికి చీకటి యంతరాయముఁ గల్గించుటచే మిత్రులతో నిలుసేరితిని. ఏల నీ యసహిష్ణుత్వము?

సంపూర్ణము

రామాయణమునందలి వానరు లెవరు?

కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు

(వెనుకటి సంచిక తరువాయి)

రావణశబ్దముంగూర్చి

"రావయతీతి రావణః" అని మన పెద్దలు చెప్పుచున్నారు. ఆయర్థమును మనరామదాసుగా రంగీకరింపక శబరభాషతో సంబంధము కలుపుటకై యీక్రింది యపూర్వోత్పత్తిని దెలిపిరి.

"అయినప్పటికి 'రావణ'అనుపదము 'రామేణ్' యొక్క సంస్కృతరూపమేమో? "సవరలు పిల్లికి రామేణ్" అందురు. ఈ యర్థమును కొంచెముగా సూచించు వాక్యములు ఒకటి రెండు మాత్రమున్నవి. "కామరూప మహం భద్రే పశ్యమాం కామదం పతిమ్"
—అరణ్య-౪౯-౪

అని రావణుడు సీతతో చెప్పినట్లున్నది. ఇచ్చట 'కామరూపిణం' అనుపదము 'కామరూపి'కి ద్వితీయా ఏకవచనముగా వచ్చును. అట్లయినట్లయితే 'కామరూపి'అంటే అడవిపిల్లి' అని యర్థమగుచున్నది. ఈయర్థమే తీసుకొనినయెడల 'నేను అడవిపిల్లిని;నన్ను నీభర్తగా వరించుము'ని పైవాక్యమున కర్థమగుచున్నది. పిల్లి మామూలుగా అరచినప్పుడు గాక కోపముతో అరచిన నెంతభయంకరముగా నుండునో అందరకు తెలిసినదే. తన అరుపులచే లోకములనుభయ పెట్టుదునని రావణుడు సీతతో జెప్పెను. 'నాదై ర్భ్యాతవిరావిణమ్' కాన ఈరెండింటినిబట్టి 'రావణ' అనునామము యొక్క అర్థము సూచితమగుచున్నదని భావింపనగును. అందుచే 'రామేణ్' (పిల్లి) అనుశబ్దమునుండియే 'రావణ' అయియుండు నని తలపవలసి వచ్చెను."

ఇది యట్టి పిచ్చివ్రాఁత. రావణశబ్దము పిల్లి యనునర్థముగల 'రామేణ్' అను శబరభాషాపదము నుండి పుట్టినదంట! ఇంతకంటె విచిత్రపు వ్రాఁత యుండఁగలదా? లోకవిద్రావణుం డగు రావణుఁడు పిల్లియెట్లాయెనని దాని సారస్యముఁ జూపుటకుఁగూడ మన రామదాసుగారు యత్నించిరి. శ్రీమద్రామాయణములో 'కామరూప మహంభద్రే పశ్య మాం కామదం పతిం'అని యున్నదఁట. ఈవాక్యములు రావణుఁడు పిల్లి యని తెలుపుచున్నవఁట. తనఘనతను వర్ణించి సీత తన్ను మోహించునట్లు చేసికొనుటకై భిక్షురూపధరుఁడైయున్న రావణుఁడు పలికినపలుకు లివి. ఈవాక్యములనుబల్కిన వెంటనే యాతఁడు తనకామరూపమును విడిచి(సన్న్యాసిరూపమును) విడిచి భీకరమగు నిజరూపమును ధరించెనని యీక్రిందిశ్లోకమునఁ జెప్పఁబడి యున్నది.

"శ్లో. సర్వస్వాన్యం పరిత్యజ్య భిక్షురూపంచ సమ్మతమ్;
స్వరూపం కాలరూపాభం భేజే వైశ్రవణానుజః."

ఇట్టి సందర్భముం బట్టియును, వ్యాఖ్యాతలు వ్రాసినవ్రాఁతలం బట్టియును, నౌచిత్యముం బట్టియును విచారించిచూచిన పైశ్లోకమునందుఁగల 'కామరూపిణం' అను పదమునకు కామరూపమును ననఁగా నిచ్ఛవచ్చిన రూపమును (సన్న్యాసిరూపమును) ధరించినవానిని అని యర్థము చేసికొనవలెనని బాలుఁడైనగ్రహింపకపోఁడు. రావణుఁడు నిజరూపమును విడిచి భిక్షురూపమును ధరించి యుండికదా ఈవాక్యములు పలికెను. వెంటనే యాకామరూపమును అనగా భిక్షురూపమును విడచి నిజరూపమును జూపెనుగదా. కావున నిచటి 'కామరూప'శబ్దమునకు నిచ్ఛానుసారముగా ధరించురూపమని యర్థము చేసికొనవలెను. ఈసందర్భమునంతను విడచి మనరామదాసుగారు 'కామరూపి'యను శబ్దమును దీసికొని దానికి నడవిపిల్లియని యర్థము జేయుదురఁట! ఇది

పెద్దవింత. కాముకుఁడైయుండు రావణుఁడు తన్నుఁ గామించునట్లు చేసికొనుటకై నేను 'కామరూపిని' అనగాఁ 'బిల్లి'ని అని సీతతోఁ బలికెనఁట! పిచ్చివాఁడైన నిట్లు పలుకునా? 'నేను అడవిపిల్లిని నన్ను నీభర్తగా వరింపుము' అని పలికిన సీతకు రావణునందు గౌరవభావమును, మోహమును కలుగునా? కలుగవు గావున 'నేను అడవిపిల్లిని నన్ను వరింపుము' అని రావణుడు సీతతోఁ జెప్పెననుమాట యనుచితము. ఈయనౌచిత్యమును బోఁగొట్టుటకై రామదాసుగారు మఱియొకవింతవాదము లోనికి దిగిరి. నేను బిల్లినన మార్జాలమువలె భీకరమైన ధ్వనిని జేయువాఁడనని యర్థమంట! లోకములో 'వీఁడు పిల్లి' అనినను, 'పిల్లివంటివాఁడు' అనినను, మెత్తనివాఁడని యర్థమగు నను నది సర్వజనవిదితము. ఇట్లుండఁగా 'నేను పిల్లివంటివాఁడనన భీకరమైన రావము గలవాఁడ' నని రామదాసుగారు విపరీతార్థముచేసిరి. "పిల్లి మామూలుగా అరచినప్పుడుగాక కోపముతో అరచిన నెంత భయంకరముగా నుండునో అందరకూ తెలిసినదే." అని రామదాసుగారొక వింతవాక్యమును వ్రాసిరి. పిల్లి కోపముతోఁ గూసినకూఁతలకైన మానవులు భయపడుదురా? ఎలుకలును, ఎలుకలతోఁ దుల్యులును భయపడుదురు. మానవత్వమున్నవాండ్రు భయపడరు. కావున 'నేను పిల్లి'నన 'భీకరమైన రావము గలవాఁడ' నని యర్థము చెప్పుట యసంగతము. అట్టి యర్థము చెప్పవచ్చుననినను రావణునందుఁగల ఘనతను, విశేషమును నిరూపించునది యిది కాఁజాలదు. ఏమన, రామాయణములో భిక్షురూపధారియై రావణుఁడు సీతతో ముచ్చటించు ఘట్టమునందే రావణుఁడే రాక్షసు లెల్లరు కామరూపులని సీతతోనే ముందుగా నీక్రిందివాక్యములను బలికెను.

"రాక్షసానా మయం వాసో
ఘోరాణాం కామరూపిణామ్."

—అర. ౪౮, ౬౨.

రాక్షసు లెల్లరు కామరూపు లనగా పిల్లులని చెప్పువాఁడు తానుకూడ పిల్లినని చెప్పుకొనిన తనయందు విశేష మున్నట్లు సీతకుఁ బొడకట్టునా? కాన 'కామరూపిణం' అనగా 'కామరూపమును ధరించిన వానిని' అని పండితమార్గముగా నర్థముచేయక 'పిల్లిని' అని అర్థముచేసిన సర్వమును ననుపపన్న మగును. రాక్షసు లెల్లరు కామరూపు లని రామాయణములోఁ బలుతావులఁ దెలుపఁబడి యున్నది. ఇఁక నొక నుదాహరణము నిచ్చెదను.

"తే కామరూపిణ స్సర్వే
దంష్ట్రిణః పింగళేక్షణాః."

—యుద్ధ. ౨౦. ౧౪,

తన అరుపులచే లోకమును భయపెట్టుదు నని రావణుఁడు సీతతోఁ జెప్పెను. 'నాదైర్భూతవిరావిణమ్' అని తమవాదమునకుపబలముగా నుండుటకై రామదాసుగారిఁక నొకవాక్యమును లిఖించిరి. 'నాదైర్భూతవిరావిణమ్'అను పదములకును, 'కామరూపమహమ్'అను పలుకులకును భీకరమగు నాదము కలవాఁడనను నర్థమే యగుచో నందులకు రెండువాక్యములు చెప్పనేల? ఒకటి యనవసరమైపోదా? కాన రావణుఁడు సీతతో 'నాదైర్భూతవిరావిణమ్' అనుపదములచేఁ దననాదముయొక్క భీకరతను వెల్లడించెను. కాన 'కామరూప మహం భద్రే' అనుదానికి నర్థము వేఱుగ నున్నదని బుద్ధిమంతు లెల్లరును గ్రహింపుకొనవలసి యున్నది. అది యేది యన: కథాసందర్భముంబట్టియును, కామరూప శబ్దమునకు సుప్రసిద్ధమై యుండు నర్థముం బట్టియును నిచ్చవచ్చిన రూపమును ధరించువాఁడనని యర్థము చెప్పుటయే. ఇంత యేల, 'రామేణ్' అను శబరభాషాపదమునుండి రావణ శబ్దము పుట్టినదని శబ్దశాస్త్రగమనికంబట్టి చూచినను బుద్ధిమంతు లెవ్వరును దలంపఁజాలరు. రామదాసుగారును తాము చెప్పు నర్థమును లోకు లంగీకరింప రనుభీతిని బొందియుండక పోలేదు. కావుననే రావణశబ్దార్థవిచారము చేయఁబోవుచు "రావణుఁడు రాక్షసుడు గాన ననార్యుడే. అయినను వానినామము అనార్యభాషోత్పన్నమైనదని సూచించు వాక్యము లేవియు రామాయణమునందుగానరాకున్నవి" అని లిఖించిరి. ఇంకను హేత్వంతరమునుగూడఁ జూపదలంచి శబరలలో గోత్రములు గలవనియు, అవి మృగనామములు, వృక్షనామములు కలిగి యున్నవనియు, రావణునిది పిల్లిగోత్రము కావచ్చుననియు, నావంశమున నాతఁడు పెద్దగావున నా మార్జాల గోత్రనామమే యతనినామము కావచ్చుననియు వ్రాసిరి.

ఈవిషయమై చర్చించుటకు పూర్వము రావణుజాతిం గూర్చి ముచ్చటించుకొనుట యవసరము కావున నట్లొనర్చుకొందము.

రావణునిజాతి యేది?

వానరులను శబరులని వ్రాసిన రామదాసుగారు రావణాది రాక్షసులనుగూడ శబరులని వ్రాయుట వింతనుబుట్టించుచున్నది. రామాయణమునందు వర్ణింపఁబడిన నావరూపాదులంబట్టి చూచినను, ఆచారాదులం బట్టి విచారించినను, నాగరకతాదుల ననుసరించి యోజించినను రామాదులు నరులనియు, సుగ్రీవాదులు వానరులనియు, రావణాదులు నరాశనులనియు, వీరు మువ్వురు వేఱువేఱుజాతులవారనియు కరతలామలకముగాఁ దెలియగలదు. ఇట్లుండగా రావణాదులును సుగ్రీవాదులును గూడ శబరులేయనియు, వారిభాష శబరభాషయే యనియు వ్రాయుట వింతను బుట్టించుచున్నది.

"సవరలు, గదబలు, అసురులు, ముండారీలు, మొదలైనవారందరూ ఒక్కజాతిలోనివారే యని శ్రీ గ్రియర్సన్ దొరగారు నిర్ధారణచేసిరి."

అని రామదాసుగారు వ్రాసిరి. గ్రియర్సన్ దొరగా రుదాహరించిన అసురులు మధ్య హిందూస్థానమందుఁగల యాటవికులుగాని పూర్వకాలమునందు లంకలోఁ బరిపాలించిన యసురులు కారు. అసుర నామ మున్నంతన మన నవనాగరకు లిప్పుడు చెప్పు ననార్యజాతిలోఁ బడవేయ వలనుపడదు. సరస్వతి యసురగా వేదములందే తెల్పఁబడియున్నది. ఇంతమాత్రముచే నామె ననార్యజాతిలోనిదానిఁగా నెంచవచ్చునా? రావణుఁడు బ్రహ్మపౌత్రుఁడని తెల్పఁబడియున్నది; అనగాఁ బ్రహ్మకులుఁడే. అతనిభాష సంస్కృతము. ఈయంశము హనుమద్వాక్యములవలన నిదివఱకుఁ దెల్పఁబడియే యున్నది. అశోకవనమునం దున్న సీతతో సంభాషింపఁ బోవు నప్పుడు హనుమ యేభాషతో ముచ్చటింపవని శంకించుకొని సంస్కృతమున ముచ్చటించిన రావణుఁడని తల్లంచును గావున నట్లు చేయ వలనుపడదని భావించెను. దీనింబట్టి సంస్కృతము రావణుని సహజభాషయని తేలుచున్నది. ఇంతయేల? రావణుఁడు పెద్దవేదవేత్త. ఒక్క రావణుఁ డననేల? "అగ్నిహోత్రాశ్చ వేదాశ్చ రాక్షసానాం గృహే గృహే" అని చెప్పఁబడి యున్నది. కాన రావణుఁడు మనవా రిప్పుడు విభజించి చెప్పు నార్యభాష కలవాడు, ఆర్యాచారములు కలవాఁడు, ఆర్యనాగరికత కలవాఁడు కావున రావణుని శబరజాతివానిగా నెంచుట యనుచితము.

భ్రాతృత్వ ప్రశంస

హనుమ రావణునితో నీ భ్రాతయగు సుగ్రీవుఁడని పలికెనఁట.

"అహం సుగ్రీవసందేశా దిహ ప్రాప్త స్తవాలయమ్;
రాక్షసేశ! హరీశ స్త్వాం భ్రాతా కుశల మబ్రవీత్."
—సుందర. ౫౧, ౨.

ఆహేతువుచే రావణుఁడును, సుగ్రీవుఁడును నొక్కజాతివారే యని మన రామదాసుగారు తలంతురఁట! ఇది గొప్పచోద్యము. సార్వలౌకికసౌభ్రాతృత్వముం గూర్చి (Universal brotherhood) విశేష చర్చ జరుగుచుండు నిక్కాలమున భ్రాతృపదప్రయోగమాత్రముచే జాతియొక్కటేయని నిర్ణయింపఁబోవుట వింతకాదా? మనవార లిప్పుడు మహమ్మదీయులు, ఆంగ్లేయులు మున్నగువారిని 'సోదరులారా' యని పిలుచుచున్నారు. అంతమాత్రముచే వీరెల్లరు నేకజాతివా రగుదురా? అట్లే యీవిషయమును తీసికొనవలెను. సార్వలౌకిక సౌభ్రాతృత్వ మనునది పూర్వకాలమునందును కలదు. కాన నాకాలమున స్వేతరజాతులవారినిఁగూడ మర్యాదకొఱకై భ్రాతలని పలుకుట కలదు. అట్లు కాదందురేని మనరామదాసుగా రార్యజాతిలోనివాఁ డని భావించు శ్రీరాముఁడుఁగూడ శబరజాతిలోనివాఁడే కావలసివచ్చును. ఎందుచేతనన, శబరజాతివానినిగా మన రామదాసుగా రెంచు నాంజనేయుని శ్రీరాముఁడు సోదరా యని పిలిచియున్నాఁడు. సోదరశబ్దప్రయోగముచే జాతియొక్కటియని చెప్పునెడల రామాయణమునఁ దెల్పఁబడిన వారెల్లరును నొక్కజాతివారే యగుచున్నారు. కాన రామదాసుగారివాద మసంగతము. రాక్షసులు వేఱు; వానరులు వేఱు; నరులు వేఱు. రావణుఁడు బ్రహ్మకులుఁడగు నార్యజాతివాఁడు కాని మనవారు

తలంచు ననార్యజాతిలోనివాఁడు కాఁడు. కావున నతనికిఁ బిల్లిగోత్రము తగిలించుట యసంగతము. న్యాయముచేఁ బిల్లిగోత్ర మనునది కలదని చెప్పుటకే యవకాశము కాన్పించుటలేదు. పిల్లిగోత్ర మనునది పూర్వము శబరులలో నుండెడిదేమోయని రామదాసుగా రూహింపఁజొచ్చిరి. ఆయూహ కాధార మేదియులేదు. కాన మనరామదాసుగారు శబరులలోని 'రామేణ' శబ్దమునకును, రావణశబ్దమునకును ముడిపెట్టఁజూచుట సర్వవిధముల నసంగతము. ఇంతకంటె 'రామేణ' శబ్దమునుండి రామశబ్దము పుట్టినదనినను గొంతబాగుండునేమో! అందు ధ్వనిసాదృశ్యము హెచ్చుగాగలదు. రావణశబ్దవిషయమున నదియును లేదు. రామదాసుగారేయే శబ్దములంబట్టి వానరభాష శబరభాషయని ఋజువుచేయఁ బ్రయత్నించిరో యాశబ్దములఁగూర్చి మనమిందు విపులముగఁ జర్చించుకొనియున్నాము. ఈచర్చవలన రామదాసుగారు రామాయణస్థపదములకు శబరభాషాసంబంధము బలాత్కారముగాఁ దెచ్చిపెట్ట విపరీతప్రయత్నముచేసి సత్యమునకు దూరమగు వ్రాఁతను వ్రాసిరని తేలుచున్నది. వానరుల భాష శబరభాష యనుటకుఁ దగిన ఋజు వేదియులేదు. ఏవో కొన్నిధ్వనులపోలికనుబట్టి మన రామదాసుగారు కల్పించినరీతిగా మన యపూర్వకల్పనములను చోటిచ్చి వారి భాషయేదో నిరూపింపఁ బ్రయత్నింతుమేని లోకమునంగల భాషలలో నాంగ్లము, తురుష్కము, శర్మణ్యము, ఫ్రెంచి మున్నగు భాషలతోఁగూడ సంబంధము కల్పింపవచ్చును. కాన రామదాసుగారు వ్రాసినదానియందు విశేషమేదియును లేదు. అయినను ఒట్టుపెట్టి శబరులతో వానరులకు సంబంధము కలుప మన రామదాసుగా రేల ప్రయత్నించిరన వానరులు వానరులు కారనియు, వారికిఁ దోఁకలు లేవనియు రూఢిచేయుటకై వీరీయెత్తెత్తిరి.

వానరు లెవరు?

శ్రీమద్రామాయణమున వర్ణింపఁబడిన వానర దేహాదుల స్థితిగతులంబట్టిచూడ వారు పరిపూర్తినందిన మానవదేహము కలవారు కారనియు, మానవత్వ మర్కటత్వములకు మధ్యజాతివారుగాఁ గాన్పించుచున్నారనియు నేనిదివఱకే వ్రాసియున్నాను. వానరులు శబరులై యున్న యెడల శబరింగూర్చి ముచ్చటించుచున్న రామాయణ మాశబరికిని, వానరులకును సంబంధమున్నట్లు చెప్పియే యుండును. కానను వానరులకును, శబరులకును సంబంధము కలుపరాదు.

వానరశబ్దపర్యాయములం గూర్చి:

రామాయణమునందు రామాదులు నరులుగను, సుగ్రీవాదులు వానరులుగను రావణాదులు రాక్షసులుగను వర్ణింపఁబడియుండిరని ఇదివఱకే వ్రాసియున్నాను. నరశబ్దపర్యాయములన్నియు రామాదులవిషయమునను, వానరశబ్దపర్యాయములన్నియు సుగ్రీవాదుల విషయమునను, రాక్షసశబ్దపర్యాయములన్నియు రావణాదుల విషయమునను మనరామాయణమున వాడఁబడియున్నవి. దీనింబట్టి సుగ్రీవాదుల రామాయణకర్త శబరాదినరులుగాఁగాని, అసురాది రాక్షసులుగాఁగాని యెంచలేదని తేలుచున్నది. కోఁతి యను నర్థమిచ్చుపదములే సుగ్రీవాదుల విషయమున సదా వాడఁబడి యున్నవి.

"కోఁతి యని యర్థమిచ్చే పదములలో కొన్ని మాత్రమే రామాయణమున ఉపయోగింపబడియున్నవి."

అని రామదాసుగారు వ్రాసిరి. ఇది యంతగా సత్యమగు వ్రాఁతగాఁ గాన్పింపదు. వానరపద పర్యాయము లమరమునం దీక్రిందిరీతి నీయఁబడియున్నవి:

"కపి ప్లవంగ ప్లవగ శాఖామృగ వలీముఖాః, మర్కటో వానరః కీశో వనౌకాః" అని. వీనిలో వలీముఖ మర్కట కీశశబ్దములు తప్ప తక్కిన వన్నియు రామాయణమున వాడఁబడియున్నవి. మరియు నీనిఘంటువునందు లేని హరి, వనచార, వనకోవిద, కాననౌకసశబ్దములుకూడ రామాయణమునందుఁగాన్పించుచున్నవి. కాన కోఁతి యను నర్థమిచ్చు పదము లించుమించుగా నన్నియు రామాయణమున వాడఁబడిన వనఁదగినదికాని కొన్నిమాత్రమే వాడఁబడిన వనఁదగదు. ఈవిషయమై రామదాసుగారే యిట్లు వ్రాసిరి:

"'వానర' అనుపదము ౧౦౫౦ సార్లున్ను, హరి, ౫౩౫ సార్లు, కపి, ౮౧౧ సార్లు, 'ప్లవంగ' ౨౩౬ మార్లు, 'శాఖామృగ' ౨౨ సార్లు, 'వనచార' ౯ పర్యాయములు, 'వనకోవిద' ౧ మారు, 'వనౌకస' ౮౮ సార్లు,

'కాననౌకస' 8 సార్లు వాడబడియున్నవి. 'మర్కట' అనుపదము ఒక్కసారియైనను ఉపయోగించ లేదు. కాన స్వల్పముగావాడిన పదములు ప్రాసకొఱకు, ఛందస్సు కొరకు ఉపయోగించినట్లు అగపడుచున్నవి."

"విశేషపర్యాయములు ఉపయోగించబడిన పదముల నెట్లు సమర్థించనగును? వనమునందుండేవారు గాన వానరులైరి. కొన్నిచోట్ల కవియే 'వానర' అనుపదమును 'వనచారీ' అనుపదముచే వారిని నిజస్వభావమును దెలియజేసెను. వేగముగా పరుగెత్తేవారు గాన 'ప్లవంగము' పదము సార్థకమైనది."

సుగ్రీవాదులవిషయమున రామాయణమున వాడఁబడిన వానరాదిశబ్దము లన్నియు సార్థకము లని మాప వచ్చునని వీరు వ్రాయించిరి. ఇది వింతను బుట్టించు చున్నది. వాల్మీకివంటి మహాకవి సార్థకములుగాని వ్యర్థ పదములఁ దన కావ్యమున వాడునా? సార్థకము లనగా మానవపరముగా సార్థకములని రామదాసుగారి తాత్పర్యమేమో? అయినను నట్లు తెల్పుటకును నవకాశము కానిపించుట లేదు. 'వనమునందుండేవారు గాన వానరులైరి' అని రామదాసుగారు వ్రాసిరి. ఇదితప్పు. వనమునందుండువారు వనస్థులగుదురు గాని వానరులు కారు. శబ్దశాస్త్రము నెఱిఁగినవార లీశబ్దమునకు రెండర్థంబులం దెల్పిరి. 1. (వా + నర) వా-పక్షముచేత నైన నరులు— అనగా నరులకంటె తక్కువవారు. 2. (వాన + ర) వన సంబంధములగు ఫలాదులను గ్రహించువారు. శబ్దశాస్త్రముంబట్టి యీ యర్థములుమాత్రమే వచ్చునుగాని వనమందుండువారు అను నర్థము రాదు. ఈ యర్థము నిమిత్తమైయే రామాయణమున వానరశబ్దము వాడఁబడి యున్న యెడల నయ్యది వనమునందుండు మునులు, సింహాది మృగములు, రాక్షసులు మున్నగువారిని దెల్పుటకుఁగూడ నందువాడఁబడియే యుండును. అట్టియర్థమిచ్చునట్లుగా నీశబ్దము వాడఁబడకపోవుటయే కాక సుగ్రీవాదిజాతి నొక్క-దానిని దెలుపుటకే యివి వాడంబడి యున్నవి. కాన వనమునందుండువారను నర్థమిచ్చుటకై ఈపదము రామాయణమున వాడఁబడెనని తెలుపు టసంగతము.

ఇంకను శాఖామృగాది శబ్దములు తక్కువపర్యాయములువాడఁబడెననియు, కాన నవిప్రాసకొఱకో, ఛందస్సుకొఱకో వాడబడినవిగా గ్రహింపవలెననియు వీరు వ్రాసిరి. కాని యిదియు నసంగతమే. ఇది తెలుఁగు కావ్యము కాదు. సంస్కృతకావ్యము. ప్రాసాదు లిందు ప్రధానములు కావు. ఇందున్న ఛందస్సైనను విశేషము నక్షరనియమముగల వృత్తములతోఁగూడినదిగాదు. కాన ఛందస్సునకై కక్కురితిపడ నవసరము లేదు. కాన శాఖామృగాదిశబ్దములు నిరర్థకముగా ప్రాసముకొఱకో, యతికొఱకో, ఛందస్సుకొఱకో వాడంబడినవి గావు. అవి సార్థకములే. అనఁగా వానరులందుగల మృగత్వాది లక్షణములను దెల్పునవియే. గ్రంథవిస్తరభీతిచే శాఖామృగశబ్దముంగూర్చిమాత్ర మిచ్చట వివరించుచున్నాఁడను. శాఖామృగశబ్దము రామాయణమునందలి వానరులు మృగము లనుభావము గూఢిచేయుటకయి వాడఁబడియున్నది. చాటుననుండి తన్నుఁగొట్టినందులకై వాలి నిందింప శ్రీరామచంద్రుఁ డీక్రిందిరీతిని సమాధానము చెప్పియున్నాఁడు.

"యాంతి రాజర్షయ శ్చాత్ర మృగయాం ధర్మకోవిదాః,
తస్మా త్త్వం నిహతో యుద్ధే మయా బాణేన వానర!
అయుధ్య న్ప్రతియుధ్య న్వా యస్మా చ్ఛాఖామృగో
[హ్యసి. ౪౨.—కిష్కింధ-౧౮.

(ధర్మమును నెఱింగిన రాజర్షులు మృగములను జంపుటకు వేఁటాడుచున్నారు. అందుచేత నీవు శాఖామృగమవగుటచే నీవు యుద్ధముచేసినను చేయకపోయినను నిన్ను బాణముతోఁ గొట్టిచంపితిని.)

దీనింబట్టి వానరులు నరులుకారనియు మృగములలోఁ జేరఁదగినవారనియుఁ దెలుపుటకై కవి యిచట శాఖామృగశబ్దమును వాడినాఁడని తేలుచున్నది. కిష్కింధాకాండమందు రామాదులనుగాంచి జంకుచున్న సుగ్రీవునిఁగూర్చి హనుమంతుఁడు పల్కిన

"అహో! శాఖామృగత్వం తే వ్యక్తమేవ ప్లవంగమ;
లఘుచిత్తతయాఽఽత్మానం న స్థాపయసి యో మతౌ"
—౨ సర్గ. ౧౬. శ్లో.

శ్లోకమువలనఁగూడ వారల బుద్ధిహీనతగల మృగత్వము తేటపడుచున్నది. మర్కటశబ్దమును కవి వాడలేదనియు, నట్లు వాడకుండుట తమకనుకూలమనియు, రామ

దాసుగారు లిఖించిరి. అది యాయుక్తము. వానరాది శబ్దములు సుగ్రీవాదులజాతి నెంతవఱకుఁ దెలుపునో యంత వఱకే మర్కటశబ్దమును దెలుపును దీనియందుఁగల విశేష మేదియును లేదు. ఇంతయేల రామాయణకర్త వానరులు క్రోఁతులని తెలుపఁదలఁచినాఁడని మనరామదాసుగారే తుద కంగీకరించి యీక్రిందరీతిని వ్రాసిరి. "ఇట్లు అన్ని పదములు సార్థకములేయని చూపవచ్చునుగాని 'కపి' అను పద మెట్లు సార్థకమగును." ఈకపియనుపదము వాడఁబడి యుండుటచే రామాయణమునందలి వానరులను క్రోఁతులనుగాఁ గవి వ్రాసెనని మన రామదాసుగా రంగీకరించిరి. ఏవిధముచేతనైననేమి, తుదకు సుగ్రీవాదులు క్రోఁతుల కుండు లక్షణములు కలవారుగా నున్నారని మన రామదాసుగా రంగీకరించితీరవలసివచ్చినది. ఆ వానరలక్షణమేదన: తోఁకగలిగియుండుటయనియు, మన రామదాసుగా రంగీకరించియునుగూడ మరల రామాయణస్థ వానరులకుఁ దోఁకలున్నవనినందులకై నన్నిట్లు పరిహసించిరి.

"ఈవానరులకు తోఁకలున్నవని స్థాపించుటకు శ్రీ శాస్త్రిగారికి ఆధారము బెషూనాల్యాండులో దొరకిన పుఱ్ఱెయొకటిన్ని, బార్నియో అడవిలోనున్న ఒకజాతి మనుష్యులునఁట! అట్టి పుఱ్ఱెలుగల మానవజంతువొకటి యుండియుండవచ్చును. చిన్నచిటికెనవ్రేలంత తోఁకగలిగిన మానవజంతువులు ఉండవచ్చును. కాని, ఆయాధారముపైన రామాయణమునందు వర్ణింపఁబడినవానరులకు నిజమైన వాలములున్నవని స్థాపించుటెట్లు?"

రామదాసుగారిట్లు వింతలపై వింతలు వ్రాయుచున్నారు. రామాయణమునందలి వానరులకు నిజమైన తోఁకలున్నవని స్థాపించుటకు నాకు బెషూనాల్యాండులో దొరకిన పుఱ్ఱెయొకటిన్ని, బార్నియో అడవిలోనున్న ఒకజాతిమనుష్యులు నాధారమఁట! ఇది విచిత్రపువ్రాఁత. బెషూనాల్యాండులో దొరకిన పుఱ్ఱెయును, బార్నియో అడవిలోనున్న ఒకజాతి మనుష్యులును రామాయణమునందలి వానరులకుఁ దోఁకలున్నవనుటకై నాకు మూలాధారమై యుండలేదు. శ్రీమద్రామాయణమే నా కందులకు మూలాధారము. దానినిఁబట్టియే సుగ్రీవాదులకుఁ దోఁకలుగలవని యస్మదాదులము తెలుపుచుంటిమిగాని యొక్కడనుండియో లేనిపోనికారణముల దెచ్చికాదు. రామాయణస్థవానరులకుఁ దోఁకలుగలవనుటకు మాకుఁగల ముఖ్యాధారము శ్రీమద్రామాయణమే యని రామదాసుగారు తెలిసికొందురుగాక! వాల్మీకి చెప్పని తోఁకల నేను జెప్పలేదని గ్రహించుకొందురుగాక! వానరులకుఁ దోఁక లున్నవన్నందులకై నన్నుఁ బరిహసింపఁబోయిన శ్రీరామదాసుగారు తుదకేవో తోఁకలు తాము చెప్పు శబరవానరులకుఁగూడఁ గలవని యంగీకరింపవలసినవారయిరి. ఈవిషయమై వారిట్లు వ్రాసిరి:

"సవరవారలలో నొకజాతికి 'కోఁతు'లని వారి భాషానామ మొకటియున్నది. 'అర్సి' లేక 'అరిశి' అనగా సవరభాషలో 'కోఁతి' అని యర్థము. వీరికి సామీప్యములో ఉండు ఓఢ్రులు ఈ 'అర్సి' జాతివారిని 'లంబో లంజియా' (పెద్దతోఁక గలవారు) అని పిలుతురు.

"A tribe of savaras is called Arsi or arisi which means a monkey in the language of the Savaras. By their Oriya neighboars they are called 'Lambo Lanjia. (Long tailed) which is the Oriya equivalent to Arsi. They got the name from a long piece of cloth which the males allow to hang down.—(Castes and tribes of S.India, Thurston.)

ఈ అర్సి అనునామము మొగవారి బట్టకట్టువలన ఆజాతికి వచ్చినది." అనియు,

"రామాయణమునందు చెప్పియున్న వానరులు వీరు. కొండలపైనుండు సవరలు వీరలలో మొగవారు బట్టకట్టినప్పుడు తోఁక వదులుదురు గాని వీరికి 'అర్సి' (కోఁతి) జాతియని పేరు వారివారే చెప్పుదురు. నేటికిగూడ ఈజాతివారట్లే తోఁకవదలి బట్టకట్టుదురు. గవర్నమెంటు లెక్కలలో సహిత మీజాతివారికి 'లంబో లంజియా' జాతియని ఓఢ్రపునామము వ్రాసియున్నది. ఆకాలములోగూడ నిటువలెనే 'అర్సి' అను సవరనామములకు 'కపి' అని సంస్కృతములోనికి మార్చి చెప్పిరే కాని వారు నిజముగా తోఁకలుగల కోఁతులుగారు" అనియు మనరామదాసుగారు లిఖించియుండిరి. రామాయ

ణమునందలి వానరులకుఁ దద్దేహాంగములగు చర్మవాలములు గలవని నేను వ్రాసినాను. అట్లు వ్రాయుటకు నాకుఁ గల యాధారము శ్రీమద్రామాయణము. మన రామదాసుగారు రామాయణస్థ వానరులకు దేహాంగములగు చర్మవాలములు లేవనియు, వారు గుడ్డతోఁకల (గోఁచీల) ధరియించెడివారనియు, కావునఁ గపినామము గలవారైరనియు లిఖించిరి. ఇందులకు వారికిఁగల మూలాధారమిప్పటి సవరలంగూర్చి Thurston దొర వ్రాసిన వ్రాఁతలు. తెల్లదొరవ్రాఁతల నాధారముచేసికొని రామాయణస్థవానరులకు గుడ్డతోఁకలఁ దగిలించిన మన రామదాసుగారు వాల్మీకి రామాయణముం బట్టి వానరులకు దేహాంగములగు సత్యవాలములు కలవనిన నన్ను నీవే యాధారముంబట్టి యట్లు వ్రాసితివని శంకింపఁజొచ్చిరి. Thurston దొరగారైనను నీగుడ్డ త్రోఁకలుగల 'అరిశి' యను పేరుగల శబరులే రామాయణస్థవానరులని వ్రాసియుండలేదు. ఇక్కాలపు శబరులలో 'అరిశి' నామకము తెగకు గుడ్డతోఁక లుండుటచే వారి'కరిశి' అనగా క్రోఁతుల పేరు వచ్చినదని వారువ్రాసిరి. ఇట్టి వీరినిఁ దీసికొనిపోయి మన రామదాసుగారు రామాయణస్థవానరులఁ గావించిరి. కావున, రామాయణస్థవానరులకు గుడ్డతోఁక లుండెడివని తెలుపుటకుఁ దమసాహసమే యాధారముగాని మఱియే యితరాధారమును లేదు ఇక్కాలమునఁ గోఁతి యనునర్థమిచ్చు 'అరిశి' యను శబరజాతియొకటి యుండుఁగాక! ఆజాతివారికి వారిలోని మగవారు ధరించు గుడ్డతోఁకలంబట్టి వారికా పేరు వచ్చుఁగాక! వీరే రామాయణస్థ వానరులనుట కాధారమేది? ఏదియును లేదు. రామాయణస్థవానరులఁ దెలుపుటకై కవి యెచ్చటనైన 'అరిశి' పదమునుగాని, 'లంబోలంజియా' పదమును గాని యాపదముల సంస్కృతరూపములనుగాని వాడియుండిన యెడల వీరే వారనుటకు అవకాశ ముండియుండును. అట్టిపదములను నేనిని వాల్మీకి వాడియుండలేదు. దక్షిణాపథమునందు నివసించువారినిగూర్చి తెలియఁజేయునపుడు తద్భాషాపదములనే వాడుట వాడుక అగియును, అట్టివి రామాయణమునందుఁ గలవనియునుగదా మన రామదాసుగారు వ్రాసియున్నారు. గుడ్డతోఁకలు ధరించిన కారణమున(గోఁతి) 'అరిశి' యను పేరుతో వ్యవహరింపఁబడు చున్న సవరలే యున్నయెడల వారే శ్రీమద్రామాయణస్థవానరు లనుతలం పున్నయెడల వారిభాషలో వారి కున్న వ్యావహారిక నామమునొక్కసారియైన నెత్తకుండునా? కావున గుడ్డతోఁకలు ధరించినకారణమునఁ గోఁతులని పిలువఁబడిన 'అరిశి' యను సవర తెగవారే రామాయణస్థవానరు లనుటకు నవకాశ మింతయుఁ గాన్పించుట లేదు. ఈ 'అరిశి' యను సవరలు తాము సుగ్రీవాదుల సంతతివార మని చెప్పుకొనుచున్నట్లును గానరాదు. 'Thurston' దొర దక్షిణదేశవాసులంగూర్చి తాను వ్రాసిన గ్రంథములో 'అరిశి' యను సవరలు గుడ్డతోఁకలు ధరింతురు కావున క్రోఁతులని పిలువఁబడుదురనియు, వారి నోఢ్రులు 'లంబోలంజియా'లందురనియు వ్రాసెనే కాని ఈ 'అరిశి' తెగవారు తాము సుగ్రీవాదుల సంతతివారమని చెప్పుకొందురని వ్రాయలేదు. అట్టి వాడుక కలదని సూచించుటకైన మనరామదాసుగారి కవకాశము చిక్కలేదు. కాన నీ 'యరిశి' తెగవారికిని రామాయణస్థవానరులకును సంబంధముకలదనుట యసంగతము.

మొహరం పండుగలో రంగులతోఁ బులిచారలు దాల్చి కాగితపుఁదోఁకలధరించి పులి యనిపిలువఁబడువారు నిజమైన పులులతో సంబంధముకలవారని యెట్లు తెలుపఁగూడదో గుడ్డతోఁకలఁ గట్టుకొని కోఁతుల మనువారిని గూడ పూర్వపువానరులని యట్లే తెలుపరాదు. వీరిని బట్టి రామాయణస్థ వానరులతోఁకలును గుడ్డతోఁకలే యనుట మహాసాహసము కాదా?

రామాయణస్థవానరులతోఁకలు గుడ్డవియా?

రామాయణస్థవానరులవాలములు సహజములుగాక కృత్రిమములనికాని, గుడ్డవి యనికాని రామాయణము తెలుపుచున్నయెడల నప్పుడు రామాయణస్థ వానరులకును 'అరిశి' యను పేరుగల సవరలకును సంబంధము కలదని చెప్పవచ్చును. కాని రామాయణముంబట్టి చూడ సుగ్రీవాదుల వాలములు గుడ్డలతోఁ జేయఁబడిన కృత్రిమ లాంగూలములుగాఁ గానిపించుట లేదు సరికదా వారి దేహావయవము లగు సహజవాలములుగాఁ దెలుపఁబడియున్నవి. వారు తమవాలములఁ బైకి నిక్కఁబొడిచినట్లు ముడిచినట్లు ఒకదానికిఁ జుట్టినట్లు, లాగినట్లు, పెక్కేల? వానితో ననేకకార్యములు చేసినట్లు తెలుపఁబడియు

న్నది. హనుమ లంకనుండివచ్చి సీతను జూచితినని చెప్పిన తోడనే అంగదాదులు సంతోషముచే నీ క్రిందిచేష్టలు చేసినట్లు తెలుపఁబడియున్నది.

"కేచి దుచ్చిత్రలాంగులాః ప్రహృష్టాః కపికుఞ్జరాః;
అంచితాయతదీర్ఘాణి లాంగులాని ప్రవివ్యధుః."

ఇది వినినతోడనే కొందఱువానరులు తోఁకల నిక్కఁబొడిచి సంతోషముతో నిండిన మనస్సుకలవారై తమపొడవైన తోఁకలను గదలిచిరి. వానరుల తోఁకలు దేహావయవములుగాక గుడ్డవి యగుచో వానిని వారట్లు చేయలేరు గదా! దీనిఁబట్టి వాలము వీరికి సహజమైన యంగముకాని కృత్రిమముగాదని తెలియవచ్చుచున్నది. రావణుఁడు హనుమతోఁకను దహింపవలసినదని యీ క్రిందిమాటలతోఁ దెలిపెను.

శ్లో. కపీనాం కిల లాంగూల మిష్టం భవతి భూషణమ్;
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు.
తతః పశ్యం త్విమం దీన మంగవైరూప్యకర్శితమ్.
సమిత్రజ్ఞాతయ స్సర్వే బాంధవా స్స సుహృజ్జనాః.
—సుందరకాండ.

(వానరులకు వాలములన నిష్టమెక్కువుకాన వీరి వాలము తగులఁబెట్టవలసినది. అంగవైకల్యము గలిగి దీనుఁడై యుండు వీనిని బంధువులు మిత్రులు మున్నగువారు చూతురుగాక! అని దీని తాత్పర్యము)

ఇందు వాలము దేహాంగమని తెలుపఁబడియున్నది. ఇది గుడ్డతోఁకయే యగునెడల వానికి సహజముగు నంగవైకల్యమెట్లు కలుగఁగలదు? దానఁ దానెట్లు దీనుఁడు గాఁగలఁడు? గుడ్డతోఁకయే యగునెడల నొకటి పోయిన మఱియొకటి సంపాదించుకొని యుండఁగలుగునుగదా! అదిగాక యాంజనేయుని పుచ్ఛము గుడ్డదియే యగుచో దానిఁ దగులఁబెట్టుటకై వేఱుగ గుడ్డలఁ జుట్టఁ బెట్ట నవసరములేదు. ఆ గుడ్డవాలమును జమురులో ముంచి యంటించిన నిమిషములో దగ్ధమయిపోవును గదా! రాక్షసు లట్లుచేయక కేసరీనందనుని వాలమునకు జీర్ణవస్త్రములనుజుట్టి చమురులో ముంచి యంటించిరి.

"వేష్టయంతి స్మ లాంగూలం జీర్ణైఃకార్పాసకైః పటైః;
సంవేష్ట్యమానే లాంగూలే వ్యవర్ధత మహాకపిః.
శుష్క మింధన మాసాద్య వనే ష్వివ హుతాశనః,
తైలేన పరిషిచ్యాథ తేఽగ్నిం తత్రాభ్యపాతయన్."

దీనింబట్టికూడ హనుమంతుని వాలము కార్పాస పటకల్పితమైన కృత్రిమము కాదనియు సహజమైన దేహావయవమనియుఁ దెలుమన్నది. కావున దేహావయవ మగు వాలముగల సుగ్రీవాదులకును,కృత్రిమమగు కార్పాసవాలమును దగిలించుకొని తోఁకలనిపించుకొనిన 'అరిశ' యను సవరలకును ఏవిధమగు సంబంధమును లేదు. ఇప్పుడున్న జాతులవిశేషములఁ బరికించిచూడఁ గిష్కింధావాసుల సంతతివారమని చెప్పుకొను జాతులుగూడఁ గాన్పించుచున్నవి.

ఈవిషయమై 'Tylor's primitive culture' అను గ్రంథములో నిట్లున్నది:

"The Jaitwas of Rajputana, a tribe politically reckoned as Rajputs, neverthe less trace their descent from the monkey God Hanuman and confirm it by alleging that their princes still bear its evidence in a tail like prolongation of the spine, a tradition which has probably a real ethiological meaning pcinting out the Jaitwas as if Non-Aryan race"—

దీనింబట్టి రాజపుత్రస్థానమందుఁగల జైత్వాలనఁ బడు రాజపుత్రులు తాము హనుమంతుని సంతతివారమని చెప్పుకొందురనియు, సందులకుఁ దార్కాణముగాఁ దమ ప్రభువుయొక్క వెన్నెముక తోఁకలాగుండునట్లు ముందునకు సాఁగియుండునని చెప్పుదురనియుఁ దేలుచున్నది. దీనింబట్టి యేదో తోఁకను గల్పించుకొని రామాయణమునందలి కిష్కింధాపురస్థులతో సంబంధము కలుపుకొనుజాతులు కొన్ని మనదేశమున గలవని తేలుచున్నది. ఇందువలన రాజపుత్రస్థానమందలి జైత్వాలు రామాయణస్థవానరు లగుచున్నారు. ఆవానరులు సవరలని తెల్ప రామదాసుగారు ప్రయత్నించుచున్నారు. ఆవానరు లాంధ్రులని తెల్ప చిలుకూరి వీరభద్రరావుగారుద్యమించుచున్నారు. వారివారి యూహాలనుబట్టి రామాయణస్థ వానరులు వివిధజాతులక్రింద మారిపోవుచు

న్నారు. ఇవన్నియు నిటీవలివారికల్పనలు. మనము నమ్మఁదగినవి కావు.

రామాయణస్థ వానరులకును, సవరలకును గల యితరసంబంధములు

రామాయణస్థ వానరులకును, సవరలకును భాష యొక్కటియేయని ఋజువుచేయ మన రామదాసుగారు యత్నించిరి; కాని ఆవాద మెంతమాత్రమును దృష్టికరముగ లేదు. నేను పైనచేసిన చర్చవలన నిది తేలుచునే యున్నది. ఇంక గడ్డతోఁకలఁదాల్చుసవరలే ('అరిశి' తెగవారే) రామాయణస్థ వానరు లనుటకై మఱికొన్ని యత్నములఁ జేసిరి. వాని నీక్రింద విమర్శించు చున్నాఁడను.

రామాయణస్థ వానరస్త్రీలకుఁ దోఁకలు లేవా?

'అరిశి' తెగసవరలలోఁ బురుషులుమాత్రమే గుడ్డతోఁకలను ధరింతురఁట! శ్రీమద్రామాయణమునఁగూడఁ బురుషులకుమాత్రమే తోఁకలున్నట్లు తెల్పఁబడెఁ గాని స్త్రీలకున్నట్లు తెల్పఁబడలేదఁట. ఆహేతువుచే నీ'అరిశి' తెగవారే రామాయణస్థ వానరులనిమనరామదాసుగారు భావింతురఁట! ఇది పెద్ద వింత. ఏమన, రామాయణమునందుఁ బురుషులకుమాత్రమే లాంగూలము లున్నవనియు స్త్రీలకు లేవనియుఁ దెలుపఁబడియుండలేదు. రామకథతో సంబంధించునంతవఱకే వానరులకథ రామాయణమునఁ బూర్వభాగమునఁ దెలుపఁబడెఁగాని తత్ప్రత్యేకచరిత్ర వ్రాయుటకై కాదు. కాన శ్రీరాముని వ్యవహారముతో సంబంధముగల పురుషులచరిత్రమే విశేషముగా నందుఁ దెల్పఁబడెఁ గాని స్త్రీలవిషయ మంతగాఁ దెల్పఁబడి యుండలేదు. అందుఁ దారయొక్కతెయే ప్రవేశపెట్టఁబడినది కాని తక్కిన స్త్రీలెవరును బ్రవేశపెట్టఁబడలేదు. తారావిషయము తెలుపుచోట వాలము గలదని తెల్పనవసరము లేకపోయినది. అందుమూలముచే స్త్రీలవాలము లందు వర్ణింపఁబడియుండలేదు. రామాయణముతో సంబంధములేని సుగ్రీవాదుల పూర్వచారిత్ర ముత్తరకాండమునందుఁ గలదు. దానింబట్టిచూడ స్త్రీలకును వాలములు గలవనియే తేలుచున్నది. ఈవిషయమైన చర్చనంతయు నా మొదటివ్యాసమునఁ జేసియే యున్నాను. కావున స్త్రీలకుఁగూడ వాలములు గలవని రామాయణమును బట్టియే తేలుచున్నది. ఐనను నీచిక్కునుండి తప్పించుకొనుటకై మనరామదాసుగారీక్రిందిరీతిని లిఖించిరి.

"రామాయణమునందుగూడ మొగవారికే తోఁక లున్నట్లు చెప్పియున్నది. కాని ఆడువారికి తోఁకలున్నట్లు చెప్పలేదు. ఉత్తరకాండలో నెచ్చటనో ఒకదగ్గర యున్నదంటే అది తగిన ప్రమాణము గాదు. ఉత్తరకాండలోని హంశములకును కడమకాండలలోని హంశములకును సరిపోసని ఇదివరకొక నిదర్శనము చూపించబడియె."

ఇది యత్యద్భుతపు వ్రాఁత. ఉత్తరకాండములో వానరస్త్రీలకు గూడ నొక్కచోట వాలమున్నట్లుచెప్పఁబడియున్నదని తా మంగీకరించియును గూడ నదియొకచోటనే తెలుపఁబడియున్నది గావున ప్రమాణముగాదని కొట్టివేయఁ బ్రయత్నించిరి. ఇది మహాసాహసముగాదా? ఉత్తరకాండములోని యంశములకును పూర్వకాండములలోని యంశములకును సంబంధములేదని వీరు వ్రాసిన వ్రాఁతనంతను నేనీవ్యాసమున నిదివఱకే పూర్ణముగా ఖండించి యున్నాను. కాన నుత్తరరామాయణము ప్రమాణముకాదనుమాట యప్రమాణవాక్యము. వానరస్త్రీలకు వాలములు కలవనుటకు నేనుత్తరకాండమునుండి యొక్క ప్రమాణమునైనఁ జూపియున్నాను. వారికిఁ దోఁకలు లేవనుటకు మనరామదాసుగా రొక్క ప్రమాణమునైనఁ జూపఁగలిగియుండలేదు. ఉన్నభాగమును నమ్మమని త్రోసివేసి తోఁకలులేవని తక్కినభాగములు చెప్పకపోయినను ఉన్నవని చెప్పనంతన లేవని చెప్పుటగా భావించుట యనర్థము. ఎప్పుడు పురుషులకు వాలములు దెలుపఁబడియున్నవో, యెప్పుడు స్త్రీలకు వాలములు లేవని చెప్పఁబడియుండలేదో, అప్పుడు స్త్రీలకుఁ గూడ వాలములున్నవని తలఁచుట ధర్మము; కాని లేవని తలఁచుట ధర్మముకాదు. ఏమన: లోకమునందుగల జాతులలోఁ బురుషులకు దోఁకలుండిన స్త్రీలకును దోఁక లుండుట చూచుచున్నాము.

పురుషజంతువులకు మాత్రమే వాలములుండి స్త్రీజంతువులకు లేనిజాతు లెచ్చటనుగానరావు. కాన మొదటి షట్కాండములంబట్టి చూచినను, వానరస్త్రీలకు పుచ్ఛ

ము లున్నవని తలఁపవలసిదేకాని లేవని నిర్ధారణముచేయ వలనుపడదు సత్యరతుల కెల్లరకును నట్లు తోఁపకమానదు. వానరస్త్రీలు రామునిచే నయోధ్యకుఁ దీసికొనిపోఁబడినట్లు మనరామదాసుగారు వ్రాసియున్నారు. రావణ సంహారముచేసి లంకనుండి బయలువెడలి యయోధ్యకుఁ జనుచున్న శ్రీరామచంద్రుఁడు కిష్కింధకడఁబుష్పకము నాఁపి వానరస్త్రీలను రప్పించినప్పుడు వారు సీతంగని యీక్రిందిరీతిని సంభాషించుకొనినట్లుగాఁ బూర్వశ్లోక మొకటి కలదు.

> "గాత్రం నరోమశ మనల్పతరేన నేత్రే
> వక్త్రం నరక్తరుచి సీత్కృతయో న సంతి;
> పుచ్ఛం స తుచ్ఛ మపి కే న ధరాతనూజా
> సౌందర్యవర్ణనకథా మధికం వదంతి.—(చాటువు)

దీనింబట్టి యీకవి వానరస్త్రీలకుఁగూడ వాలము లుండెడివని భావించెడివాఁడుగాఁ గన్పించుచున్నాఁడు. అట్లు తలంచుట సహజము కావున మొదటి పట్కాండములందును వానరస్త్రీలకుఁ దోఁక లున్నట్లు దెల్పఁబడియుండలేదు. కాఁబట్టి వారి కవి లేవని తలంచుట భావ్యము కాదు. అదిగాక యుత్తరకాండముం బట్టి వారికిని దోఁకలున్నట్లు తేలుచుచేయున్నది. కాఁబట్టి రామాయణస్థవానరు 'లరిశి' తెగవంటివారు కారు. స్త్రీలకును బురుషులకునుగూడ సహజములగు వాలము లుండెడివి.

గోలాంగూలుల వాలములు:

రామాయణస్థవానరులకు వాలములు లేవనుటకై మనరామదాసుగారిఁక నొక యత్యద్భుతవాదములోనికి దిగిరి. రామాయణములో గోలాంగూలులను వానరులు తెలుపఁబడియుండిరి. గోలాంగూలులనగా (గో + లాంగూల) గోపుచ్ఛమువంటి పుచ్ఛము గలవారని యర్థము. దీనింబట్టి వారికి పెద్దతోఁక లున్నట్లు తేలుచున్నది. ఈబాధనుండి తప్పించుకొనుటకై మన రామదాసుగారీక్రిందివ్రాఁత వ్రాసిరి.

'గోలాంగూలాః' అను పదమునకు గోపుచ్ఛమువంటి పుచ్ఛముగలవారని యర్థము. గోవుతోఁకకుకొనను చామరమువంటి కుచ్చుండును. ఇట్టి కుచ్చు కొండముచ్చుల తోకలకి ఉండేదే! కాన ఈయర్థము సరిపోలేదు.

సవరలు బహుచిత్రముగా నలంకరించుకొందురు. తలజుత్తు నడినెత్తికి యెత్తి ముడివేతురు. అందులో పొడవాటి పిట్టవెండ్రుకలు పెట్టి కట్టుదురు. అవి లేకుంటే జుత్తుమొదట మాత్రమే ముడివైచి మిగిలిన జుత్తును కుచ్చువలె వ్రేలవేతురు.

నడినెత్తిని ఒక్కచుట్టుచుట్టి మిగిలినజుత్తును వ్రేలాడించిన గోపుచ్ఛాకారము స్ఫురించును. కావున 'గోలాంగూలు'లంటే ఇవ్విధముగా జుత్తును వ్రేలాడవేసే సవరవాండ్రని యర్థము."

ఇది విచిత్రపు వ్రాఁత. గోలాంగూలమన గోవుయొక్క తోఁకయని యర్థముగాని దాని చివరనుండు కుచ్చని యర్థముగాదు. లోకములో 'ఆఁ'దోఁకగానున్న దను పద మొకటిగలదు. ఆఁ దోకయనఁగా 'ఆవుతోఁక' యని యర్థము. అనగా మొదట లావుగను చివరసన్నముగను ఉండును. కాన నారీతిగా నుండునదియని యర్థము. ఆఁదోఁకయన మొదట లావుగను చివరసన్నముగను ఉండునది. గోవాలమన నీ లక్షణమే తేలునుగావున నాఁ దోఁకయనుశబ్దమునకు లోకములో పైయర్థమువచ్చినది. కాఁబట్టి గోలాంగూలుల న మొదటలావుగను దుదిని క్రమముగా సన్నముగను నుండు దీర్ఘమైన తోఁకగలవారని యర్థము. ఇదియే సహజమైనయర్థము; కావుననే యట్టితోఁకలుగల కొండముచ్చులు లోకములో బండితులచేతను బామరులచేతనుగూడ గోలాంగూల శబ్దముచేఁ బిలువఁబడుచున్నవి. కనుక రామాయణస్థ గోలాంగూలు లట్టితోఁకలు గలవారుగాని మన రామదాసుగారు తలంచినట్లుగా నెత్తిపై జుత్తుముడిగలవారుకారు. నెత్తిపై నుండు జుత్తుముడిని లాంగూలమనుటకు నెవరును సాహసింపరు. మన రామదాసుగారెట్లైనఁ బట్టిపట్టి వానరుల సవరలఁ గావింప విశ్వప్రయత్నము చేయుచున్నారుగానఁ బై విపరీతార్థమును వ్రాసిరి. పెక్కేల! వాలములవిషయమై మన రామదాసుగారు వ్రాసినదంతయు నసంగతము. 2. రామాయణస్థ వానరులు, సవరలు నొక్కతెగవారే యనుటకు మనరామదాసుగారు మఱియొక నిదర్శనాభాసమును దెచ్చిరి.

సవరలలో అన్న చచ్చినతర్వాత వానిభార్యను దమ్ముఁడు పెండ్లియాడునేకాని తమ్మునిభార్య నన్న

యొన్నఁడును ముట్టఁడఁట. ఈధర్మమునకు వ్యతిరేకముగా వాలి వర్తించినందున రామునికి వాలిని జంపుట కవకాశము చిక్కినదట. ఇదియును శాస్త్రీయప్రశంసయే. రామాయణస్థ వానరులలో ఒకసోదరుఁడు చచ్చిన తరువాత వానిభార్య నింక నొకసోదరుఁడుస్వీకరించుటకలదు; కాని పెద్దవానిభార్య చిన్నవానిభార్య యను విపక్ష లేదు. రాముఁడు సుగ్రీవుఁడు బ్రదికియుండఁగా వానిభార్యను వాలి స్వీకరించినందులకు నిందించెనేకాని తమ్ముని భార్యను నన్న యయియుండియును దాను స్వీకరించినందులకుఁగాదు. ఈవిషయమై రామాయణ మిట్లు తెలుపు చున్నది:

శ్లో. అస్య త్వం ధరమాణస్య సుగ్రీవస్య మహాత్మనః;
రుమాయాం వర్తసే కామాత్ స్నుషాయాం పాప కర్మ కృత్.

తమ్ముఁడుజీవించియుండఁగా తమ్మునిభార్యను స్వీకరించితివి కావున నీవు దోషివి. శిక్షార్హుఁడవు అనిదీనిభావము.

దీనింబట్టి తమ్ముఁడు చచ్చినతర్వాత వానిభార్యను అన్న స్వీకరింపవచ్చుననియే తేలుచున్నది. కాన రామదాసుగారు వ్రాసిన దసంగతము.

3. రామదాసుగారిక నొకకారణము నిట్లిచ్చుచున్నారు.

"పైగ్రామాలకు వెళ్లినప్పుడు పగలల్లా యెవరి పనిమీదవారు పోయి రాత్రికి అందరూ ఒక్కచోటనే చేరియుందురు. ఈయలవాటు వానరులకుగూడనుండెను.

"విచిత్య దివసం సర్వే సీతాధిగమనే ధృతాః;
సమాయాంతి స్మమేదిన్యాం నిశాకాలేషువానరాః"
—కిష్కింధ. ౪౭-౪.

ఇది సందర్భములేని వ్రాఁత. ఇతరగ్రామములకుఁ దమతమ పనులమీఁదఁబోయినవారెల్లరును బనులసందర్భమును బట్టియును, పోయినతావుల దూరాదూరములనుబట్టియును నందఱును రాత్రికి స్వగ్రామము చేరుచుందురు ఇది సర్వమానవ లక్షణము. ఒకసవరల లక్షణము మాత్రమేకాదు. ఒక్కచోటనే గుంపుగాఁగూడుటయందు రాయట్లు వానరులు చేసినట్లుగా రామాయణ మెచ్చటను దెలుపుటలేదు. "విచిత్య" అను పైశ్లోకమునందుఁ దెల్ప లేదాయందురేని యది వానరసామాన్యధర్మము కాదు. సీతను వెదకుపనిమీఁద నియమింపఁబడిన వానరులు పగటిపూట విడిపోయి నానాదిక్కులఁబరిశీలించిచూచి రాత్రిపూట నొకదిక్కునఁ జేరెడువారు. కారణమేమి? తమ కులాచారముంబట్టి కాదు. తాము చేసిన పరిశీలన మొకరితో నొకరు చెప్పుకొని ముందు చేయవలసిన పనింగూర్చి చర్చించుకొనుట కట్లు చేరెడివారు. నాల్గువైపులకును బోయినవారిలో నొకవైపున సీత గాన్పింపవచ్చును. నాటిరాత్రి యామెను గాంచిన వారు తక్కినవారితో నాసంగతి తెల్పిన నిక వెదుకవలసిన శ్రమయే తప్పిపోవునుగదా. ఇట్టిపట్ల సర్వజాతులవారును జేయు పనినే వానరులును జేసిరికాని సవరలవలె నటింపలేదు. కాన వీరు వ్రాసినది సందర్భశూన్యము.

4. మఱియొక విషయములో సవరలకును వానరులకును సామ్యము నీక్రిందిరీతిని జూపుచున్నారు.

"ఇప్పటి కొండజనులవలెనే కిష్కింధావాసులుగూడ తంబురా, తముకు మొదలైన వాద్యములతో పాటలు పాడుకుంటూ ఉత్సవములు చేసేవారు.

గీతవాదిత్రనిర్ఘోషః శ్రూయతే జయతాంవర!
నర్దతాం వానరాణాంచ మృదంగాడంబరైః సహ."

గీతవాదిత్రశబ్దములచే తంబుర, తముకు మాత్రమే గ్రహింపఁబడవు. ఏయేవాద్యములను వానరులు వినియోగించెడివారో దీనివలనఁ దెలియవచ్చుటలేదు. కావున నిందు వారియుభయులకు సామ్యము గుదిరిన దనరాదు.

ఏవిధమునఁ జూచినను సవరలకును రామాయణస్థ వానరులకును సంబంధ మేమాత్రమును గానిపించుటలేదు. రామదాసుగారు, బలాత్కారముగా నట్టిసంబంధమును దెచ్చిపెట్టఁ బ్రయత్నించిరి. అది సమంజసము కాదు. మనరామదాసుగారు వ్రాసిన వ్యాసరాజమువలన నొక్కవిశేషరాజము తేలుచున్నది. అది యేదియన, రామాయణస్థ వానరులకుఁ దోఁకలుండెడివనియు నందుమూలముచే వారు వానరసంజ్ఞనందిరనియుఁ దేలుట. వారితోఁకలు రామదాసుగారు తలఁచినరీతిగా గుడ్డవికావు. సహజములగు దేహావయవములే. ఇట్టి వానరుల బుద్ధివిభవాదులను, నాచారవ్యవహారాదులను దేహనిర్మా

ణాదులనుబట్టిచూడ వీరలిప్పటికి మానవులకును కపుల కును నడిమిజాతివారుగాఁ గాన్పించుచున్నారు. కొంత వఱకు మానవులకుఁ గలిగినట్టి ముఖలక్షణములును, మృగ ములకు గలిగినట్టి లాంగూలాదులును వీరు గలిగియుండు వారు. ఇట్టివారుండుట యసంభవముగాదని ఆఫ్రికా బెహ్వానాల్యాండులో దొరకిన పుర్రెవలనను, బార్నియో అడవిలోనున్న తోఁకగల యొకజాతిమనుష్యుల వలనను బోధపడుచున్నది.

రామాయణస్థ వానరులు బుద్ధివిభవాదులచే నరుల కంటె దక్కువవా రనుటకు గలకారణములను నా మొదటివ్యాసములో నిచ్చియే యున్నాను. వానరులు నరుల కంటెఁ దక్కువవారని రామాయణ మనుగడుగునను దెలుపుచునే యున్నది. వారు ఒకవిధముగా మృగముల లోనివారుగా దెల్పపలసినవారనియు బోధించుచున్నది. వాలికిని రామునకును జరిగిన ప్రసంగ మీవిషయ మధికముగాను వ్యక్తముచేయుచున్నది. ఇట్టిసందర్భము లనేకములు గలవు. నావాదమును నిరసించుటకై రామదాసుగారు "ఆలోచనలో నైతేనేమి, ధైర్యస్థైర్యములందో నైతేనేమి, పరాక్రమమునందైతేనేమి వీరు ఏమానవునకు తీసిపోదురు?" అని వ్రాయించినను,నవరలతోఁగలిపి వానరలక్షణములను జెప్పుటలో వీరు పిఱికిపంద లని స్వహస్తముతోనే యిట్లు వ్రాసిరి.

"పంపాతీరమును వదలి కిష్కింధవైపున వచ్చుచున్న యన్నదమ్ములను జూచి ఋశ్యమూకముపైనున్న సుగ్రీవుడు భయపడి పాఱిపోయినాడట.

ఇప్పుడు సమేతము విశాఖపట్టణము, గంజాం జిల్లాల కొండలప్రాంతమందున్నవారు నాగరిక జనులను జూచినతోడనే పాఱిపోయి దాగుకొనెదరు."

ఇట్టి ధైర్యస్థైర్యములను గనుఁగొని యీవానరులే మానవులకుఁ దీసిపోవుదురని మనరామదాసుగారు నొక్కి వక్కాణించియున్నారు. హనుమదాదులు వివేకులుగాఁ దెలుపఁబడినను వానరులలో వివేకులుగాఁ దెలుపఁబడిరి. నరులతో సహవాసముచేఁ దమజాతి వానరులందు సహజముగా నుండు జ్ఞానముకంటె నెక్కుడు జ్ఞానము గలవారై యుండిరి. ఈ యంశమును హనుమద్విషయమై మన రామదాసుగారే యంగీకరించి యీక్రింది రీతిని వ్రాయించిరి.

"రామలక్ష్మణుల యొద్దకు ధైర్యముగావచ్చి మాట్లాడిన హనుమంతుఁడు పట్టణవాసులతోఁ గలసిమెలసి తిరిగి ప్రాపంచికజ్ఞానము నేర్చిన దేశీయునివంటివాఁడు."

సుగ్రీవాదు లట్టివారు కారట. రామలక్ష్మణులను జూడఁగనే భయపడి పారిపోయిరి. వెఱ్ఱియూహలకు లోనైరి సుగ్రీవుని వెఱ్ఱియూహలఁ గనుఁగొని హనుమ 'నీవు మనయందుఁగల మృగత్వము ననుసరించి యిట్టి యూహలకు లోనైతి'వని తెలిపె. 'ఆహార నిద్రాభయ మైథునాని' యను సామాన్య ధర్మముంబట్టి మాత్రమే నరవానరభేద మేర్పడలేదు. దేహాదులనుబట్టి, జ్ఞానేంద్రియ శక్తులంబట్టి, చర్మాదిక విశేషములం బట్టి యుభయులకు భేద మేర్పడినది. ఈ భేదమును రామాయణము విస్పష్టముగాఁ దెలుపుచున్నది. కోట్లకొలఁదిగల వానరులు ఇద్దరు నరయువకులచేనడుపఁబడిరి. కాన శ్రీమద్రామాయణముంబట్టియును, మనరామదాసుగారివ్రాఁతనుబట్టియునుగూడ నరులకంటె వానరులు తక్కువవారని తేలుచున్నది. కాన నేను మొదట వ్రాసిన రీతిగా రామాయణస్థవానరులు నేటి నరులలోనివారు కాని, నేటివానరులలోనివారుకాని కారనియు, వీరి కుభయులకు నడిమిజాతివారనియు, వారు నశించిపోయిరనియుఁ దలంచుటయే యుచితము. అసురులనుజాతి యొకటి కలదనియు వారు క్రమక్రమముగా నశించిపోవుచున్నారనియు శ్రీరామదాసుగారే తమవ్యాసమున వ్రాసియున్నారు కాన వానరజాతి నశించిపోయినదని తెలుపుటకు వారభ్యంతరముచెప్ప నవసరము కాన్పించుట లేదు.

సంపూర్ణము

భక్తి

చల్లా పిచ్చయ్యశాస్త్రి గారు

కడఁకను రేపు మాపనక కాళ్లను వ్రేళ్లను బ్రోవుసేయున
ప్పుడు ప్రియురాలనంచు నటు పుత్త్రుఁడనంచు సఖుండనంచు నా
ప్తుఁడ ననుచున్ బారింబారిగ మూఁగుదు రీఁగలఁబోలి; యెంతకుం
బడయరు తృప్తి; యెవ్వరికి వారు స్వలాభమె కోరుచుందు; రె
ప్పుడయిన నీకు నుంత తలపోటు ఘటిల్లినఁ దొంగిచూడ; రే
యెడకో యెదేనిమిత్తమున నేఁగుదు. రీక్రమ మెంచి యింక నీ
యెడఁద నెఱుంగుమీ వగలకే సిరులంచుఁ దలంపు. మాపయిన్
జెడుగుల శిక్షణంబునను శిష్టజనంబుల రక్షణంబునన్
గడు నెనరొప్ప నొక్కఁడుగ గారవముం బొనరించువానిఁ, బా
ల్కడలి ఫణీంద్రశయ్యఁ గమలాసతితో సుఖియించువాని, లో
నడరెడు శత్రులం దునిమి, యట్టిటు నూఁపెడు నీషణాత్రయం
బుడుగఁగఁ జేసి, కృత్రిమము నూడిచి, దూషణభూషణంబు లొ
క్కఁడుగఁ దలంచి, భూరజముఁ గాంచనమున్ సరిసేసి, యూరకే
వెడలెడు రిత్తకోర్కెలను వీసరవుచ్చి, యహంబుమాని, యా
ర్తుఁడయి, నిగూఢభక్తిఁ గుదురుం గొని చిత్తము రత్నపీఠిగాఁ,
దొడిఁబడు హర్షతోయములతోడన యర్ఘ్యముఁ బాద్యమిచ్చి, ప్రా
న్పడి యరమోడ్పు గన్నుఁగవ బద్ధకరుండయి, "దీనబాంధవా!
చెడితిఁ గృశించితిన్ దడవు సేయక ప్రోవవె భక్తవత్సలా!
బడలితి మ్రగ్గితిన్ సిలుగు పట్టకసాకవె" యంచు సోలి కూ
యిడఁ గులజాతిభేదములఁ నెంచకయే వెనువెంట వచ్చు పు
త్తడిపువుఁబోడినైనఁ గయితామర మోడిచి వీఁడె పాద దా
సుఁడనుచుఁ బర్వులెత్తు నహిసూదనునైనను జూడకే కడున్
వడిఁ బఱతెంచి యాపదలఁ బాపెడువాని, జలంబు సొచ్చి మ్రు
క్కఁడిఁ దెగటార్చి వేదములు కాన్పన కిచ్చినవాని, వార్ధిఁ ద్ర
చ్చెడునెడ నద్రిమోచి సుధఁ జేర్చి సురస్తుతిఁ గన్నవానిఁ, బె

ల్లడచి నిశాటులీల వసుధాంగనఁ గాచినవాని ధూర్తుఁడై
కొడుకును బట్టి కొట్టి చెఱఁగొన్న ఖలున్ బొరిగొన్నవాని, మూఁ
డడుగుల నేలఁ గోరి జగమంతయు నిండినవాని, రాచ వం
గడములు పెక్కుమాఱ్లు కడఁకన్ దెగఁ గొట్టినవాని, లోకముల్
పిడుగయి యేచు రావణుని బీర మడంచినవానిఁ, గప్పఱా
మడుఁగు ధరించి భక్తులను మన్నించినవాని, వ్రజాంగనా మనో
జ్ఞుఁడయి యనేకచిత్రములు చూపినవాని, నెఱింగి బౌద్ధులన్
గెడపఁగ యజ్ఞనింద మొగిఁ గీర్తనఁ జేసినవాని, దౌష్ట్యముల్
నడపెడు కర్కశాశయుల నాడులఁ జీల్చినవాని నెన్ను చో
నడఁగు నఘంబు; చేకుఱుమహాంబులు ప్రత్యహముల్; ప్రశాంతి యే
ర్పడు మది నిల్చు సర్వ మొక రాణన తోఁచు; లభించు మోక్షముల్;
దడఁబడ కేచు వింతలకు దారి నొసంగక మెప్పు గోర కే
గడయును దెంపులేకయ యఖండముగా నెటనున్న, మేని కే
బడలిక గల్గినన్, రొదలు ప్రామిన నిల్కడ నిట్టిభక్తి యే
ర్పడి తరియించినట్టి బుధరత్నములన్ వచియింతు: నంబరీ
షుఁడు శుకశౌనకుల్ దనుజసూనుఁడు వ్యాసుఁడు నారదుండు భీ
ష్ముఁడు కనకాంగదుండు గజముఖ్యుఁడు దాల్భ్యుఁడు దీర్ఘదేవు ల
య్యుడయని కుబ్జుఁడున్ గుహపవోమణులున్ భుజగంబు పుండరీ
కుఁడు శబరుండు సాలెపురుగున్ నరుఁడున్ హనుమద్విభీషణుల్
పడఁతులలో నహల్యయును బాండవపత్నియు నింక నెందఱో
వడసిరి ముక్తి; మొన్న మనవార లెఱింగినవారు రామదా
సుఁడు నటు త్యాగయాదులును జూచిరి, చూపిరి దేవదేవు; నా
నుడి మదినమ్మి భక్తిని మనోమయపేటికలోన సొమ్ముగా
నిడి జగదేకనాథునకుఁ నెప్పుడుఁ గానుక పెట్టుచుండు మే
గొడవల కేగినన్ ఫలము కొంచియమైనను లేదు కాలమా
నడిఁ బరు వెత్తుచున్న దిటువంటి శరీరము రాదు రాదిఁకన్.

సంపూర్ణము

ఉద్ధవుడు

విన్నకోట వేంకటరత్న శర్మగారు

రంగము 1

(వ్రేపల్లెలో కుటీరము)

[చంద్రిక—విలాసిని]

చం—(కృష్ణవిగ్రహమునకు జలకమాడించి) కృష్ణా! ఏడువకు! ఏడువకు! తుడిచెదను. (పైటచెఱఁగుతో నొత్తును.)

వి—చెలీ! నిజమైన కృష్ణుడు కాడుగదా, ఏడ్చుటకు?

చం—కృష్ణా! తిలకము దీర్చెదను. రమ్ము; (తిలకమును దిద్దిచూచి) వంకరగా నున్నది. చక్కగా పెట్టెదను; రమ్ము. ముందు తొందరగా బెట్టితిని; క్షమింపుము. తప్పు మన్నింపుము. (తుడిచి మరలపెట్టి) ఇప్పుడు బాగున్నది.

వి—ఏమి నీకాపిచ్చి; బొమ్మకు బొట్టు పెట్టితివి?

చం—బొమ్మకాదే! బొమ్మల నాడించుబొమ్మలాట కాడే! కృష్ణా! ఒక్క ముద్దు పెట్టునాయనా! (ముద్దు పెట్టుకొని) కృష్ణా! నేడు నీవు పుట్టినరోజు. నీకు క్రొత్తచొక్కాలాగూ తొడిగెదను రమ్ము.(తొడిగి) నాయనా! వీథిలోనికి పోకుము; దుమ్ము పైఁబడును. కొంచెము సేపు పండుకొందువా, జోకొట్టెదను. (ఉయ్యెలలోనుంచి)

గేయము.—

జో జో! గోపాలా! జో జో! భూపాలా!
జో జో! నాచిట్టీ! జో జో! నాపట్టీ!
జగముల నిట్టట్టాడించెదవు
మగువల మరుల ముంచెదవు......జో జో!
వారువీరని భేదము నెంచవు
సారెసారెకును దయనుంచెదవు......జో జో!
జో జో! మత్స్యావతార! జో జో!
జో జో! కూర్మావతార! జో జో!
జో జో! వరాహావతార! జో జో!
జో జో! నరసింహావతార! జో జో!
జో జో! వామనావతార! జో జో!
జో జో! రామావతార! జో జో!
జో జో! కృష్ణావతార! జో జో!
జో జో! ఋషభావతార! జో జో!
జో జో! కపిలావతార! జో జో!

విలాసినీ! ఆప్రక్కనుండి ఊపుము.

(చెరియొకప్రక్క నుయ్యెల నూపుచుందురు)

వి—నిజమైన కృష్ణుని తెత్తునా?

చం—నిజమైన కృష్ణుడు బాలుడు కాడుగదా, మనము చెప్పినట్లు వినునా!

వి—మనము చెప్పినట్లు విను కృష్ణుడే కావలయునా?

చం—అవును.

గీ. బాలకృష్ణుడైన జోల|బాడగవచ్చు
ముద్దుకృష్ణుడైన ముద్దియవచ్చు
చిన్నికృష్ణుడైన చిందులు ద్రొక్కును
నల్లకృష్ణుడైన నాట్యమాడు.

ఇంతకన్న మన కేమికావలెనే విలాసినీ!

వి—నీకు పిల్లలు లేరుగావున నిట్లాడించెదవు, కొడుకు పుట్టినచో—

చం—కృష్ణుని పేరే పెట్టుకొని, కృష్ణునికివలెనే పింఛము పెట్టి ముద్దుపెట్టుకొందును. (బొమ్మను ముద్దుపెట్టుకొనును.) కృష్ణా! కృష్ణా! యని ఎప్పుడు పిలుచుకొనుచు, దగ్గఱ పరుండబెట్టుకొనుచు, లాలించుచు,

పాలించుకొందును. కృష్ణుని విడనాడియుండలేనే.
కృష్ణుని తలపకున్న నాకేమియు తోచదే విలాసినీ!

వి—కృష్ణుని వ్రేపల్లెకు తీసికొని వచ్చుటకు, విద్యుల్లత, మధుర పంపగా, మధురకు పోయినది.

చం—ఎప్పుడు?

వి—ఇంతకుముందే, నాతో చెప్పిపోయినది.

చం—అయ్యో, నాతో చెప్పినది కాదేమే!

వి—ఎందులకు?

చం—నాకును మధురలో పనియున్నది.

వి—ఎవరినిమిత్తము?

చం—కృష్ణునినిమిత్తము?

వి—ఆకృష్ణుడు పెద్దకృష్ణుడు.

చం—మాబాలకృష్ణునినిమిత్తము!

వి—ఎందుకు?

చం—మాబాలకృష్ణుఁ డాడుకొనుటకు బొమ్మలుకావలయును. బొమ్మ చేటలు కావలయును. తినుటకు పంచదారచిలుకలు కావలయును. ఇవన్నియు తెచ్చుటకు నాల్గునాళ్లనుండియు ప్రయాణమైతిని. కృష్ణుడు పంపించెదనని చెప్పి ఇంతవఱకు పంపియుండలేదు.

వి—మనము పోయినచో బాలకృష్ణు నెవరి కప్పగింతము?

చం—కృష్ణుని నీవెత్తుకొనుము. నేనును నీవును నడచి పోయి విద్యుల్లతను కలసికొందము.

వి—పట్టణములో నెట్లు మసలవలయునో మనకు తెలియదుగదా!

చం—అక్కడ కృష్ణుడు మనచిన్నికృష్ణునకు సాయము రాడా!

వి—సాయమున కేమి! అన్నియు తానే కొనియిచ్చును. మన కేమియు నాయాసముండదు. (బొమ్మనెత్తికొని) రమ్మా.

చం—పద—ఆగు—ఆగు—త్రోవలో బాలు డేడ్చునేమో? పాలుతీసికొనివచ్చెదను. (పాలు తెచ్చి) ఇక పద.

[నిష్క్రమింతురు.]

రంగము 2

బృందావనము

ఉద్ధవుడు (ప్రవేశించి)

ఇప్పటికి బృందావనమును చేరితిని. ఈయమునానదీపుష్పంబుల గంధంబు గ్రహించి, వల్లనితోయంబుల నూగులాడుచు, గంధవహుండు కునికిపాట్లు పడుచున్నాడు. ఒక్కింత బడలిక తీర్చుకొందును. కృష్ణుడు లేకున్న బృందావన మెంతరసహీనమై, వికాసరహితమైయున్నది. అదుగో, వారే గోపికా కాంతలు! అదియే వ్రేపల్లె!

గీ. గొల్లపిల్లలతోడను బళ్లతోడ
ఆలమందలతోడను పాలతోడ
కవ్వములతోడ కూనురాగములతోడ
నలరునయ్యదే, వ్రేపల్లెయని తలంతు!

(చూచి) ఎవరో ముమ్వురు కాంతలు వచ్చుచున్నారు. నేనేకృష్ణుడనని చెప్పినచో వీరిభావము లెట్లుండునో?

(విద్యుల్లత ప్రవేశించి, చూచి) కృష్ణుడే, కృష్ణుడే, నిజముగా కృష్ణుడే! వెదకడలచినతీగ కాళ్ల కడ్డువడినది. [మరలిపోవును.]

(చంద్రిక – విలాసిని ప్రవేశింతురు)

చ—కృష్ణుడే! కృష్ణుడే!

వి—కాదమ్మా! కృష్ణుడైనచో నెమలిపింఛ మేదీ! వేణు వేదీ?

చం—ఎక్కడనైనను దాచివచ్చెనేమో!

వి—కాదు. ఎవ్వరో, నే నడిగి చూచెదను. (సమీపించి) అయ్యా! మీ రెవ్వరు?

ఉ—నేను కృష్ణుడను కాదు; కృష్ణుని చెలికాడను.

చం—కృష్ణా, మాఅబ్బాయికి బొమ్మ లంపించెదనని చెప్పి ఎన్నినాళ్లయినది, మరచితివా?

వి—కృష్ణుడు కాదమ్మా! కృష్ణుని నేనెఱుంగనా? కాదన్నాడు వినలేదా?

చం—కాదు; కృష్ణుని చెలికాడ నన్నాడు.

ఉ—(స్వ) ఈమెయే చంద్రికయై యుండనోపు.

వి—మీరెవ్వరయ్యా, యేయూరు?

ఉ—మధుర!

చం—అదిగో! మధుర యనుచున్నాడే!

వి—ఎక్కడకు పోవుచుంటిరి?

ఉ—వ్రేపల్లెకు?

వి—ఏనిమిత్తమున?

ఉ—నందనందనుని నిమిత్తమున.

వి—ఇక్కడ లేడు.

ఉ—ఇక్కడ లేడని—ఉన్నాడని నేనూఎరుంగుదును.

చం—ఏడే! ఉండుట యెట్లే.

ఉ—అదిగో! నీయొడిలో గలడు.

వి—నీయొడిలోని వేమిటి?

ఉ—బొమ్మలు.

వి—ఎవరికి?

ఉ—బాలకృష్ణునికి.

చం—మనకృష్ణునికేనటే!

వి—మరేమిటి?

ఉ—ఊఁ—.

వి—ఊఁ—యేమిటి?

ఉ—ఉద్ధవుఁడు.

వి—ఈబొమ్మ లెవ రంపించిరి?

ఉ—మాకృష్ణుడు.

చం—మాకృష్ణునికేనా?

ఉ—అవును.

చం—(బొమ్మ నెత్తికొని) మాకృష్ణునికేనా? మాకృష్ణునికేనా? మాకృష్ణునిమీద ఆకృష్ణుని కెంత ప్రేమయో; ఎంతవాత్సల్యమో? నాయనా! ఇవిగో బొమ్మలాడుకొమ్మ. బొమ్మ లేవి?

ఉ—ఇవిగో బొమ్మలు. (ఇచ్చును)

చం—(పుచ్చుకొని) అయ్యా! మీ రలసివచ్చితిరి. ఇవిగో మాపిల్లవానికై తెచ్చినపాలు పుచ్చుకొనుడు.

ఉ—మీకృష్ణు డేడ్చిననో?

చం—బొమ్మలుంటే యేడువడు. (పాలనిచ్చును.)

వి—వ్రేపల్లెలో ఎవరియింటికి వచ్చెదరు?

ఉ—నందుని యింటికి.

చం—రండు. పోవుదము. ముందుగా మాయింటికివచ్చి మాచిన్నికృష్ణుడిచ్చు పండ్లు పుచ్చుకొని తరువాత మీ యిచ్చవచ్చినచోటికి పోవచ్చును. మధురలో కృష్ణునకు కుశలమా?

ఉ—ఇప్పటికా కుశలవార్త నడుగుట! ఆయనకుశలిగాక మరెవ్వరు కుశలులై యుందురు? మీచిన్నికృష్ణునిపై నున్న ప్రేమ మాకృష్ణునిపై నుండవలదా? మా కృష్ణుడొకడు, మీకృష్ణు డొకడా? లోకములో సమస్త పదార్థములు మాకృష్ణమయములు గావా? చేతనాచేతనప్రకృతులు ఆమహానుభావునివలన సృష్టింపబడినవికావా? చిన్నికృష్ణునిమీద నీకుగల భక్తి ఆయనయేకదా కలుగజేయుచున్నాడు! నీలో, నాలో, అందరిలో ఆయన తేజస్సేకదా తాండవించుచున్నది! ఘటపటాదులు నశించినను బంధముల ద్రెంచువాఁ డాయనగదా. ఆయనను కుమారునిగా భావించుచు తరించితివి!! నీకు సమాను లెవరున్నారు! కాని, నీబాలకృష్ణుడే అన్నిస్థలములయందును భూతభవిష్యద్వర్తమానములలో నున్నాడని తెలుసుకొనవలెను. అప్పుడీవిగ్రహమునందు మాత్రమే లగ్నమైన నీ మనసు సర్వవ్యాపకత్వముకలిగి, దీనిని వదలివేయును. భక్తులలో నగ్రగణ్య వగుదువు.

చం—మాయింటికి రండు, జ్ఞానోపదేశము చేయుదురు కాని.

ఉ—నాకు నందునియింటికి దారిచూపుడు. వచ్చినపని తీరినవెనుక మీయింటికివచ్చి మాపరమాత్మ చెప్పమనిన వాక్యములు మీకు నెఱింగించెదను. రండు పోవుదము. [నిష్క్రమింతురు]

రంగము 3

నందుని యిల్లు

[నందయశోద లుపవిష్టులై యుందురు]

య—నాథా! కృష్ణు డప్పుడే వచ్చునని యంటిరిగదా! ఇంకను రాలేదేమి? కన్నవారికన్న, కన్నవారిమీద నెక్కువ ప్రీతియుండునా?

నం—ఆతని కందరియందును ఒక్కచందంబై ప్రేమ వెల్లివిరియునుగాని—ప్రస్తుతము రాజకార్యములయందు నిమగ్నుడై యుండుటచే రాలేడు. నన్ను మరచి నను—

గీ. కడుపులో పెట్టుకొని ప్రేమ గాంచినావు
కనులలో పెట్టుకొని ముద్దు గాంచినావు
పాలపొత్తిళ్లలో జోలబాడినావు
నిన్ను కృష్ణయ్య మరచునా నీలవేణి!

య—చిన్నతనంబున తా నొనరించిన కొంటెపనులం దలంచిన కొలదిని నాకొడలు గగర్పొడుచును. చన్నులం జేపువచ్చు; పరవశనై పోదును.

నం—సరికాని—మనవాడు పంపిన చిత్రములు తెమ్ము—మధురలో నొకచిత్రలేఖకునిచే లిఖించబడినవి. అవి చూచియైనను మురియుచు కాలక్షేపము చేసికొందము.

య—అవి చిత్రములా! ప్రాణము మాత్రమే లేదుగాని—

నం—తెమ్ము.

(యశోదనిష్క్రమించి పటములతో వచ్చును.)

నం—(ఒకచిత్రమునుదీసి) ఆహా! కృష్ణుని చూచుచున్నట్లే యున్నది. యశోదా! చూచితివా! ఇందు మన కృష్ణుడు అరణ్యములో అగ్నిహోత్రము మ్రింగుచున్నట్లుగా లిఖింపబడినది.

య—నాయనా, పోకుము—కాలిపోవుదువు—మాకెవరు దిక్కు—నీవు పోవలదు నాయనా!

నం—ఇది నీవు తెచ్చిన చిత్రపటముగదా!

య—అవును—అవును—ఐనను,

నం—గీ. గోపకులనెల్ల కన్మూసికొను డటన్న
కన్నులన్ మూసికొని వారు కదలకుండి
రంతటన్ విశ్వరూపుడై అంతలోన
లోనగొనియెను భయద దావానలమ్ము.

య—మనకృష్ణుడు మన్నుదిన్న నాటిచిత్రముందీయుడు.

నం—(తీసి) ఏమియు నెఱుంగనివానివలె నోరుతెరచి నీకు చూపించుచున్నాడు. నీవు కొట్టుటకు సిద్ధముగా నుంటివి—ఇప్పు డెవరిని కొట్టెదవు—నాయన దగ్గర లేడుగదా?

య—అవును. అవును. దురాత్మురాలనే!

నం—ఇది చూచితివా! కృష్ణుడు యమునాతీరమున నిసుకతిన్నెపై గోపాలబాలురతో చల్ది యారగించుట. కొందఱు చిక్కంబులలోను, కొందరు నున్ననైన శిలాతలంబులను, కొంద ఱాకులలోను ఎట్లు తినుచున్నారో!

మ. జలజాంతస్థితకర్ణికన్ దిరిగి రా
సంఘంబులై యున్న రే
కులచందంబునఁ గృష్ణునిం దిరిగి రాఁ
గూర్చుండి వీక్షించుచున్
శిలలున్, బల్లవముల్, తృణంబులు, లతల్,
చిక్కంబులున్, పువ్వు, లా
కులు, కంచంబులుగా భుజించుటలు క
న్గొంటే! కురంగేక్షణా!

—భాగవతము.

య.—(పటమిచ్చి) ఇదియేమి? నాథా!

నం—(చూచి) ఇది కాళియమర్దనము.

శంకరాభరణము - ఆదితాళము

య.—చూడజాల, నే చూడజాలనిది, నాథా!
పాడుచు నాడుచు తిరిగెడు నీడున,
పాడుకాళియుడు దాపురించెన్—చూడజాల.
పట్టి దేహమును బట్టె, గిట్టెన్, గొట్టెన్
చీలెన్, గీలెన్—చూడజాల.

నాకు భయమగుచున్నది పసిపిల్లవాడు—పాపడేడు. లత—వజ్రము అమ్మయ్యో! నేచూడజాలను. ఆనాటివేసన జ్ఞాపకమునకు వచ్చుచున్నది. మొదటినుండియు నిట్టి దుడుకుచేష్టలే.

నం—అదివలదులే—ఇదిచ్చూడుము, గోవర్ధనగిరి. కృష్ణుడు పర్వతమును పైకెత్తి.

శా. బాలుండీతఁడు, కొండదొడ్డది, వహో
భారంబు సైరింపఁగా
జాలండో యని దీనిక్రిందనిలువన్
శంకింపఁగాఁబోకుఁడీ

శైలాంభోనిధిఁ జంతుసంయుత ధరా
చక్రంబు పైఁబడ్డ నా
కేల్గ్రాదుదు, బంధులార! నిలుండీ
క్రిందన్ బ్రమోదాత్ములై.

అని ఓగ్గరగా చెప్పుచున్నాడు. అదిగో మనము దానిక్రిందనే యున్నాము. (చూచుచుండును).

య—కుబ్జవానికి గండములమీద గండములు.

(ఉద్ధవుడు ప్రవేశించును)

ఉ—అవును—గండములమీద గండములు. ఈమధ్య యవలోకమునకుపోయివచ్చెను—ఆతడు కుబ్జవాడా!

య—(చూచి) ఉద్ధవుడు—ఉద్ధవుడు—

నం—(పట మక్కడ నుంచి) ఎన్నాళ్లకు—ఎన్నాళ్లకు—కృష్ణుడు—కృష్ణుడు—(కౌగిలించుకొనును).

య—ఉద్ధవుడండీ!

నం—కృష్ణునిచూచినట్లే యున్నది. అందుకట్లంటిని. ఉద్ధవా, రమ్ము; కూర్చుండుము. ఆయాసపడి వచ్చితివి. కాళ్లుపట్టెదను. (కాళ్లుపట్టుచుయశోదనుచూచి) ఉష్ణోదకము తెమ్ము; కాళ్లు కడుగవలయును.

ఉ—అక్కరలేదు. ఆయాసము తీరినది

నం—కొంచెము విశ్రమింతువా? విసరెదను. (విసరును.)

ఉ—(స్వ) ఏమి! యీభక్తివిశేషములు! ఆకృష్ణపాదారవిందధ్యానానంద నిమగ్నులైన యోగుల క్రియ నాచరించుచున్నాడు. ఇంతవఱకు తన తనయుని యోగక్షేమమే అడుగలేదు. అతిథిపూజయన నిట్లు గదా యుండవలయును!

నం—ప్రాణము కుదుటబడినదిగదా! ఎక్కడ మధుర: ఎక్కడ వ్రేపల్లె; వసుదేవునికి క్షేమమా!

య—కంసుడు తీరెగదా! ఇక నందఱకు క్షేమమేకలుగును.

ఉ—ఆ. సుఖముగా నున్నాడు.

య—దేవకి?

ఉ—ఆయమ కేమిలోటు? అనామయమే!

య—మాఅబ్బాయి మమ్మెప్పుడైన తలంచునా? బాగుగా చదువుకొను చున్నాడా?

నం—మేము జ్ఞాపకముందుమా, ఆ ముకుందునకు?

శా. అన్నా, భద్రమె? తల్లిదండ్రుల మముం
హర్షించి చింతించునే?
తన్నున్ బాసిన గోపగోపికల మి
త్ర వ్రాతముం గోగణం
బు న్నిత్యంబు తలంచునే? వనవదీ
భూములఁ బ్రసంగించునే?
వెన్నుం డెన్నఁడు వచ్చునయ్యా, యిట మా
వ్రేపల్లెకు న్నుద్ధవా!

కళంకములేని పూర్ణచంద్రబింబమునుబోలు ఆముద్దుమొగము చూడఁగల భాగ్యము మాకున్నదా?

య—నాకుమారుని జిలిబిలిముద్దుపలుకులను వినగల్గు భాగ్యము నాకున్నదా? నాతో నేమని చెప్పుమని యెను? తాను పంపించిన చిత్రముల జూచియు, చిన్ననాడుతానాడుకొన్న ప్రదేశములనుచూచియు, వస్తువులను చూచియు, ప్రొద్దు పుచ్చుచున్నాము. కట్టెలిక్కడ: ప్రాణము లక్కడ.

ఉ—నాతో నెప్పుడును మీవిషయమే చెప్పుచుండును; మిమ్మే తలంచుకొనుచుండును; తోడివారితో వ్రేపల్లె నొనర్చిన చేష్టలను, మీరొనర్చిన మన్ననలను చెప్పుచుండును; మిమ్ములను చూచుటకై శీఘ్రంబున వచ్చెదనని చెప్పుమనియెను. మీరు వగవవలదు.

నం—సాయంకాలములందు ప్రొద్దుగడపుట కేమిచేయుచుండును?

య—మునుపటికన్న చిక్కిపోలేదుగదా; బెంగ లేదుగదా! ఇక్కడున్నప్పుడు నా వీపు వదలువాడు కాడు.

ఉ—అమ్మా! గోపాలునిచేష్టల నేమని నుడువుదును? ఎంతని చెప్పుదును? సాయంకాలములందు స్నేహితులతో చేరి భవిష్యత్సమాచారముల నెన్నియో చెప్పుచుండును.

య—నాయనకు సంబంధములు వచ్చుచున్నవా? పెండ్లిమాటలేవైన చెప్పునా?

ఉ—విదర్భ రాజకుమార్తెను తాను పెండ్లియాడునట, తన బావమరదని పరాభవించునట! ఏమేమో జరుగ

నున్న సమాచారములు చెప్పుచుండును. మే మువ్వి ళ్లూరుచు వినుచుందుము—ఇంతియేల! వారు లీలా మానుషవిగ్రహులుగదా!

మ. బలుఁడుఁ గృష్ణుఁడు మర్త్యులే! వసుమతీ
భారంబు వారింప వా
రలరూపంబునఁ బుట్టినాఁడు హరి; ని
ర్వాణప్రభుం డెవ్వఁడు
జ్జ్వలుఁడై ప్రాణవియోగకాలమునఁ ద
త్సర్వేశుఁ జింతించు వా
డలఘుశ్రేయముపొందు బ్రహ్మమయుఁడై
యర్కాభుఁడై నిత్యుఁడై.

—భాగవతము.

అట్టినారాయణుని, అఖిలాత్మకుని కారణ మానవా కారుని పెంచి పెద్దవాని చేసితిరి. మీ అదృష్టమే అదృష్టము! మీభాగ్యమే భాగ్యము! మీ జన్మమే జన్మము! మీరే ధన్యాత్ములని చెప్పదగినవారు. ఆ మహానుభావుడు, కొమ్మమ్ముల జ్యోతికై వడి, మణు లక్షసూత్రమ్ము విధమ్మున, విరాజిల్లుచుండు. ఆతనికి జననీజనకులనియు, దారాపుత్రాదులనియు, ప్రియా ప్రియు లనియును లేరు; జన్మకర్మములు లేవు; గుణ రహితుడయ్యు, ఆర్తలోకబాంధవుడై, మాయా కాయం బాశ్రయించె.

య—చిన్నతనమున నాకు మంగళప్రదమగు విశ్వరూప మును చూపించెగదా! ఐనను నా కాజ్ఞానము నిలు వదు. కుమారు డనుభ్రాంతియే కలుగుచుండును. ఉద్ధవా! మొదట యమలోకమంటి వేమి?

ఉ—సాందీపునిదగ్గర శిష్యత్వము తీరిన వెనుక, గురుక ట్నముగా గురుపుత్రుని దెచ్చియిచ్చెను. ఆగురుపుత్రు డు యమలోకములో నున్నాడట అందుల కక్క డకు బోయితినని చెప్పుచూ వచ్చెను.

నం—ఆతని కసాధ్య మేమున్నది?

ఉ—మన మదృష్టవంతులము కనుక ఆయనను చూచు చున్నాము; ఆయనతో మాట్లాడు చున్నాము.

నం—మహాత్మా! మిమ్ముంజూచిన మాకృష్ణుని చూచి నట్లున్నది.

ఉ—ఆమహానుభావుని పాదారవిందరేణు స్పర్శనము చే పవిత్రములైన ఆ స్థలంబుల చూడవలయునని కోర్కెగలదు; చూపించుడు. ఆనంతరమునయాత్రో న్ముఖుండ నయ్యెద.

నం—అట్లే! ముందు భోజనమునకు దయచేయుడు. (యశోదనుచూచి) సర్వము సిద్ధము గావింపుము.

[తెరపడును]

రంగము 4

వ్రేపల్లె వీథి

(మధుర - విద్యుల్లత)

మ—ఏడే! కృష్ణుడేడే! తానే వచ్చెనని చెప్పితివి.

వి—రాత్రి నందునియింట నుండెను.

మ—నిజము చెప్పుము. పోలేక కల్పించితివా? నేనైనను పోవుదునే!

వి—నిజముగానే చెప్పుచున్నాను. దూరమునకు కృష్ణుని వలె నున్నాడు. కృష్ణుడనుకొని నేను వెనుకకు వచ్చి నాను.

మ—కృష్ణుడు కాడా యేమి?

వి—కాడు కృష్ణుడు—చెలికాడు.

మ—అయితే కృష్ణుడేనా?

వి—ఏమో?

మ—పోనీ! చూపించుము—కృష్ణు నెఱుగవటే!

వి—ఎఱుగ కేమి? మీకు మీకు—నేనేకాదు—అప్పుడు—

మ—ఏమిహాస్యమే—నేనేపోయెదను లెమ్ము మధురకు. (పోఁబోవును)

వి—వలదు-వలదు, వచ్చినది ఉద్ధవుడే!

మ—ఉద్ధవు డెవడే? యేభవుడైన నాకేమి?—మధురాధవు డు కాడుగదా!

వి—మధురాధవుడు పంపగా మధురదగ్గరకువచ్చినాడు.

మ—అట్లయిన నాయింటికి రాలేదేమి?

వి—నీకన్న నెక్కువవారు లేనప్పుడుగదా ముందు నీ యింటికి వచ్చుట!

మ—నాకన్న ఎక్కువవారెవ్వరే, ఆయనకు?

వి—తల్లిదండ్రులు.

మ—ఏమని రాయబారము?

వి—వచ్చెదనని-కాదు-వచ్చుచున్నానని.

మ—ఎప్పుడు?

వి—తన కవసరమైనప్పుడు.

మ—ఆరాయబారిని నాకు చూపింపవే!

వి—ఏమిచేసెదవు?

మ—ఇటువంటి రాయబారములు తేవలదని చెప్పెదను.

వి—తప్పక చూపించెదను. [నిష్క్రమింతురు]

(రాధ, పుష్పవేణి, నీలవేణి ప్రవేశింతురు.)

రా—నీలవేణీ! ఉద్ధవుడేడే!

పు—నీలవేణీ! రాయబారి ఎక్కడనే!

నీ—ఇప్పుడే చూచివచ్చితిని. యమునాతీరమున నొంటరిగా గూర్చుండెను. రండు. త్వరగా నడచిరండు. [నిష్క్రమింతురు.]

రంగము 5

యమునాతీరము

[ఉద్ధవుడు]

ఆహా! ఆమహానుభావుని పావనస్నానముచే పవిత్రమైన యమునానదీతోయంబుల గ్రోలు భాగ్యంబు కలిగినది. ఆ లోకేశ్వరుని పదాబ్జపరాగంబుచే నఘుంబైన బృందావనమందు సంచరింపగల్గితిని. ఈ వ్రేపల్లెవారి యదృష్ట మేమియోకాని, ఒక్కొక్క కాంత కృష్ణుని భర్తగా దలపోసి భక్తి నేయుచుండు. ఒక్కొక్క పడంతి కృష్ణునిం బుత్రునిగా భావించి ప్రేమ లొల్కించుచుండు. ఒక్కొక్కడు కృష్ణుని దండ్రిగా భావించి తరింపనూహించు. ఒక్కొక్కడుకృష్ణుని చెలికాడుగా భావించి సంసారబంధము పటాపంచలు గావింపనూహించు. ఇంకను దమకుమారులకు కృష్ణనామధేయము లిడి "కృష్ణా! కృష్ణా" యని కొంగలు జపించుచున్నారు. ఏదోవిధముగ ప్రతివారి నోటివెంట 'కృష్ణ' యనుశబ్దమే వినవచ్చుచున్నది. ఏమి, వీరి పూర్వజన్మ పుణ్యము! ఇట్టి పరమభక్తులను, భక్తురాండ్రను చూడగల భాగ్యము నాకు లభించినది. వీరిలో నెవ్వరి పాద రేణువున కైనను నేను చాలుదునా?

మోహనరాగము - ఆదితాళము

ఎంతపుణ్యవతివో? బృందావనమా! నీ వెంతపుణ్యవతివో?
నందనందనుడు తానానందంబున-నీయందున్ గ్రీడించెన్
—ఎంతపుణ్యవతివో!

ఓయమునానదీతీరపాదపలతావళులారా,
మా దేవదేవుని దేహముమీదను
పూలవానలు వర్షించితిరా?
మీరే ధన్యాత్ములు, మీరే పుణ్యాత్ములు
మిమ్మే గణింపవలయున్—ఎంతపుణ్యవతివో!

సరిపోలుదునా, ఓసైకతమ్ములారా? మీతో నేసరిపోలు
మా సరసిజాక్షుని పాదస్పర్శన్ (దునా?
మహిమలు మీయందుండున్—ఎంతపుణ్యవతివో!

(విద్యుల్లత - మధుర ప్రవేశింతురు)

మ—(చూచి) విద్యుల్లతా! ఉద్ధవుడంటివే, మాధవుడే! కృష్ణుడే.

వి—చూచినవారెల్లరు నీధవులేనా? నేనును భ్రమపడితిని. ఆ నెమలిపింఛమేదీ?

మ—అవునే! కృష్ణుడుకాడే! కొన్ని పోలికలు మాత్రమున్నవి.

వి—దగ్గరకు రమ్ము-సంభాషింతము.

మ—ముందు నేను సంభాషింపను.

వి—ఆయనయు ముందు మాటాడడు.

ఉ—నా రాయబార మిక్కడనే తీరునట్లున్నది. ఒక్కొక్కరే వచ్చుచున్నారు.

మ—పోనీ! నేనే పల్కరించెదను. (తలవంచుకొని) మధురనుండిగదా రాక!

ఉ—అవును, మధురనుండి. మధురానాథు డంపగా మధురాదులకు రాయబారమును దెచ్చితిని.

మ—ఓహో! (కొంచెమలుకతో) నీ వింత విప్పిచెప్ప నక్కఱలేదు.

చ. ఎఱుఁగుదుమేము నిన్ను వన
జేక్షణ మిత్రుఁడవీవు; కూరిమిన్
మెలయుచుఁ దల్లిదండ్రులకు
మేలొదవంగింపఁ బ్రియుండు పంపఁగా

నాఁతెఱుఁగు భక్తి వచ్చితివి
వారలనైన మానంబులోపలన్
మఱువఁడు శౌరి మేలు! పరి
మాన్యులు రాజున కెవ్వ రిచ్చుటన్.
—భాగవతము

మకరందమానందమ్మునం గ్రోలి పుష్పంధయము లా పుష్పముచెంత నుండవుగదా? అట్లే మగవారు తమ యక్కఱదీరినంతనే తొంగియైనను చూడరు.

(రాధ, పుష్పవేణి, నీలవేణి ప్రవేశింతురు)

నీ.—అదుగో! ఆ వచ్చ్నాతడే! (చూచి) ఇదిగో ఇక్కడకు మధురయును వచ్చినది.

పు.—మనకన్న ముం దరుదెంచి ఏమేమో గోడవలు చేయుచున్నది.

రా.—మనమందరము నా మహానుభావుని దాసీజనంబులమే కదా!

నీ.—పుష్పవేణీ, మాట్లాడింపుము.

పు.—నేను ముందుగా ప్రశ్నింపను.

నీ.—పోనీ! ఆయనను పోమ్మని చెప్పుము.

రా.—అపరాధము అపరాధము. నేనే పలుకరించెదను (సమీపించి) అయ్యా! మా గోపాలునికి పోషణ చక్కగా జరుగుచున్నదా! సుఖియైయున్నాడా?

ఉ.—ఆయన సుఖియై యున్నాడు.

పు.—నాకు సిగ్గగుచున్నది? అన్యాపదేశముగా పలుకరించెదను. (తుమ్మెదను చూచి)

మ. భ్రమరా! దుర్జనమిత్ర! ముట్టకుము మా
పాదాబ్జముల్ నాగర
ప్రమదాళీ కుచకుంకుమాంకిత లస
త్ప్రాణేశదారు ప్రసూ
న మరందారుణితాననుండ వగుటన్
నాథుండు మన్నించుఁ గా
క! వ మున్నే పుచుఁ బౌరకాంతల శుభా
గారంబులన్ నిత్యమున్.
—భాగవతము.

మ.—నేను అన్యాపదేశంబుగా మాట్లాడెద. ఈనిష్ఠుర వాక్యంబుల నీతగు కృష్ణునకెఱింగింపుగాక! (తుమ్మెదను చూచి)

సు. ఒక పువ్వందలి తేనెఁ ద్రావి మధుపా,
యుత్సాహివై నీవు వే
ఱొకటిన్ బొందెడుభంగి మన్మథరసో
యాసంబునన్ దేల్చి మా
యకలంకోజ్జ్వల యౌవనంబు గొని య
న్యాసక్తుఁ డయ్యెన్ విభుం
డకటా! ఆతని కెట్లు దక్కె సిరి! మి
థ్యాకీర్తి నమ్మెంబుమీ!
—భాగవతము.

రా.—మన మిట్లు నిష్ఠురోక్తు లాడుట మంచిపనికాదు. ఆమహానుభావుని కందరు సమానులే! చూచిన వారెల్ల రాయనను కోరుచుందురు. ఆయనయం దేమి తప్పు గలదు. ఆజగన్మోహనమూర్తి కొన్నాళ్లు మనయండ నుండెగదా! అంతియేచాలును. మన నోము ఫలముచే ఆయన మరల రాకపోడు. అయ్యా, ఉద్ధవా! మాధవుడు నన్నెన్నడైన తలంచునా?

శా. ఏకాంతంబున నీదుపై నొఱగి తా
నేమేని భాషించుచో
మాకాంతుండు వచించునే, రవిసుతా
మధ్య ప్రదేశంబునన్
రాకాచంద్రమయూఖముల్ మెఱయఁగా
రాసంబు మాతోడ నం
గీకారం బొనరించి బంధనియతిన్
గ్రీడించు విన్నాణముల్.
—భాగవతము.

ఉ.—చెప్పకేమి! మీ అవ్యాజానురాగంబును, మీతో జలకేళిగావించుటయు, రాసక్రీడ గావించుటయు, చెప్పిచెప్పి మీయందే మనస్సంతయు నుండెనను ముండును.

పు.—

ఉ. బంధుల బిడ్డలన్ మగల
భ్రాతలఁ దల్లులఁ దండ్రులన్ మనో

శాంతమ్మ సాధింపు

అప్పికట్ల సూర్యనారాయణమూర్తిగారు

సుమారు యెనిమిది ఘంటలాయినది. కామరాజు లోనికివచ్చి "వంట అయినదే" అని యడిగెను.

"అయినది. ఇప్పుడే పీటలువేసెదను" అని లోపలినుండి శాంతమ్మ ప్రత్యుత్తరమిచ్చుచుండగా వినియు వినిపించుకొననట్లు కామరాజు చావడిలోనికివచ్చి "చదవండిరా" అని యచ్చట చిన్నదీపమువద్ద గుమిగూడి మాటలాడుచు కాలయాపనముచేయుచుండెడి నలుగురయిదుగురు పిల్లవాండ్రను హెచ్చరికచేయుచుండెను. ఇంతలో కాళ్లుకడుగుకొను నిమిత్తము జలపాత్ర యొకటి అరుగుమీద నుంచి శాంతమ్మ వడ్డనచేయుటకు వంటయింటిలోనికి పోయెను. కామరాజు కాళ్లు కడుగుకొనుచు "ఓరంగజేబు దండయాత్ర పరీక్షలోవచ్చును. చదువండి." అని బాలకులను ప్రోత్సాహపరచుచు, కాళ్లుకడుగుకొని, పట్టు వస్త్రమును ధరించుచు, "యూక్లిడ్ నాల్గవ ప్రాపొజిషను కంఠపాఠము చేసినారా?" అని యడిగి, తొందరపాటుతో వంటయింటిలోని కరిగెను.

పైనుదహరించిన కామరాజు టవును పాఠశాలలోని ఉపాధ్యాయుడు. శాంతమ్మ ఈతనిభార్య. ఇంటియందొక కాలముగడచిన స్త్రీయును, ఈభార్యాభర్త లిరువురును మాత్రమే యుండిరి. దీపమువద్ద కూర్చునియున్న బాలకు లీయనపాఠశాలలో వివిధతరగతులయందు జదువుకొనుచు, పాఠములను నేర్చుకొనునిమిత్త మీయన గృహమునకువచ్చిన వారు. ఇంటియందుండు ముసలి స్త్రీ కామరాజునకు మేనత్త.

౨

కామరాజు అతిత్వరితముగ భోజనము చేసి, వంటయింటినుండి వచ్చి, అంగీ తొడుగుకొని, యుత్తరీయమును మీదవేసికొని, "పాఠములను చదువుచుండుడు. నేనిపుడే వచ్చెద" నని విద్యార్థులకుచెప్పి, వీధిలోనికి పోయెను.

ఎనిమిది ఘంటలయినది. తొమ్మిదవ ఘంటయును ముగిసినది. ఇంకను ఉపాధ్యాయుడు వచ్చుటలేదు. నిద్రసమయమగుటయు, ఉపాధ్యాయుడు రాకుండుటయు చూచి, పాఠశాలలో నాటిదినమున జరిగియుండెడి సమాచారములను గూర్చి ముచ్చటించుకొని, ఉపాధ్యాయుడు రాడను మనోనిశ్చయముతో శాంతమ్మను పిలచి, "మేము వెళ్లిపోయెద" మని చెప్పి విద్యార్థులు వెడలిపోయిరి. శాంతమ్మ పనులన్నియు ముగించుకొని, పడకటింటిలోనికిపోయి, అచట కూరుచుని యుండెను.

రాత్రి పదిఘంటలయినవి. శాంతమ్మ అట్లనే కూర్చుని యుండెను. సుమారు పన్నెండు ఘంట లయినను, కామరాజు రాకపోవు టను చూచి శాంతమ్మ నిద్దుర నాపుకొనన నల విగాకుంటచే పట్టకేలకు శయనించెను. ఇంటి యందుండు ముసలియామె, వీధి గుమ్మమువద్ద కామరాజురాక కెదురుచూచిచూచి అతడెప్ప టికిని రాకుండుటచే నిద్దురపోయెను.

3

టవునుస్కూలుకు పోవుమార్గమునందు, ఆకుల వీథియని యొకవీథి యున్నది. ఇది బజారునకు సమీపమున ఉన్నది. ఇచట తములపాకుల వ్యాపారము హెచ్చుగా నుండు టచే దీనికి ఆకులవీథి యని పేరువచ్చినది. ఈ వీథియందు యూనియను దీపముప్రక్క నొక చిన్న గడ్డియిల్లు ఉన్నది. ఆ యింటియందు పున్ని, వరహాలు అను యిరువురు స్త్రీలు కాపురముండిరి. పున్ని ఆ యింటియరుగుమీద కిల్లీల దుఖాణము వేసికొని ఉదయము ఆరు ఘంటలనుండి రాత్రి తొమ్మిది, పదిఘంటల వరకు, బోటసాగులకు కిల్లీలు వర్తకము చేయు చుండును. ఈమెకు పనియుండుసమయ మున యుక్తవయస్కురాలగు వరహాలు దుఖాణముపై కూర్చుండును. ఈమె దుఖా ణము నందుండు సమయమున వ్యాపా రము హెచ్చుగా ఉండును. సుమారు తొమ్మిది పది ఘంటలకు దుఖాణమును ముగించు వాడుక కలదు. నాటిదినమున తొమ్మిదిఘంటల సమయమునకే వ్యాపారము ముగించి యింటిలో పున్ని తనగృహకృత్య ములను నెరవేర్చుకొనుచుండెను. వీథితలుపు మాత్రము మూయబడియుండెను. ఇంతలో వీథి తలుపుతట్టిన శబ్దమును విని "ఎవరుమీరు" అని లోపలనుండి ప్రశ్నించినయొకస్త్రీ కంఠ ధ్వని వినవచ్చెను. "ఎవరునూలేదు. నేనే" అని బయటతలుపువద్ద నిలువబడియున్న పురుషుడు మెల్లగా ననుచుండెను. కాని, ఆసమయమున ఆ వీథిలోనుండి యెవ్వరు పోవుచుండినదియు ఆయ నకు తెలియదు. ఆయింటికి కొంచెము దూర ములో ఉన్న సోడాదుఖాణమువద్ద సోడా త్రాగుచు నిలువబడియున్న వెంకట్రావు నీయన చూడలేదు. పకోడీలరామన్న యీతనినే చూ చుచున్నాడనుసమాచార మీయన కెంతమా త్రమును తెలియదు. అయినను తన్నాసమయ మున నెవరుచూచెదరో యను భీతిమాత్ర మా యనమనసును వీడిపోవుట లేదు. తలుపుతెరచి లోన నీతడు ప్రవేశించుసరికి పెరటిలోని తలుపు మూసినశబ్దముమాత్రము వినవచ్చెను. ఈయన యింటిలోనికి ప్రవేశించెను. గూటి యందొక దీపపుబుడ్డీ వెలుగుచుండెను. ఒక మూలనుండెడి నులకమంచముమీద నొక బొంతగుడ్డ పరచియుండెను. ఆ యింటియందు మఱి యేమియును లేకుండెను. ఇంటియందు ప్రవేశించినతోడనే, పున్ని, "పంతులూ వచ్చి నావా? నేను చెప్పినది తెచ్చితివా?" అని యడిగెను. "నీమాటకు ఆటంక ముండునా?" అని కామరాజు ప్రత్యుత్తరమిచ్చిన పిమ్మట, ఏదిమో వారిరువురు మాటలాడుకొని, "వర హాలు! ఇటురమ్మ" అని వెనుక యింటియం దున్న యువతినిపిలచి, యీ ముందుయింటి

యందుంచి, చేత నేదియో పట్టుకొని పున్ని యథాప్రకారము తనగృహకృత్యములు నిర్వర్తించుకొనఁ బోయెను.

ఇట్లు కొన్నిదినములు గతించినవి. శాంతమ్మకు దినదినమునను మనశ్శాంతి తక్కువగుచుండెను. ఏమి చేయుటకును ఆమెకు తెలియకుండెను. భార్యకు భర్తయొక్క నిరాదరణకంటె కఠినశిక్ష వేరొండు లేదు. పాప మాశాంతమ్మ యెన్నిదినము లని యిట్లూరక యుండగలదు? కామరాజు ప్రవర్తన యందరకును వెల్లడి యాయెను. తనవద్దనుండు విద్యార్థులును ఆతని నడువడినిగూర్చి గుసగుస లాడుచుండిరి. తనయింటి సమీపమున ఉండువారలు శాంతమ్మను జూచి, యామె యవస్థను విచారించుచు, ఆమెపై జూచి కొంత దయగలిగి యుండెడివారు. ఇట్టియెడ స్త్రీలకుండెడి యాయుధము మరణమని వేరుగ వక్కాణింప నవసరము లేదు. ఇట్టి యీ బ్రతుకెందులకని యెట్లయినను ప్రాణత్యాగము చేయుటకు శాంతమ్మ నిశ్చయించుకొనెను. అయినను ఆమె తొందరపాటుతో నేకార్యమును చేయునది కాదు. ఏకార్యమునకైనను దీర్ఘముగా ఆలోచించును. ఆనాటిదినము సంధ్యాకాలమున గుమ్మములనూడ్చి, అచటనే తన చేతియందుండెడి చీపురునట్లనే పట్టుకొని ఏదియో యాలోచించుకొనుచుండెను. ఆసమయమున రుక్మిణమ్మ పెరటిలో నుండివచ్చి "చెల్లీ! ఏకారణమున నట్లు నిలువబడియుంటివి?" అని యనునప్పటికి చేతియందున్న చీపురు క్రిందపడిపోయెను. ఆమె మాటలాడుట లేదు. కన్నీరు మున్నీరుగా వెలువడుచుండెను. ఆమె వెక్కివెక్కి యేడ్చుచుండెను. రుక్మిణమ్మకు యన్నియు తెలియును. శాంతమ్మకన్న వయసున పెద్దది. వెంటనే యా శాంతమ్మను తన చేతులలోనకు తీసుకొని యామెను గుమ్మముమీఁదనే తన ప్రక్కను కూర్చుండఁ జేసికొనెను. రుక్మిణమ్మకు యిదియంతయు తెలియక పోవుట లేదు. కాని, యెన్ని విచారము లయినను, యెన్ని మనోవికారము లయినను గంగాస్నానము చేసినతోడనే పాపములు పోవునట్లు, ధైర్య మూనిన తోడనే దూరముగ పోవును గదా! అట్లు కొంతసేపిరువురును మాటలాడుచు కూర్చునినపిమ్మట రాత్రియైనది. చీకటి యాసన్నమగుట జేసి రుక్మిణమ్మ తనయింటికి పోయెను. వారిరువురు యేమి మాటలాడుకొనిరో? యేమియాలోచించిరోగాని, రుక్మిణమ్మ వెళ్లినసమయము నుండియు, శాంతమ్మ ధైర్యముగానుండి, ఏదియో కార్యనిశ్చయముతో నుండుట నిపుడె కన్పట్టుచుండెను.

ఆనాఁడు శనివారము; పౌర్ణమి. చంద్రుఁడు సంపూర్ణముగ ప్రకాశించుచుండెను. రాత్రి యెనిమిది ఘంటలయినది. కామరాజు ఎప్పటియట్ల భోజనము చేసి తెల్లనియంగీ తొడుగుకొని, జరీయుత్తరీయమును వేసికొని, వీధిగుమ్మమువద్ద నిలువబడియుండెను. వరహాలుండుయింటికిపోవు ప్రయత్నముతోనే యుండెను. పూర్వము వలె నెవ రేమియనుకొనెదరో యనుభయముచే రాత్రి యెవ్వరునూ చూడకుండెడు సమయమును వెదకుచుండెడువాఁడు. ఇప్పు డదంతయు పో

యినది. ఎవ రేమియనుకొనిన తన కేమియను నవస్థకు వచ్చెను. ఆయన గుమ్మము దిగుట కుముందు శాంతమ్మ తెల్లని చీరె యొకటికట్టుకొని, రవికతొడుగుకొని, తనకుండెడి యాభరణములన్నియుదాల్చి, తలదువ్వుకొని, వన్నెలాడివలె గుమ్మములోనికి వచ్చెను. అది చూచి కామరాజు ఆశ్చర్యముతో "ఇదియేమి యీ వేషము?" అని యడిగెను.

శాం——ఏమియు లేదు. ఏదియో ? ఇదియొక వేషము.

కామ——ఇట్లు బయలుదేరుటకు కారణమేమి?

శాం——బయలుదేరినాను, మరి——

కామ——ఎక్కడి కేమిటి?

శాం——ఎక్కడికో అక్కడికే.

కామ——నాన్ సెన్సు. యేమిటీ వాళకం ?

శాం——నాన్ సెన్సు లేదు, గోనెసంచీలేదు. వాళకమేమిటి? వాళకములేదు, గీళకములేదు.

ఇట్లు శాంతమ్మ తనతో యిదివరకెన్నడును మాట్లాడి యుండలేదు. ఎందుచేత నట్లనుచున్నదియు ఆయన గ్రహించలేక పోయెను.

గుమ్మములో ఉన్న యాతడు చావడిలోనకు వచ్చినాడు. అతనితో శాంతమ్మయు వచ్చినది. ఆమెను మంచిమాటలతో అడిగి చూడవలయునని "ఏమిటి, శాంతా! ఎచటకు బయలు దేరితివి. ఎవ్వరి యింటనైనను కార్యమగుచున్నదా యేమి?" అనియడిగెను.

శాం——మీకు లేనికార్యము నాకేమి?

కామ——అట్లయిన యెచటకు పోవుచుంటివి?

శాం——మీ రెక్కడకు?

కామ——నేనెక్కడకు వెళ్లెదనో, నీకు చెప్పి వెళ్లవలయునా యేమి ?

శాం——చెప్ప నవసరములేదు. వెళ్లవచ్చును. మిమ్ములను నేను ఆటంకపరచితినా యేమి ? ఆటంకపరచినను మానుదురా ? వెళ్లుడు.

కామ——నేను వెళ్లెదనులే? నీమాట యేమి?

శాం——నేనునూ వెళ్లెదను.

కామ——ఎచ్చటకు?

శాం——మీ రెచ్చటకు ?

కామ——సుతిమించి రాగములో పడ్డదే ?

శాం——మించదూ ? మించుతుందా, మరీ మించుతుంది.

ఈ కథయేమియు కామరాజునకు తెలియలేదు. శాంతమ్మ కన్నులు నిప్పులవలె యుండి ఒకొక్క చూపునకు ఎదురుగా ఉన్న వాళ్లంతా మాడిపోవునట్లున్నది. ఆడవాండ్లు చూచుచుండిన సరియే, కాని చూచిన యెడల ఏ పురుషుడు నిలువబడగలడు? ఇంతవరకును నిలువబడి యున్న కామరాజు కుర్చీమీద కూర్చునెను. ఏమియు తోచలేదు. శాంతమ్మ మాత్రము బొటనవ్రేలుతో నేలపై వ్రాయుచు నిలువబడియుండెను.

కామ——అట్లయిన, నీవును వెళ్లెదనందువా?

శాం——వెళ్తానా, మరీ వెళ్తాను. నేనుమాత్రము మనిషిని కానా యేమి? మీకు అదియుంటే; నాకు——

ఈమాటలు శాంతమ్మ నోటినుండి వెలువడు సరికి కామరాజునకు శరీరస్మృతి తప్పెను. ఇక పైమాట యేమివచ్చునో యను భయ ముద్భవించెను. కాని కొంతవడికి తెలివి తెచ్చుకుని ధైర్యముగా—

కామ—అది అనుచున్నావు. అది యెవరు?

శాం—ఎవరు? తెలియదనుకున్నారేమో?

(ఆ బానిసముండ, ఖిల్లీలమ్మేది.)

కామ—దానికి నాకు యేమిటి?

శాం—ఏమిటి? ఏమియులేదు. మీ సంగతి అంతయు తెలియదనుకొన్నారు. సిగ్గున్న మగవారలయితే మరీ మాటలాడుతారా? ఏమిటి నాలో తక్కువ అని ఆలా—

కామ—బాగుగనే ఉన్నది. ఇష్టము లేని యెడల మీ యింటికి పొమ్ము.

శాం—వెళ్తాను. వెళ్లిపలసి వచ్చేటప్పుడు యెలాగూ వెళ్తాను. ఏమి? తిండికిలేక మా వారు నన్ను మీ కిచ్చినారనుకొనినా రేమో?

ఇప్పటికి కామరాజు కోపమంతయు తక్కు-వాయెను. గదిలోనికి వెళ్లి కామరాజు ఉత్తరీయమును తీసి బట్టలస్టేండుకు తగిలించి మంచము మీద కూరుచునెను. ఆయనతోడనే శాంతయు గదిలో ప్రవేశించెను.

శాం—ఆలాగున కూర్చున్నారేమి? వెళ్లుడు. పాపమది మీ రాకకై వేచియుండును.

కామ—వెళ్లను.

శాం—అయ్యో! వెళ్లకపోయిన యెట్లు? అది యేడవదూ?

ఏమియనుటకును కామరాజునకు మాటలు రాలేదు. మనసులోన ఏదియో నూతన భావవికార ముద్భవించెను.

కామ—మఱి వెళ్లను.

శాం—ఆ! వెళ్లరూ? ఈవేళ మాటే!

కామ—నిజము. వెళ్లను చూడు.

శాం—మగవారిని నమ్మమనినారేమి? ఇన్ని దినములనుండి యెందులకు వెళ్లితిరి? అది యేమి నాకన్న అందకత్తె యనియా? వండి పడ్డించుననియా? ఏమి చూచి వెళ్లినారు?

కామ—ఏవియో? పొరపాటయినది.

ఇట్లొకరితో నొకరు సంభాషించుకొని, కొంతతడవునకు శాంతమ్మ కామరాజ భుజముపై తలనిడి, చేయి యాయనమీద వైచి, నిద్రపోవుచుండెను. అయినను కామరాజునకు మాత్రము నిద్రలేదు. ఆయన రెండు కన్నులనుండియు నీరు కారుచుండెను. ఇదివఱ కాతడు చేసిన పాపమంతయు ఈ నీటిరూపముగ బోవుచుండెను. ఇట్లు కొన్నిదినములు గడచిపిమ్మట చూడ వారియింట మోహనరావను చిన్నవాడొకడు తనవచ్చియు రాని ముద్దుమాటలతో, తన తల్లిదండ్రులగు శాంతమ్మ, కామరాజులకు ఆనందము కలిగించుచుండెను.

ఆట యాగ్రామమున నుండు వరహాలు తనకాగ్రామమున వ్యాపారము మునుపటివలెనే జరుగకుండుటచే యాగ్రామమువిడచి తాతా నగరము వెడలిపోయెను.

ఉపాధ్యాయులారా!

అనిపెద్ది జగన్నాథశాస్త్రి గారు

పాలబుగ్గల నిగ్గులు పర్వునాడు
నొసట నల్లని ముంగురుల్ ముసురు
వచ్చియును రానిపలుకులు పలుకునాడు(నాడు
చిఱుత కౌపీనములదాల్చి తిరుగునాడు
మంచిచెడుగులు తెలియక మసలునాడు
ఒరు లెది వచించినను నమ్ముచుండునాడు
చిఱుతతిండ్లకు మారాము సేయునాడు
బూచి! రమ్మన్న భయమును బొందునాడు
ఆటలన్నంత గంతులో నరుగునాడు
లిప్తయైనను నిలుకడ లేనినాడు
బిడ్డలను దెచ్చి మీచేత బెట్టినారు.
మంచిచెడుగులు మీవని యెంచినారు
శిక్షసేయుడు మీరని చెప్పినారు
వీడు మీవాడనుండని వేడినారు
మేలు మరతుమె? యని బతిమాలినారు
పెండ్లిపేరంటముల మిమ్ము బిలిచినారు
శక్తికొలదిని మన్ననల్ సలిపినారు
గురువులని మిమ్ము మదిలోన గొలిచినారు
వారిబిడ్డల నెటుగనవలెనో మీర
లారయుడు చిత్తముల నుపాధ్యాయులార!

అఖిలలోకేశ్వరుండను హాలికవరుడు
సదమలంబగు మానవహృదయభూమి
శైశవంబున జ్ఞానబీజంబు నాట
నయ్యది యబోధ వృత్సన్నయం దడగియుండ
దేశికపయోధరంబుప దేశ రూప
కామృతాసార మొసగిన నంకురించి
కాలమర్యాద నభివృద్ధిగాంచి మించి
వినయ సౌశీల్యసద్గుణవితతి బెంచి
సకలలోకోపకారంబు సంఘటించు
నమ్ముదమ్మున జ్ఞానదాన మ్మొనర్ప
సిద్ధసంకల్పమైన మీజీవనంబె
కడుబవిత్రంబు బురుషార్థకారణంబు
ధన్యతములార! యో యుపాధ్యాయులార!

బాలకునిచిత్త మద్దంబు పగిదినుండు
మీ రెది వచింప నదియె బింబించుదాన
గాన మున్మున్న నీతులు గఱపవలయు
పాపమిది, పుణ్యమిది యని పలుకవలయు
నలుడు, నహుషుడు రాముడు, బలి,దధీచి,
యంబరీషుడు మున్నగునట్టివారి
భవ్యకథలను సంగ్రహపఱచి చెప్పి
బుద్ధికి వికాసమొనరింప బూనవలయు
కోప మొకయింతయును లేక యోపిక మెయి
వత్సలను గూడి వాత్సల్యవశత మెరసి
చదువ, వ్రాయను, లెక్కింప, నెదియొ యొకటి
మొదలిడి యుపన్యసింప, నేర్పుదురు గాక
బాలకులభావివృద్ధికి బాటుపడుచు
నిహపరంబుల సాధింప నెంత్రు గాక
గేయగుణులార, యోయుపాధ్యాయులార !

కాకతాళీయము

చింతలపాటి వెంకట శ్రీరాములు గారు, బి. ఏ., యల్. టి.

భీమేశ్వరరావుగారు ప్రిన్సిపల్ కోర్టు మునసబు పెద్దాపురంలో. కొంచము తొందరపడేస్వభావము గలవాడు. కోర్టులోనైనా అంతే! చిరాకు ఎక్కువ పార్టీలతో. ప్లీడర్లనే విదిలించివేస్తాడు. గుమాస్తాలకు జవానులకు హడలు. ఏమిమాట్లాడితే నేమో? లంచపంచముల విషయంలో చీటికి మాటికి ఏస్వల్పమునకైనా కక్కుర్తిపడేవాడుగాడు. కాని తానొక పెద్దఅధికారినని, తక్కినవారు సామాన్యులని కైపు బాగా తలకెక్కియున్నది.

కామేశ్వరమ్మగారు మహాదొడ్డ యిల్లాలు. ఆమె పెనిమిటి తొందరకు, ఆమె నిదానమునకు సరిపోయింది. భర్తయొక్క స్వభావమును బాగుగా గుర్తెరిగిందిగనుక బహునేర్పుతో ఆయనమనస్సుకు నచ్చునట్లు మాట్లాడుచు, పంతులుగారు సంతోషముగా నున్నప్పుడు మెత్తమెత్తగా మందలించుచు, యింటిపనులు చక్కబెట్టుచుండెడిది. పెట్టుపోతలవిషయంలో ఆమెను చెప్పి వేరొకరిని చెప్పవలెను. గ్రామంలో ఎక్కడ పట్టెడన్నము దొరకకపోయినా మునసబుగారింట్లో మట్టుకు అన్నాతురుడై వచ్చినవానిని, 'భోజనాలైనాయి నీకోసమని వండివార్చామనుకున్నావా?' అని కేకలువేసి 'దుంగముక్కలా గున్నావు' కూలినాలి చేసుకోరాదా; యని వెళ్ళగొట్టడమెన్నడూ లేదు. పనిపాటలవాళ్లు 'ఆ అమ్మకు చెయ్యెత్తి దణ్ణము పెట్టవచ్చు. ప్రొద్దున్నే లేచి ఆతల్లిని చూస్తే పాపాలన్నీ పోతా' యనుకొంటారు. ఇరుగుపొరుగువారి కష్టసుఖాలు తనదిగా భావించుకునేది కామేశ్వరమ్మగారు. పెద్దవుద్యోగస్థుని పెళ్లాన్ని గదా యని ఆమె కెంతమాత్రము గర్వముండేది గాదు. పచ్చని శరీరముమీద బంగారము కానరాకుండా పట్టెడ పసుపు కుంకుమతో పూచిన తంగేడులాగుండు ఆ పెద్దముత్తైదును ఎవరైన పేరంటానికి పిలవనివాళ్ళది పాపం. అంత మేలొనర్చిన అమ్మకు కడుపుఫలించకుండావుంటుందా! కామేశ్వరమ్మగారికి ముగ్గురుకుమాళ్లు; ఇద్దరు కుమార్తెలు. పెద్దవాడు బ్రహ్మానందమునకు పద్ధెనిమిదిసంవత్సరములు వయస్సు; బి. యే. క్లాసు చదువుతున్నాడు. అప్పుడే అనేక సంబంధాలు వస్తున్నాయి, పెద్దపెద్ద కట్నాలువల్లమాలిన లాంఛనాలు యిస్తామంటూ. భీమేశ్వరరావుగారు "మాపిల్లవాడేమి పెద్దమనిషిఅవుతాడా; యిప్పుడే ఏం తొందర. చదువు పూర్తిగాందే వివాహం మాట తలపెట్టం" అంటూ బెట్టుజేసి ఏనాలుగైదు వేలైన కనీసం లాగవలెనని ఊటలూరాడు కాని ఒక్క సుగుణం వుంది భీమేశ్వరరావుగారి దగ్గర. ఎవరిమీద ఎంత చిరాకుపడ్డా భార్యమాటంటే మహాచెడ్డగురి. కామేశ్వరమ్మగారు సామాన్యగృహస్థులయింటిఆడపడుచైనను పెళ్లినాటికి భీమన్నగారి సంసారంలోను పట్టులేదు. ఈ సిరిసంపత్తంతా ఆమెనుదుటి రేఖ.

సుబ్బారావుగారు కామేశ్వరమ్మగారికిపినతండ్రి కుమారుడు. ఆయన పెద్దాపురం హైస్కూలులో ఉపాధ్యాయులుగా నున్నారు. నెలకో వందరూపాయలిస్తారు. కాని ఆయనోసబురిజస్ట్రారా? ఓ, ఓక్కీలా? వకీలా! ఓ రివిన్యూ యినస్పెక్టరా? కనీసం 'ఓ' అంటే 'ఢం'రాని తాలూకాబోర్డు హెడ్ క్లార్కు అయినా కాడు. ఎన్నాళ్లు వుద్యోగం చేస్తే ఏం! వేలుకట్నాలు పెట్టి అల్లుణ్ణి తెచ్చుకునే తాహతు ఎక్కణ్ణించి వస్తుంది.

సరస్వతి చక్కనిచుక్క. ముక్కు, మొగము తీర్చినట్లుంటాయి; జనముద్దైన బిడ్డ; పాలుగారు బాల ప్రాయం వదలి అప్పుడప్పుడే పెళ్లి యీడు వస్తున్నది. రామాయణమహాభారతాలు అనర్గళంగా చదివి అర్థం చెపుతుంది, తల్లికి నాయనమ్మకు. బ్రహ్మానందునకు యీడుజోడు అని ఉన్నది సరస్వతి తండ్రికి. కామేశ్వరమ్మగారు కులశీలములు చూచుకుని కుర్రవాడు కుర్రదీ

యింత సుఖంగా పదికాలాలపాటు కాపురం జెయ్యడం కోరుకునే యిల్లాలుగనుక డబ్బు కక్కూరితికి దౌర్భాగ్యపు సంబంధాలకు ఒప్పుకునేదిగాదు. అదిగాక సుబ్బారావుగారు కూడా వెయ్యినూట పదహార్లు యిస్తామంటున్నారు. ఎక్కడికి దీనికి అంతు?

బ్రహ్మానందం వివాహం పదిరోజుల్లో వచ్చింది. పెళ్లికూతురి నగలకింకా పేరుపెట్టలేదు. 'సరస్వతికి కూడా తనలాంటి పూర్వోత్తరపు గుండూ బెండేనా' అన్నది కామేశ్వరమ్మగారు పెనిమిటితో. "ఎందుకూ! ముప్పైకాసులు పెట్టి డాలరుగొలుసు, పదికాసులకు నాలుగు రకాల గాజులజతలు ముందు చేయింతాం; రేపు సంతగూడాను; షరాబు పూట్లో కొస్తాడు. షరాబును బిలిపించవోయి" అన్నాడు భీమేశ్వర్రావుగారు జవానుతో!

సాయంకాలము మునసబుగారు కోర్టునుంచి అయిదుగంటలకు యింటికివచ్చి వసారాలో ఒకపడకకుర్చీలో జేరగిలబడ్డారు. వారి ముఖవిలక్షణంచూచి నౌకర్లు దూరదూరంగా తప్పుకుంటున్నారు. ఆ చివరిని ఎదురుగుండా గోడవొత్తుకు చినిగిపోయిన పాతగుడ్డలు కట్టుకుని ఒక బీదబ్రాహ్మణుడు చిన్న గుడ్డమూట దగ్గర పెట్టుకుని కూర్చొనున్నాడు.

భీ—ఎవరయ్యా నీవు? ఎందుకక్కడ కూర్చున్నావు.

బ్రా—బాబూ, మాది ఒంగోలు తాలూకా అండి. సంసారం జరక్క సంచారార్థం వచ్చాను తమలాంటి ప్రభువుల దర్శనం చేయడానికి. ఈరాత్రి పట్టెడు ప్రసాదం పెట్టించమని కోరాను. అమ్మగారు ఉండమని సెలవిచ్చారు.

భీ—ఊఁ.

ఇంతలో జవాను షరాబును తీసుకుని వచ్చాడు. షరాబు నలభైకాసులు బొత్తులుగా బల్లమీద పెట్టి తాను నోట్లు లెక్క చూచుకుంటున్నాడు. భీమేశ్వర్రావుగారు పరధ్యానంగా ఎటో చూస్తున్నారు.

మురళికి మూడేళ్లునిండాయి, నాలుగోయేడు నడుస్తోంది. కడసారివాడు అవడంచేత గారాబం ఎక్కువ. మురళి యిప్పుడు బాబయ్యగారికోసం పరుగెత్తుకుని వచ్చాడు. వారు దగ్గరకుతీసుకోలేదని అప్పుడే వెళ్లిపోయాడు లోపలికి తల్లి దగ్గరకు.

మునసబుగారు మెల్లగా లెక్కపెట్టడం ప్రారంభించారు కాసుల్ని. అన్నిలెక్కపెట్టి అట్టే షరాబుకేసి చూచారు. షరాబు వాటినందుకుని తానులెక్కపెట్టి చూసాడు. ముప్పైతొమ్మిది మాత్రమే కనబడుతాయి కాసులు.

షరాబు—(తెల్లబోయి) చిత్తం నలభైకాసు లుంచానండీ, బల్లమీద!

మున—అయితే ఏమవుతాయి? ఇంతలో యిక్కడికి ఎవరొచ్చారు? దాసీదాన్ని నౌకర్లను ఎవర్ని అవతలకు వెళ్లనీయవద్దు; గేట్లు తాళంవేయించండి. అందర్నీ సోదా చూడాలి; ఇంత ఆగడమా యింతలో!

బ్రాహ్మడికి ఏమీతోచలేదు. హా! పరమేశ్వరా అని గుడ్లనీళ్లు గుక్కుకొని మొలలోవున్న ఏడుకాసులు విప్పి పంతులుగారి బల్లమీద పెట్టాడు.

భీమేశ్వరరావుగారికి ఎక్కడలేని ఒళ్లుమంట, పట్టరాని కోపంవచ్చింది. (పండ్లు పటపటకొరుకుచూ) "ఎక్కడలేని దౌర్భాగ్యుల్నీ యింటికి చేరుస్తుంది" అని భార్యమీద విసుక్కొని, "దక్కించుకోలేక వెళ్లగక్కావు. బ్రాహ్మడవు గాబట్టి బ్రతికిపోయినావు. ఛీ, నీ మొగం చూడగూడదు. లేకున్న నిన్ను పోలీసుల కప్పగించి ఖైదులో పెట్టింతును. పదపద! యీ వేళటికి తర్లు" అని బంట్రోతుచేత బైటికి సాగనంపించాడు.

ఈదారుణమును చూడలేక సూర్యభగవానుడప్పటికి అస్తమించాడు. అంతలో బ్రాహ్మణుని హృదయమునావరించిన దుఃఖమువలె ఆకసమున మేఘము లలముకొని చీకటి కన్నుబొడుచుకున్నను కానరాదయ్యెను. వాని కన్నులనుండి జాలువారు వేడి నీటిచుక్కలవలె, చిటపట చినుకులు పడసాగెను. ఆశాకుసుమవిరహితమగువాని శూన్యహృదయమువలె ఆకసమునం దొకనక్షత్రమైనను గానరాదయ్యె. తన యభాగ్యమును నిందించుకొనుచు బ్రాహ్మణు డాచీకటి రాత్రి పెద్దాపురరసందులబడి తిరుగుచూ తనను పట్టుకొనుట కెక్కడనుండి వచ్చుచుండిరో యని వెనుకకు తిరిగి

చూచుచు తుదకోర్వక యింటివీథిఅరుగుమీద చదికిలబడి పొంగిపొరలివచ్చు దుఃఖము నాపుకొనలేక పెండ్లాము పిల్లలను తలచుకొని ఉసురుసురుమనుచు వేడి నిట్టూర్పులు విడుచుచు తీవ్రమగు హృదయవేదనకు పాలగుచుండెను.

లోపల నెక్కడో పనిచేసుకొన్న కామేశ్వరమ్మగార్కి యీగొడవ ఏమియు తెలియదు. వంట మనిషి వంటైనదని చెప్పుటతోడనే పెనిమిటికి కాళ్లు గడుక్కోడానికి నీళ్లిచ్చి బ్రాహ్మణ్ణి గూడా లేచి మడి గట్టుకోమనడానికి సావిట్లో కొచ్చేసరికి పంతులుగారు ధుమధుమలాడుతూ, పడదిట్టేస్తున్నారు బ్రాహ్మణ్ని 'ఇందుకనే నీళ్లకు పుట్టగతులుండ'వని. ఇంతలో భార్యనుజూచి "అడ్డమైనవాళ్ళను కొంపకు చేరుస్తావు. ఆ బ్రాహ్మణ్ణి తిండితినడమన్నావుట. వానిపిండాకూడు పిల్లులకెయ్య; ఆదౌర్భాగ్యుడు బల్లమీదకాసులుపెట్టి మాట్లాడుకుంటూ కూర్చుంటే ఏడుకాసులు తీశాడు. కదిలినట్టు లేదు; మెదిలినట్టూ లేదు. వాడు కంట్లోకనుపాపలను తీసే వాడిలాగున్నాడు. బ్రాహ్మడని వెధవను చీవాట్లతో విడిచిపెట్టాను. అన్నదానాలు,అతిథిపూజలు అంటూ దొంగముండాకొడుకుల నింటికి చేర్చకేం." అని ప్రారంభించాడు భీమేశ్వరరావుగారు. "మరి మురళి గుప్పెడు కాసులట్టుకొచ్చాడు లోపలికి. అవెక్కడివి" అంటూ కామేశ్వరమ్మగారు గదిలో పరుపుక్రిందనుండి కాసులు తీసి లెక్కపెట్టి (పెనిమిటితో) "పిల్లవాడుఏడుకాసులు యింతకుముందే పట్టుకొచ్చాడు. మీ పరధ్యాన్నముకు తోడు దిక్కుమాలిన తొందరగూడాను" అని కటకటబడ్డది.

"కాసులు పోయినాయని నే నెప్పుడు అట్టహాసం చేశానో అప్పుడు ఆ బ్రాహ్మడే బొడ్డులోముల్లె విప్పి తెచ్చియిచ్చాడే" అంటాడు భీమేశ్వరరావుగారు నిర్ఘాంతపోయి.

"ఎంతప్రమాదం ఎంతప్రమాదం. ఏపాపం యెరక్క పట్టెడన్న మాశించిన బడుగుబాపని పడదిట్టి పైబడి కొట్టబోయి చీకట్లో చినుకుల్లో యిల్లువెడలనడిచితిరిగా! ఆ మహానుభావుని హృదయం ఎంత క్షోభపడుతూన్నదో! పగలెవ్వరూ పిడిచెడు మెతుకులు పెట్టలేదన్నాడు కూడాను. ఈ అర్ధరాత్రి ఎటుపోయెనో? శోషవచ్చి ఎక్కడనైనా పడిపోయెనేమో కదా! ఈ బ్రహ్మహత్యా పాతకమునుగూడ ఒడిగట్టవలయును గాబోలు" నని కామేశ్వరమ్మగారు పరితాప పడజొచ్చెను.

మునసబుగారి కేమీ పాలు పోలేదు. వెంటనే యిద్దరు బంట్రోతులను లాంతరు పుచ్చుకొని ఆ బ్రాహ్మడు పోయినజాడ దెలుసుకొని వానిని దీసుకుని రమ్మని పంపెను. వారావీథులం దిరిగి ఒకసందు ప్రవేశించుసరికి ఒక యరుగుపై రామనామస్మరణచేయుచు, మధ్య మధ్య నేదియో జ్ఞాపకము రాగా నూల్గుచు, పడుచూ లేచుచూ, వెర్రివానివలె దిరుగాడుచున్న పేదబాపని జూచి "యీ వేళటికి అదృష్టవంతుల మే;తిరగలేక సున్న మాసింది. ఇదుగో బాపనాయన; యిక్కడ చిక్కాడు రా!బాబు. అప్పుడే యింతదూరం ఎప్పుడువచ్చావయ్యా; నీవు మా అసాధ్యుడులా ఉన్నావు!" అంటూ జవానులు దగ్గరకు వస్తూ ఉంటే "తండ్రీ! రామచంద్రప్రభూ! యింకా ఏమి అమానుషంగా నున్నదో అప్పుడే ఏమైంది. ఇంతటితో వదిలేశారా నన్ను! దరిద్రుడు ఒడిగడితే వడగండ్ల వానకురిసిందట. ఇంతకు, దరిద్రంతో తట్టుముట్టాడుతూ లేమిడి సంసారంగదా అని దేశాలుగాని దేశాలను అడిచూసనువచ్చి, అగచాట్లపాలై తినిగా, రామయ్యతండ్రీ! నీదయ యింతగా వచ్చిందేం. ఈ దిక్కుమాలిన పక్షిమీద! ఏమీ! నాయనా యిది; ఏనాటి శత్రుత్వమో" అని విలపించుచు బంట్రోతుల వెనువెనుకల అడుగులు తడబడుచూ నడుచుచుండెను.

వీథిలోకి రాగానే భీమేశ్వరరావుగారు "ఏమయ్యా, నీవు తమాషా బ్రాహ్మడులా ఉన్నావు. కాసులు పోయినా యంటే గప్‌చిప్‌గా కట్టుపంచ ముడి విప్పి మారుమాటాడకుంటూ బల్లమీద పెట్టి తోవను బట్టావు?"

ఇంతలో కామేశ్వరమ్మగారు "ఎంత ప్రమాదం; శాస్త్రుల్లుగారు! ఎంత పొరపాటుపని జరిగింది. కుర్రవాడు గుప్పెడూ దీసుకుని గుసగుసలోపలి గుమ్మం లోకి వస్తూ ఉంటే, కుర్చీలో కూర్చున్నవారు కనుకుతున్నారు గాబోలు! అయినా, అంత తొందరేమమ్మా, మనుష్యులకు!!

"కాసులు పోయినాయని బాబుగారికి క్లైర్రజేసి, సోదాచూడవలెనని చుఱుముఱుచూచేటప్పటికి, ఏలాగూ మొలబట్టి కొప్పిస్తారు. మానుషం దక్కదు. అందులో తక్కువ ఎన్నో నాబొడ్డున వున్నవన్నీ! ఏంచెపితే ఏమి నమ్ముతారు; పాతగుడ్డలు గట్టుకుని పట్టెడన్నముకు పరులపంచల బడియున్నవాణ్ణి; పైపెచ్చు అమానుషంగూడాను అవుతుంది. నేనేతీసి కళ్లి యిస్తే కొంత కనికరిస్తారని అల్లా చేశాను. వెన్నెలను వేగిపోయేదేశాలు; నిప్పన్నరపు కాపురం; పేదరికమునకు పిల్లలెక్కువన్నట్టు ఏదో యీశ్వరుడు నలుగురుపిల్లలనుగూడా యిచ్చాడు, కూనా గుడ్డూ. సుభిక్షమైన దేశం; ఏదోనలుగురు సంపన్నగృహస్థుల దర్శనంజేసి ఒకరెండు నెల్లపాటు సంచారంచేస్తే ఏమో! ప్రాప్తం" అని యిటువైపులకువచ్చి మనవాళ్లని చూస్తుంటే యీశ్వరుడు వారికి బుద్ధిపుట్టించినంత తృణమో కణమో, కటాక్షిస్తూవచ్చారు. ఎప్పటినప్పుడేమణి ఆర్డరు చేద్దామంటే ఆడమనిషి పట్టి అరబంధురాలు; పిల్లలు పసివాళ్లు. అందుకని ఎప్పటికప్పుడు కాసులుమార్చి మొలలో గట్టుకుంటాను. ఇంతకూ నేను లేచినవేళ మంచిది. "అమ్మా, అబ్బాయిగారు వాటి నెక్కడనైనా పారవేసినట్టాయనా, అవి కనబడకపోతే అప్పుడేమనే వాళ్లు? ఎంతపాపం చేసుకుంటేనో కాని కూటికి గుడ్డకు దూరముగాము మాతల్లీ!"

"తొందరపడ్డాను సుమండీ శాస్త్రులుగారూ, అదిచూడండి- కాకతాళీయంగా. అన్నీ సరిగ్గా మీదగ్గరుండడం."

"సరిలెండి; ఈవాళటికి అదృష్టవంతులము. అంతటితో పోనిచ్చారు! ఎంత అప్రతిష్ఠ! ఎంత అపఖ్యాతి! మాయతొందర! మంచిచెడ్డా లే! బాగానె వుందిగాని, మడిగట్టుకోండి పొద్దుపోయింది. అబ్బాయి పెళ్లిదాకా ఆగుతారులెండి శాస్త్రులుగారు!!

సంపూర్ణము

మల్లికా పరిణయము

[వెనుకటిసంచికలోని చిత్రమునుజూచి వ్రాసినపద్యము]

పూడిపెద్ది వెంకట రమణయ్యగారు

మల్లికాకాంత యింటిగుమ్మమున నిల్చి
మెల్లమెల్లఁగ దూరుపు మేడవెడలు
చందమామలప్రోవు పున్నమ చందమామ
జాడఁ దిలకించి పులకించె సంతసించి
ప్రణయరాగంబు హృదయానఁ బట్టలేక
వానికరములలోఁ జొచ్చి మేను మఱచి
కౌఁగలింతను మెల్లఁగఁ గరఁగిపోయె

* * * *

వేదనాదంబుతోఁ దేఁటి విప్రుఁడెగిరి
చిన్ని జిలుగుల రెక్కల చేతులెత్తి
మేలిదీవన లిడె నూత్న మిథునమునకు

* * * *

ప్రణయదేవత పొంగి యంబరతలాన
వన్నెవన్నెల ముగ్గు లెన్నెన్నొ పెట్టె.

రాజేశ్వరి

దశిక సూర్యప్రకాశరావు గారు

రాత్రి ఏడుగంట లయినది. మాయింటిలో రాజ్యము రాజేశ్వరియుఁ దప్ప నెవరును లేరు. దక్షిణపువైపు వసారాలోఁగూరుచుండి లాంతరు దగ్గరబెట్టుకొని ఒక్కటే ధ్యానముతో రాజ్యము భాగవతములోని దశమస్కంధము చదువుచున్నది. నారాజ్యమునకు ఆపోతరాజుగారు వ్రాసిన కృష్ణలీలలు ఎన్నిసారులు చదివినను తృప్తియేలేదు.

“ఉ. అమ్మా! మన్నుదినంగ నేశిశువనో,
యాకొంటినో వెఱ్ఱినో
నమ్మం జూడకు వీరిమాటలు మదిన్
నన్నీవు కొట్టంగఁ దా
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు కా
దేనిన్ మదీయాస్యగం
ధ మ్మాఘ్రాణము సేసి.”

అన్నపద్యము భాగవతము తీసినప్పుడెల్లను చదివి సంతోషముతోను, జాలితోను, కన్నుల నీరు పెట్టుకొనుచుండును. అట్లే నేడును కృష్ణలీలలే చదువుచున్నది. ఇంక రాజేశ్వరి ఏమిచేయుచున్నదో మనవిచేసెదను. రాజేశ్వరికి నాలుగుసంవత్సరములు వచ్చే జ్యేష్ఠ మాసమునకు వెళ్లిపోవును.

తల్లి భాగవతము తీసికొని దీపమువద్ద కూర్చుండగానే తాను వెస్టుఎండుకంపెనీ వారి గడియారముల క్యాటలాగు తీసికొనివచ్చును. తల్లి భాగవతము లోలోపల చదువుకొనుచు కన్నుల నీరుగ్రుక్కుకొనుచు పరవశురాలగుచుండును. ఇంక మారాజేశ్వరి ఇట్లు గట్టిగా జదువ నారంభించును. “మాంకోనేటి తాతగారు ఎప్పుడు వస్తారో” మిఠాయి పట్టుకు వస్తారో, రారో” అని చదువుచు తల్లి చదువుచున్న భాగవతమును క్రిందకు దింపి పట్టుకొని ‘అమ్మా! తాతగారునాకు మిఠాయి తెస్తారా తేరా చెప్పవూ’ అని మారాము చేయుచుండును.



‘అమ్మా! తాతగారు నాకు మిఠాయి తెస్తారా తేరా చెప్పవూ’

గ్రంథపఠనమునకు కొంచెము అంతరాయము కలిగెనని దుఃఖపడునుగాని పిల్లపై విసుగుకొనక, 'ఉండుతల్లీ! అదుగో, రారా!' అబ్బీ! మాఅమ్మాయిని బుట్టలోవేసికొని పోరా! అని బూచివానిని పిలుచుచుండును. రాజేశ్వరి తాను పట్టుకున్న భాగవతమును వదలిపెట్టి ఏడువ నారంభించును. దీనితో రాజ్యము పుస్తకమును సాంతముగానే ఆవలపెట్టి రాజేశ్వరిని ఒడిలోనికి దీసికొని తలను వ్రేళ్లకొనలతో దువ్వి అమ్మా! అదుగో! తాత గారు క్రొత్త పరికిణీ తెస్తున్నారు. ఏడువకు తల్లీ!, అని సమాధాయించగా రాజేశ్వరి కొంచెము ఏడుపు మాని, కొంచెము మూతి ముడుచుకొని కూరుచుండును. తిరిగి రాజ్యము భాగవతము పత్రములు త్రిప్పుచుండును. రాజేశ్వరి, తల్లిని ఎప్పుడును పల్కరించుచునే యుండును. ఒక్క నిముసమయినను మాట్లాడకుండ నుండలేదు.

"అమ్మా! బుచ్చిరాజు మామయ్య వస్తే కాలువిఱగేస్తాను. నన్నెందుకు ముద్దెట్టుకోవాలేం" అని కొంతసేపు సంగీతము తీయుచుండును.

"అమ్మా! నాన్నగారు నీకే మవుతారు చెప్పవ్వూ!"

"అమ్మా! అక్కయ్యపాట నాకు చెప్పవ్వూ!" అని తల్లి చీరచెఱగు పట్టుకొని లాగ నారంభించును. ఇట్టి ప్రశ్నలు లక్షలు. ఆతల్లికి ఆకూతురునకు గనుక సరిపోయినది. ఆసాయంకాలము వారివెనుక కొంచెము దూరముగా నిలుచుండి తల్లీ బిడ్డలభాగవతమును జూచుచు నేను ఆనందించుచుంటిని.

ఇంతవరకును పట్టపగలువలె ప్రకాశించుచున్న వెన్నెల, మబ్బుగ్రమ్ముటచే మసక మసకగా గన్పట్టెను. తలయెత్తి ఆకసము వంక జూచితిని.

"రాజేశ్వరి ఏమిచేసినదో తెలియునా? చటుక్కున దీప మారిపినది. అబ్బబ్బబ్బా! ఎక్కడిపిల్లమ్మా" అని తల్లి కొంచెము పండ్లు బిగించునుగాని తానుచ్చరించుమాటలు ప్రేమపూరితములై వెలువడుచుండును. బిడ్డవిషయమై తనముఖముపై నెన్నడును కోపరక్తమే ఆరోహించనీయదు. రాజ్యము లేచి దీపము వెలిగించినది.

ఆసందడిలో అప్పుడే వచ్చినవానివలె నేనును లోన ప్రవేశించితిని. నన్నుజూచి రాజేశ్వరి నాయొద్దకు బరుగెత్తుకొని వచ్చినది.

మాయింటిముందు కొబ్బరిచెట్టుక్రింద మంచముపై విశ్రమించితిని. ఎందులకు? అది నా న్యాయాధిపతి పీఠము. కొబ్బరిచెట్టు మాకు సేవకుడై చల్లగా విసరుచుండును. చంద్రకాంతిలోనే కేసులు తీర్పు చెప్పుచుందును. ఫిర్యాది నాముద్దులబిడ్డ రాజేశ్వరి. ప్రతివాది రాజ్యము.

"నాన్నగారూ! మధ్యాహ్నం తొమ్మిది గంటలకు అమ్మ రాజంపిన్నిగారింటికి ముగ్గుకు వెళ్లింది. నాకు బువ్వపెట్టలేదండీ." అని ఒక ఫిర్యాదు.

"నాన్నగారూ! ఇందాక పదిరూపాయల మల్లెపువ్వులు కొనమంటే అమ్మ కొన్నది కాదు. నాన్నగారూ! మీరు అమ్మను

పడండీ" అని మఱియొక ఫిర్యాదు. అన్నిటికంటెను గొప్పనేరమొకటి యున్నది.

"నాన్నగారూ! అదిగో! చూశారా!" అని రాజేశ్వరి పరుగుపరుగునబోయి కడుపు చెక్కలగునట్లు నవ్వుచున్న రాజ్యమును ఒక్క దెబ్బవేసి తిరిగి నాదగ్గఱకు పరుగెత్తుకొనివచ్చెను. "చూడండీ! నాన్నగారూ! నాతో నవ్వ వద్దంటే ఎందుకు నవ్వాలేమిటి? అని రాజేశ్వరి సంగీతము దీయ నారంభించెను. నాతీర్పు లన్నిటిని ఫిర్యాదిపక్షముననే చెప్పుచుండెడి వాడను. నాతీర్పులు రాజ్యమున కెప్పుడును అపజయకరముగానే ఉండెడివి. అట్లు చేయకపోతినా రాజేశ్వరి ఏడుపునకు అల్లరికి మితి యుండదు. కాబట్టి బిడ్డకొఱకు ధర్మమువదలి పెట్టి తప్పుడు తీర్పులు చెప్పవలసి వచ్చుచుండెడిది.

వెన్నెల ప్రకాశించుచున్నది. తెలిమబ్బులలో చంద్రుడు దాగిలిమూతలాడుచున్నాడు.

నేను:—అమ్మా! రాజేశ్వరీ! ఆ తెల్లమబ్బులు ఎల్లా ఉన్నాయో చెప్పు.

రాజే:—చెప్పనా! మా తాతయ్య తెల్లగడ్డమువలె నున్నాయ్—

నిజము; నామామగారికి తెల్లగడ్డము గలదు.

మారాజేశ్వరి ముఖచంద్రుడు, నామామగారి తెల్లగడ్డము మబ్బులలో దాగిలిమూతలాడుచుండుటను గనుక మాబిడ్డకు సరియయిన పోలికయే తోచినది.

"మీరు కవులు గనుక ఇల్లాంటివన్నీ తోస్తుంటాయి మీకు" అని రాజ్యము చిఱునవ్వుతో ననెను.

వీథిలో కేకలు వినవచ్చెను. మాపెంపుడు కుక్క మొఱుగ నారంభించెను. "రాజారావు పంతులుగారు ఇంట్లో ఉన్నారా?" అని ముసలి స్వరము వినవచ్చినది.

రాజ్యముపోయి వీథితలుపు తెఱచివచ్చినది. రాజ్యము ఆవచ్చినవారికి కాళ్లు కడుగుకొనుటకై నీళ్లబిందె చప్పుడుచేయుచుండెను. నేను మంచముమీదనుండి లేచి నిలువబడితిని. మాపిల్ల చప్పటలు చఱచుచు, చిందులుత్రొక్కుచు "మాకోనేటి తాతగారు వచ్చారు. మాకోనేటి తాతగారు వచ్చారు" అని కేకలు వేయుచు తాతగారిచేతిలోని మిఠాయిపొట్లము నెత్తికొని తల్లి వద్దకు పాఱిపోయెను.

ఆవచ్చినవారు కోనేటితాతగారు కాదు, అది రాజేశ్వరి పెట్టినపేరు. ఆయన కోనసీమ తాతగారు. ఆయనను మేము అట్లే పిలుచుచుందుము. వారిది అమలాపురం తాలూకా యని మా నాన్నగారు చెప్పుచుండెడివారు. మానాన్నగారికిని, వీరికిని ప్రాణస్నేహము.మా పట్టణములో వారికి వ్యవహారము కలదు. ఆ కారణమున అప్పుడప్పుడు మా యింటికే వచ్చుచుందురు. మాతండ్రిగారు జీవించియున్నప్పుడు మేము చిన్నపిల్లలమై యుండగా వీరిని కోనసీమ తాతగారని పిలిచెడివారము. అందుచే, నాకును, నాభార్యకును, మాబంధువు లందరికిని కోనసీమ తాతగారయినారు. రాజేశ్వరికి మాత్రము కోనేటి తాతగారయినారు.

కుశలప్రశ్నలు చేసికొనుచు భోజనమునకు లేచితిమి. కోనసీమ తాతగారు చాల మంచివారు. వారి ముఖముపై నెప్పుడును చిఱునవ్వు సుందరనాట్యము చేయుచుండును. రాజ్యము నన్నకుండెను నాకు జంకు. వాస్తవముగా స్త్రీకి ఆమాత్రము ధైర్య మెక్కడనుండును? అందులో భాత్రిగా పిటికిది నారాజ్యము. పది నిమిషను లయినది.

"మా కోనేటి తాతగారు వచ్చారు ...."

"మిఠాయిపొట్లము నెత్తికొని................"

మా అందరకంటెను, రాజేశ్వరికి కోనసీమ తాతగార్లంటే ప్రాణము. ఆయన నెప్పుడును వట్టిచేతులతో రారు. అది కథ.

భోజనము చేయుచుంటిమి లోపల.వీథిలో మాకుక్క గట్టిగా మొఱగజొచ్చెను. 'రాజేశ్వరీ! అమ్మాయీ!' అని ఆత్రముతో తల్లి బిడ్డను పిలుచుచుండెను. కుక్క రాజేశ్వరిపై బడనేమోయని దానిభయము. కాని మన కుక్క, మనపిల్ల నేమియు చేయదనియు, కుక్క విశ్వాసము నాకు తెలియుటచే భయములేదని రాజ్యమును వారించితిని.

రాజేశ్వరి వగర్చుకొనుచు వచ్చి "నాన్నగారూ! నాన్నగారూ! అని ఒక్కగంట చెప్పినట్లు చెప్పినది. మఱేమోనే-మఱేమోనే, అంటుంది కాని పైముక్క చెప్పదు. రాజ్యము ముఖముపై నొక్కుచుకొ లేదు. పెద్దపులివలె నేనుండుటచేతను, పరాయిపెద్దమనుష్యు లుండుటచేతను నిలిచి యున్నది. లేకపోయిన వో కొంచెము కథ నడిపెడిదే.

చివరకు రాజేశ్వరి యిట్లు చెప్పినది:

"నాన్నగారూ! బుచ్చిరాజు మామయ్య కాలు విఱుగగొట్టారు పిల్లలు."

ఈభాష నాకు అర్థమయినది. నాభార్యకు అర్థమయినది. రాజ్యమునకు ప్రాణము వచ్చినది. చిఱునవ్వు నవ్వినది. రాజ్యము చిఱునవ్వుతో నాహృదయము వికసించినది. కోనసీమ తాతగారికి అర్థము కాలేదు. అప్పుడు వారికి మనవి చేసితిని. "అయ్యా! నాముద్దు కుక్కను నాబానసముఅది ఇచ్చి రాజు పేరుపెట్టితి" నండీ యంటిని. మేము నవ్వుకొంటిమి. తాతగారు రాజేశ్వరి పలుకుపలుకునకు మురియుచుండిరి. భోజనముచేసి లేచితిమి.

రాజేశ్వరి తల్లిని మఱచినది. నన్ను వదలిపెట్టినది. తాతగారితో ముచ్చటలు చెప్పుచున్నది. "తాతగారూ! మీ వూళ్లో మల్లెపువ్వు లెన్ని ఉన్నాయండీ. నా కిస్తారా మీ వూరొస్తాను." తన నాలుగువ్రేళ్లు చూపించి "ఇరవైరూపాయలు పెట్టి కొనిపెట్టాలి" అనెను. ఇదేవిధముగా తాతగారితో మనుమరాలు ప్రసంగించుచుండెడిది.

రాజ్యము లోపలనుండి వీథిలోనికి మాకు పక్కలు వేయుటకు వచ్చినది. నేను వెన్నెలలో పచారుచేయుచు కొబ్బరిచెట్టు గాలికి సంతోషించుచు, రాజేశ్వరి ముద్దుమాటలకు మురియుచుంటిని. చంద్రుడు ప్రకాశించుచున్నాడు.

తాతగారినిచూచి రాజ్యము

"పెదనాన్నగారూ! రాజేశ్వరిని మీ యింటికి తీసికొనివెళ్లండి. దానికి మల్లెపువ్వులు కొనిపెట్టండి. మీఅబ్బాయి కిచ్చి పెళ్లిచేసికోండి. మీయింటనే వుంచుకోండి." అని చిఱునవ్వుతో పలికినది.

రాజేశ్వరికి కోపమువచ్చినది. చివాలున లేచినది. నే నీవింతను జూచుచుంటిని. రాజేశ్వరి యింటిలోనికిపోయి మరలవచ్చి "కోనేటి తాతగారూ! లేవండి. మనవూరికి వెళదాము." అని తాతగారి చేయిపుచ్చుకొని లాగజొచ్చెను. తాతగారు బోసినోరుతో (పండ్లూడినవి గాని అరవైయేండ్లు దాటలేదు) కడుపుబ్బ నవ్వి రాజ్యమునుచూచి "అమ్మా చంకలోనిదదేమో చూడు. ఓసి! దీని కడుపు పుడక. పరికిణీ తెచ్చుకొన్నది చూశావా అమ్మాయీ!" అని కడుపు చెక్కలగునట్లు నవ్వెను. సంతోషముగా నారాత్రి గడచెను. ఆరాత్రి అన్నమాట యేమి? ఎప్పుడును మా రాజేశ్వరి మూలమున మేము సంతోషించుచుండువారము. రాజేశ్వరి మాయింట ఆనందలక్ష్మివలె నుదయించినది. పూర్వము ఇదని, అదని రాజ్యము నేను, మాటపట్టింపులు పట్టుచు తగవులాడుచుండెడివారము. పనిలేకపోవుటచే అట్లు జరుగుచుండెడిది. ఇప్పుడట్టివి అస్తమించినవి.

తాతగారు తమ పనిచూచుకొని రాజేశ్వరికి క్రొత్త చొక్కాకుట్టించి, మిఠాయి పొట్లము చేతికిచ్చి, మల్లెపువ్వులు తెచ్చేదానికి కొంతడబ్బిచ్చి, నిత్యము రాజేశ్వరికి మల్లెపువ్వు లిచ్చునట్లు రహస్యముగ నేర్పాటుచేసి, వారు మావూరు వదలిపెట్టి వెళ్లినారు.

రాజేశ్వరి వెఱ్ఱిమాటలు తగ్గలేదు. పిచ్చిపిల్ల అయిపోవునేమోయనికూడ రాజ్యము భయపడుచుండెడిది. ఆయేటికాయేడు పైబడుచున్న కొలది రాజేశ్వరి అల్లరికూడ ఎక్కువగుచున్నది. నే నింట లేనప్పుడు ఒక్కనిమిష

ము యినను తా నింటనుండదు. భోగింప్ల పెత్తనా లెక్కువయినవి. ఎప్పుడూ ఆటలే. ఎప్పుడూ గంతులే. ఇప్పుడు రాజ్యముచేయు ఫిర్యాదు లెక్కువయినవి. అదివరకు ఇంటిలో పనియంతయు తానొక్కతెయే చేసికొనుచుం



"ఓసీ! దీని కడుపుడక. పరికిణీ తెమ్మకొన్నది చూశావా, అమ్మాయీ."

డెడిది. ఇప్పుడో రాజేశ్వరి ఒక్కనిమిషమయి నను ఇంటిలో నుండదనియు, ఉన్నప్పుడయి నను, ఆ చెంబు ఇవతలపెట్టుమంటే పెట్టదనియు నాతో చెప్పుచుండెడిది. ఇట్లు జరగిపోయినది కొంతకాలము.

మా రాజేశ్వరికి పన్రెండుసంవత్సరములు నిండినవి. అదివరకు రెండుసంవత్సరములనుండి రాజ్యము వ్యాధి బాధితురాలయియున్నది. ఒక్కొక్కప్పుడు దాని ఆయువు విషయమై నిరాశ చెందుచుండెడివారము. ఈ దీర్ఘవ్యాధి మొదట మన్యజ్వరముతో ప్రారంభించినది. ఆపిదప ఆరోగ్యమును రాజ్యమే పోషించి పెంచుకొన్నది. రాజ్యమునకు ఆచారము మెండు. కొంత ఛాందసముకూడ మిళితమయి నది. ఆచారమనగా శుచియనియే నేను అర్థముచేసికొనెడివాడను. రాజ్యము అట్లుకాగా.

ఆచారమువలన మోక్షము సిద్ధించునని దాని నమ్మకము. ఎట్లయిననేమి? రాజ్యముచేయు ఆచారమునకు నేను తలయూపితిని. అది పరమ శుచిత్వముగుటచేత చివరకు జరగిన పనియేమో తెలియునా? నేను గ్రామములో లేనప్పుడు తాను కొంచెములేచి తిరుగగలిగినప్పుడు, జ్వరము వచ్చుచున్నను తడిగుడ్డలు పగలంతయు, కట్టుచు దినమున నెనిమిదిమారులు శిరస్నానములు చేయుచు ఇట్లనేకదినములు చేసి రోగము పోషించుకొన్నది. ఎన్నిమందులిచ్చినను కుదురుటలేదు. నే పెక్కుమందు లిప్పించి

తిని. వ్యాధి కుదురలేదు. ఎంత వ్యాధియయినను సరే, జీర్ణకోశనియమమును పాటించుచు, ఆహారపదార్థములలో మార్పులు కలుగజేయుచు శరీరము కాపాడినయెడల ఔషధము లక్కఱలేకయే సొంతముగ కుదిరి వజ్రదేహముగ మారునను మతముగలవాడను నేను. అట్లే సర్వవిధముల రాజ్యమునకు ఔషధప్రయోగము లేకయే దాని వ్యాధిని నివారించుచుంటిని. కాని గోదావరి జిల్లాలోని సుప్రసిద్ధ వైద్యశిఖామణులగు భగీరథ శాస్త్రులవారి ఔషధము సేవింపనిదే తనకు వ్యాధి నివారణ కాదని రాజ్యమునకు గట్టి నమ్మకము. ఔషధ మనవసర మని నే నెన్నిసారులు బోధించినను దానికి విశ్వాసము లేదు. సహజముగ భీరువగుటచేతను ఆ యలవాటులకు లోబడియుండుటచేతను తన వ్యాధికై మిక్కిలి బెంగగొని యుండెడిది. ఆకారణముచే వ్యాధి మరలెడిది కాదు. రాజ్యము పిచ్చినమ్మకములకు నాకప్పుడప్పుడు మొగ మరుణమయ్యెడిది. కాని ఒకసంగతి గుర్తించితిని. దాని యభీష్టము తీర్చినచో వ్యాధి నివారించు నని యనుకొంటిని. ఎట్లయినను వ్యాధి కుదురుటయే నాకు కావలసినది.

తల్లి వ్యాధిగ్రస్తురా లయినది మొదలు రాజేశ్వరి ఆటపాటలకు సెలవుచెప్పినది. ఎప్పుడును తల్లి మంచము యొద్దనే కనిపెట్టుకొని యుండెడిది. ఇంటిలో పనులన్నియు తానే చేయుచుండెడిది. అంత నెమ్మది. అంతకుదురు అంతబుద్ధి నేర్చుకొనుటకు తల్లి చాల సంతోషించెడిది. తనవ్యాధిలో దానికి ప్రబల విచారముకూడ కలదు. రాజేశ్వరి-అయ్యో! ఈడేరిన బాలిక. కల్యాణము కాకపోయెనుగా యని పరితపించెడిది.

ఒకదినమున తన సోదరిని చూచుటకై బుచ్చిరాజు మాయింటికివచ్చెను. బుచ్చిరాజు నాబావమఱదియే కాదు; నాకుప్రాణము. అతనికి నేనును అట్లే. రాజేశ్వరి వివాహ విషయమై బాధ్యత అతనిదే కాని నాది కాదు. నేను చిరకాలము విదేశములలో నుండుటచేత ఆంగ్లేయభాషాభ్యాసమునకై చాలకాలము వినియోగించుటచేతను వివాహసంబంధములు కుదుర్చుట నాకు బొత్తిగా తెలియదు. బుచ్చిరాజు వ్యవహర్త; రాచకార్యములం దారితేఱినవాడు. అతఁడు పెక్కు గ్రామములు తిరిగి చాలామందిని సంప్రతించి అనేక కష్టములు పడి రాజేశ్వరికి సంబంధములు వెదకెను. వరుడిట్టివాడనిగాని, వారివసతి యేమనిగాని, వంశమెట్టిదనిగాని అతని నడిగెడివాడను గాను. అత డేమయిన చెప్పినయెడల 'ఊ' కొట్టెదను. అతనియందు నా కంతవిశ్వాసము కలదు.

"చూడు-బావా! రాజేశ్వరికి ముక్కామల గ్రామములో చక్కని సంబంధము కుదిర్చితిని." అని వసతిని గురించియు, వరుని గురించియు మిక్కిలి శ్లాఘించి ఆసంబంధమే నిశ్చయపఱచిన బాగుండునని బుచ్చిరాజు నాతో చెప్పెను.

ఆసంబంధమే నిశ్చయించితిమి. వివాహమునకు సర్వయత్నములును బుచ్చిరాజే నడుము బిగించుకొని యాచరించెను. రాజ్యము సొంతముగా మంచమునుండి లేచుటలేదు.

వైశాఖశుద్ధమందు శుభలగ్నము నిశ్చయపఱుపఁబడినది. రాజ్యము తూలుచు పడుచు లేచుచున్నది. రాజేశ్వరి తల్లి సేవయందే ఎప్పుడును కాలము పుచ్చుచుండెడిది.

పెండ్లివారు ముక్త్యాల నుండి తరలి మాయింటికి వచ్చినారు. వారికేర్పాటు లన్నియు బుచ్చిరాజే స్వయముగా చేయించుచుండెను. మాపైపు మాబంధువులందరుకూడ విచ్చేసిరి. మాకు వసతికేమియు లోపము లేకపోవుటచే వివాహము వైభవముగానే చేయ నిశ్చయించితిమి.

మాగ్రామప్రజలందఱు వింత వింతలుగా చెప్పుకొనసాగిరి. ఫలాని రాజారావుపంతులుగారి (నేనే) వియ్యంకులు సుప్రసిద్ధవైద్యశిఖామణులగు భగీరథశాస్త్రులవారుసుమా! వారిని దర్శించి కృతార్థులము కావలెనని వారిలో వారనుకొనుచుండిరి.

మాగృహమంతయు మహావైభవముగా నుండెను. రాజేశ్వరికిగాని నాకుగాని హృదయమంత స్తిమితముగా లేదు. రాజ్యము సంపూర్ణారోగ్యము కలిగియుండకపోవుటచే మాకంత సంతోషముగ లేదు. వ్యాధి అపాయకరమైనది కాదని నాకు తెలియును. కాని దాని దీర్ఘత్వమునకు భయపడుచుండెడివాడను. కానిమ్ము; భగవంతుడు లేడాయనుకొనుచుండెడివాడను.

తన వియ్యంకులు భగీరథ శాస్త్రులవారని తెలియుటతోడనే మా రాజ్యమునకు సగమువ్యాధి నివారించినది. మంచమునుండి తనంతట లేచి తిరుగ మొదలు పెట్టెడిది. తానెవరి ఔషధమువలన వ్యాధి పోగొట్టుకొనదలచినదో వారే తనయింటికి విచ్చేసి యున్నారు. ఆయన ఖ్యాతి నే నెరుఁగనిది కాదు. ఇట్లు జరగుచున్నది.

మాదక్షిణపైపు వసారాలో రాజ్యము చక్కగా నలంకరించుకొని క్రొత్తచీర గట్టుకొని రాజేశ్వరి తలలో పువ్వులు ముడుచుచున్నది. నేనును, బుచ్చిరాజును కలిసి లగ్న సమయమును మాట్లాడుకొనుచు అక్కడకు వచ్చితిమి.

మేము నలువుర మున్నచోటికి ఒకవృద్ధబ్రాహ్మణుడు వచ్చెను. ఆయన ముఖము ముడతలు పడుచున్నదిగాని కాయవంటి శరీరమగుటచేత శరీరము శుష్కించి యుండలేదు. ఆయన ముఖమునుండి శాంతతేజస్సు ప్రకాశించుచున్నది. పెదవులపై చిఱునవ్వు నృత్యము చేయుచున్నది. ఆయనను చూడగానే రాజేశ్వరి సిగ్గుతో తలవంచుకొన్నది. ఆవచ్చినది "కోనసీమ తాతగారు" ఆహా! ఎంత పుణ్యదినము. 'తాతగారినిచూచి ఎన్నాళ్లయినది' అని నేనంటిని. "పెదనాన్నగారూ! రాజేశ్వరి వివాహవిషయమై తమ కొన్ని ఉత్తరములు వ్రాయుడని కోరినను మీఅల్లుళ్లు వినలేదు, నేనేమిచేయను" అనిరాజ్యముఅన్నది.

ఈ విషయమై రాజ్యము కోరినమాట సత్యమే. కాని, కోనసీమతాతగారని పిలుచుటయేకాని వారిఊరుగాని వారి పేరుగాని తెలిసికొనుట కిదివర కెన్నడును ప్రయత్నము చేయలేదు. కోనసీమతాతగారు రాజే

శ్వరిని చూచినారు. పూర్వమువలె చేతిలోని మిఠాయిపొట్లము ఎత్తుకొనిపోవుననియు, చంకలో పరికిణీ పెట్టుకొని, "తాతగారూ, మనవూరు వెళదాముపదండి" అని చేతులు పుచ్చుకొని లాగుననియు ననుకొనెను. రాజ్యముపై నేరములు చెప్పుచుండునని తాతగారు తలచిరి. అట్టి వేవియు జరుగలేదు. రాజేశ్వరి పెండ్లికూతురయినది. ఎవరితోను మాటలాడుటలేదు. నాతోనే సరిగా మాట్లాడదు.

ఈ చిత్ర మంతయు జూచుచు మా బుచ్చిరాజు తెల్లపోవు చుండెను. బుచ్చిరాజు నన్ను జూచి 'బావా! మీరును మీరును బంధువులే. నేనే పరాయివానివలె కనబడు చున్నాను. మీ రనుకొనుచున్న కోనసీమ తాతగారే మావియ్యంకులయిన సుప్రసిద్ధ వైద్యశిఖామణులగు భగీరథశాస్త్రులువారు.' అనెను. మేమందఱము ఆశ్చర్యపడితిమి. రాజేశ్వరి సిగ్గున తలవంచుకొని పాఱిపోయెను. రాజ్యము కూర్చుండుటకు పీట తెచ్చివేసెను. ధన్యులము ధన్యులమని నేనంటిని.

వివాహము మిక్కిలి ఆనందముగా నెరవేఱినది. శ్రీ భగీరథశాస్త్రులవారి దర్శనము చేత నేనా రాజ్యము వ్యాధి నివారణయయ్యెను.



" మేము నలువురమున్నచోటికి ఒక వృద్ధబ్రాహ్మణుఁడు వచ్చెను."

ఇక రాజ్యము వ్యాధివిషయమై మాకు బెంగలేదు. భగీరథశాస్త్రులువారు రాజ్యమును జూచి, "అమ్మా! రాజేశ్వరి చిన్నతనమున ఈ దక్షిణవసారాలో, ఈ కొబ్బరిచెట్టు సాక్షిగా పండువెన్నెలలో నీవొక్కముక్క అంటివి జ్ఞాపకమున్నదా! అప్పుడు రాజేశ్వరి చంకలో పరికిణీ పెట్టుకొనివచ్చినది. 'పెదనాన్నగారూ! రాజేశ్వరిని మీయింటికి తీసికొనివెళ్లండి, మీ అబ్బాయికిచ్చి పెండ్లిచేసికొనండి. దానికి మల్లెపువ్వులు కొనిపెట్టండి' అని నీవంటివి. అట్లె

నెరవేరినది. రాజేశ్వరి కొరకు లోపముండునా? కాబట్టి మీరు దిగులుపడవలసిన పనిలేదు." అనియెను.

రాజ్యము సంతోషముతోను, బాలికా వియోగదుఃఖముతోను కన్నుల నీరు గ్రుక్కుకొనెను. ఆనాడు, ఆ పండువెన్నెలలో కొబ్బరిచెట్టునీడను పచారుచేయుచున్నప్పుడు రాజ్యమాడిన మాటలను వింటిని. నేటి తాతగారు వచించిన పలుకులను ఆలకించితిని. అప్పుడును సంతసించితిని. ఇప్పుడును సంతసించితిని.

వలపువగలు

గరిమెళ్ల సత్యనారాయణ గారు

౧

వలచివచ్చితి కొండంత వాంఛతోడ
తీర్చగలయట్టి సొగసుల తిన్నెవనుచు
కూర్చొనగ సుంత తావునుం గోరుచుంటి
వబల, ఇదినైజమా, ప్రణయంబ చెపుమ!

౨

సొగసుతేదంచు స్థైర్యంబు శూన్యమనుచు
ఎంచి నిరసింతువే నన్ను నెమ్మెలాడి!
పలుయటులైన నిటు మురిపింతొ చెపుమ
ఆదరణమందహాసంబు లల్లి యల్లి.

౩

వలసదేశంబులుం బడి బడలి బడలి
ప్రాణములు బిగ్గపట్టితిన్ బడతి! నీదు
ఆదరణ మొక్కనాడైన అనుభవించి
తుష్టిపడకుండ మరణింప నిష్టపడక.

౪

రానియన్నాళు లెపుడు నారమణు గన్నులార గనెదని దీనవై యరచినావు
వచ్చి నీసన్నిధానప్రవర్తినైన
అన్యునివలె జూచుట కాత్రపడవు.

౫

తప్పు నాయొద్ద గలదనే తలతుగాక
తప్పు తప్పకో బ్రహ్మకుం దీరముకాదు
ఇప్పటికినైన నన్గౌగిలించుకొనవె
కూర్మి కొసరుచు ఒప్పుల కుప్ప!...

(సంపూర్ణము)

నా మిత్రుని జీవిత చరిత్ర

కాళ్ళూరి వెంకటరామారావు గారు

కారణాంతరములచేత నేను రెండేండ్ల క్రితము నైజాంరాష్ట్రమున నున్న "సింగరేణి" పోవుట తటస్థించినది. అక్కడ నున్న విశేషముల జూచుచు నేనొక నాటి యుదయ మచ్చటి కంపెనీవారి యాసుపత్రి జూడబోయితిని.

అందులో రమారమి ఎనిమిదివందలమందిరోగులు కలరు. వీరందరును అక్కడి బొగ్గగనులలో పనిచేయు కూలివాండ్రు మాత్రమే. నే నా వైద్యశాలాధికారితో మాటలాడుచు వేరువేరుగదులు చూచుచుంటిని. ఇంతలో ప్రక్కగదిలోనుండి "దాహము — దాహము" అను దీన స్వరము వినవచ్చినది. ఆకంఠస్వరము నా కెక్కడనో పరిచితమై యున్నట్లుగ తోచినది. "ఆస్థలమున నాకు పరిచితు లెవరుందురా!" అని యనుకొనుచు నే న యుద్యోగితో నాగదిలోనికి బోయితిని.

ఆగదియందొక చిన్నమంచము పైని కృశీభూతుడగు పురుషు డొకడు శయనించియుండెను. అత శరీరమంతయును ధవళవస్త్రాచ్ఛాదితమై యుండెన ముఖము గుర్తింపరానంత నీరసించియుండెను. కను మూతలుపడి యుండెను. నోరు తెరచుకొనియుండెను నాతోవచ్చిన యుద్యోగి యాతని కంఠమున కొంచెమ వెచ్చనిగంజి పోసెను. రెండుమూడుగ్రుక్కలు త్రాగి పిమ్మట నారోగి కనులు విడెను. అత నాముఖమువం నొక్కసారి చూచెను. తక్షణ మాతని నేత్రములం దొ విధమగు పరిచితభావము గోచరింప "అయ్యా! మ దేవ్వారు? అని ప్రశ్నించెను."

"అతడు నాముఖమువంక నొక్కసారి చూచెను."

అప్పటి కాతని నింకను పోల్చు కొనకున్నను, కంఠస్వరముమాత్రమ నాకు చిరపరిచిత మగుట నిశ్చయ మయ్యెను. నే నాతనిదరిజేరి "మా విశాఖపట్నం జిల్లాలోని నెల్లిమర్ల అన్నాను.

ఆరోగి లేవబోయి యశక్తు పడిపోయి హీనస్వరమున "నన్ను వి రెరుగుదురా?" అని యడిగెను.

నే నింకను అతనిని పోల్చుకొ లేదు. అప్పు డాతడు "అయ్యో దైవమా! పూర్వస్నేహితులకి కూడ దూరమై పోయేనా!" అని మెల్ల ననుకొని నాదిక్కుచూచి "అప్ప

స్వామి మీ కొకప్పుడైనా స్నేహితుడు కాడా? అనెను. తత్క్షణము నే నాతనిని పోల్చుకొంటిని. బాల్యమున మేమిర్వురమును కలిసి మా స్వగ్రామమైన "నెల్లిమర్ల"లో ప్రారంభవిద్య నేర్చుకొంటిమి. ఆతని కుటుంబ మాగ్రామమున కలిగిన గృహములలో నొకటి. అట్టియాత డీస్థితి కెట్లువచ్చెనా యని శంకించుచు నే నాతని మంచముపైని కూర్చొని "అప్పల స్వామీ అయ్యో! ఇదేమిటి? నువ్విక్కడి కొచ్చె వెందుకూ? ఎన్నాళ్లయిందేమిటి? అప్పుడు చిన్నప్పుడే నేను మా నాన్నతో చెన్నపట్నం పోవడంచేత మీసంగతులు తెలియనే లేదు. మొదట పోల్చుకోలేకపోయేను; క్షమించు." అన్నాను.

అప్పు డాత డశ్రువుల రాల్చుచు అతి దీనముగ తన చరిత్రమును చెప్ప నారంభించెను. వైద్యశాలాధికారి యనుమతిపైని నేనప్పటనే యుండి యంతయును వింటిని. బాల్యమున నా ప్రాణస్నేహితుడగు నాతని విషాదచరిత్రమును వినుటచేత నాహృదయము కరిగి పోయినది.

ఆతని జీవితచరిత్రము విశేషము లున్నను, లేకున్నను జాలిగొల్పునదై యున్నది. ప్రపంచమున నొక్కొక కుటుంబము దైవోపహతమై నశించిపోవుట మన మచ్చటచ్చట చూచుచున్నాము. అందుల కొక యుదాహరణముగ నామిత్రుని జీవితచరిత్ర ముండుటచేత, ఆతని నోటను విన్నది విన్నట్లుగ దానిని లిఖించి యాంధ్ర లోకమున కందచేయుచున్నాను. ఈ ప్రకటన మాతని యనుమతిపైని జరిగినదే. ఇందలి గుణాగుణములను గూర్చి విమర్శింపక పాఠకులకే వదిలివేయుచున్నాను.

౧

కొంచెము గంజిత్రాగి సేదదేరి నామిత్రు డిట్లు చెప్పుట కారంభించెను.

"నా జీవితచరిత్ర చాలా విచిత్రమైనది. సర్వశక్తిస్వరూపుడైన సర్వేశ్వరుని నిరాఘాట సంఘటనలకు నా జీవన మొక ఉదాహరణమై పోయింది. ఆ గర్భశ్రీమంతుల కడుపునపుట్టి, నలుగుర్లోనూ "ఔరా" అన్నట్లు తిరిగి తుదకీలాంటి అవస్థల కెట్లా వచ్చేనో నాకే ఆశ్చర్యకరంగా తోస్తుందంటే పైవాళ్ల కెట్లాగుంటుందో ఆలోచించవలసిన విషయమే.

నా యీప్రస్తుతావస్థలు బుద్ధిపూర్వకంగా నేను తెచ్చిపెట్టుకోలేదని యిది చదివేవాళ్లందరికీ తెలుస్తుంది. అయితేమాత్రం ప్రపంచం అంతా ఒక్కలాగే ఉంటుందా? నామీద జాలిపడి నాస్థితిగతులకి కళ్లలో నీళ్లు పెట్టే వాళ్లు కొందరుంటారు. ఆగ్రహపడేవాళ్లు కొంద రుంటారు ఎలాగైనా నా జీవితచరిత్రలో గమనించవలసిన విషయాలు చాలాఉన్నవనిన్నీ, అవినాతో టే నశించి పోవడం మంచిది కాదనిన్నీ తోచి యీ నా అవసాన దశలో నాస్నేహితుడవైన నీద్వారా యిల్లా తెలియ పరుస్తున్నాను.

"మిత్రమా! నేను నెల్లిమర్లలో పుట్టడం, అక్కడ మన యిద్దరం చదువుకోవడం నీకు తెలిసినసంగతే కదా! ఆవూళ్లో కల్లా మాకుటుంబం మిక్కిలి గౌరవం కలదన్న సంగతి నీకు వేరే నేను చెప్పనక్కరలేదు. ఇంతలో నువ్వు మీ నాన్నతోగూడా మూడో క్లాసు చదువుతున్నప్పుడే చెన్నపట్నం వెళ్లేవు. తరవాత జరిగిన సంగతులు చెప్తావిను.

"మా తాత వర్తకవ్యాపారాల్లోనూ, వ్యవసాయంలోనూ చెమట ఊడిచి కొంతడబ్బు సంపాదించి నిలవ చేసేడు. మాతండ్రి మిక్కిలి ధర్మాత్ముడని చుట్టుపక్కల పేదవాళ్లు చెప్పుకుని, అతని కడుపునపుట్టిన మా కీఅవస్థ వచ్చినందుకు నేటికీ కళ్ల నీళ్లు పెడతారు.

"ఇల్లా ఉండగా మాతాత చచ్చిపోయేడు. మా తండ్రి యింటికి పెద్దఅయేడు. మాతండ్రి బహు అమాయకుడు; మెత్తనివాడు. ఒకరికి కష్టం అంటే ఎన్నడూ ఒప్పుకునేవాడు కాడు. చేతనైన సహాయంచేసి పేద సాదల్ని ఒకకంట చూస్తూవుండే వాడు.

"అతనికి బ్రాహ్మణభక్తి హెచ్చుగా వుండేది. బ్రాహ్మడినని అతనివద్దికి వచ్చినవాడు ఎన్నడూ ఊరికేపోలేదు. ఇది కనిపెట్టి అనేకమంది బ్రాహ్మలు "మావాడికి పెళ్లిచేసుకుంటామనీ, యిల్లుకట్టుకుంటామనీ, రామమందిరాలు కట్టిస్తామనీ" చెపుతూ మాతండ్రిదగ్గర ఏదో కొంతధనం పట్టుకుపోయేవారు.

"ధర్మాత్ములకిన్నీ, అమాయకులకిన్నీ కలికాలం పనికిరాదని మన పెద్దలు ఊరికే చెప్పలేదు. మాతండ్రికి వర్తకంలోనూ, వ్యవసాయంలోనూకూడా నష్టం రావడం ప్రారంభించింది. ఒకటి రెండు సంవత్సరాల్లో మా

తాత నిలవచేసినడబ్బు ఖర్చైపోగా అప్పులుచెయ్యవలసి వచ్చింది.

"ఇదిగాక సప్తగుళ్లనిమించిన కరువు వచ్చి దేశం క్షోభించిపోయింది. క్రమక్రమంగా మాకు అప్పులు పెరిగిపోయేయి. అప్పులతోటే వడ్డీలుకూడా పాపం పెరిగినట్లు పెరిగేయి. లాభంలేకపోవడంచేత వర్తకం చాలించవలసివచ్చింది.

"క్రమంగా కుటుంబపరిస్థితులు హీనమై పోయేయి. పూర్వంలాగు ఉన్నస్థితిలో జీవించడం కష్టమైపోయింది. పూర్వపురాబడి లేకపోయినా పూర్వపు ఖర్చులు తగ్గలేదు.

"అప్పులవాళ్లు తమ్మ డబ్బుతెమ్మని అనరాని కఠినపుమాటలుఅంటే మాతండ్రి మెత్తనిమనస్సు యెంత బాధపడేదో ఆలోచించవలసిందే కాని చెప్పతరంకాదు.

"ఇంతలో మా అమ్మ ఒకవిషమజ్వరాన్ని బడి కాలంచేసింది. ప్రతివిషయంలోనూ తనకి ధైర్యం చెపుతూ తన దానధర్మాలకి ప్రోత్సాహమిచ్చే స్నేహితురాలు చచ్చిపోవడం మాతండ్రికి మానరానిదెబ్బ అయిపోయింది. అన్నివిచారాలూ కలిసి యేకమై తుదకి మాతండ్రినే మింగేసేయి. మాకుటుంబం మహోన్నతదశలో నుండి అధోలోకానికి పడిపోయింది.

[అని చెప్పి నాస్నేహితుడు కండ్లయందు ప్రత్యక్షమైన నీళ్లను తుడుచుకొని ఆయాసభరమున మాటలాడలేకపోయెను. రెండుగ్రుక్కలు మంచినీళ్లు త్రాగిన పిమ్మట నాతడు మరల నేదదేరి మరల చెప్ప నారంభించెను]

౨

"మాతండ్రినాడు ప్రారంభమైన హీనదశ నా నాడు పూర్తియైనది. అతను కాలంచేసేసరికి నాకు యిరవై సంవత్సరాలు మాత్రమే. మరి రెండేళ్లకి అప్పుల వాళ్లు అంతాఏకమై, మామీద దావాలుచేసి, తక్కువ ధరలకి మాభూముల నన్నింటినీ వేలంపాడేసుకుని పంచేసుకున్నారు.

"భూములన్నీ పోయినతర్వాత నిలవ దమ్మిడీ లేనపుడు జీవనమెంతకష్టమో చూడు. మా తండ్రితాతల నాటి ఆస్తికల్లా మాలోగిలి మాత్రం మిగిలింది. కొంత చరాస్తినిఅమ్మి యెలాగో కొంతకాలం గడిపేను. పూర్వం మాతో లేనిపోని సంబంధాలు కలుపుకుంటూ తిరిగేవాళ్లంతా యిప్పుడు ముఖాలు చాటుచేసుకోవడం మొదలుపెట్టేరు. మాయిల్లు యేదో దుష్టగ్రహ వీక్షణం లో వుందని అందరూ అనుకునేవారు.

"ఇంక చెయ్యిచెప్పుకోవడం యెందుకూ? మా వూళ్లో వుండడం నాకు కష్టమై పోయింది. ఉద్యోగం చేద్దామా అంటే అందుకు నాకు చదువు చాలదు. కూలిపని కా? ఆమాటఅంటేనే నాప్రాణాలు పైకిపోయేవి. అంత మహోన్నతదశ అనుభవించిన ఊళ్లోనే అట్టి హీనావస్థ అనుభవించడం యెంతకష్టమో నువ్వు ఆలోచించుకో. పువ్వులమ్మినఊళ్లోనే పుల్లలమ్మడానికి నాకు ధైర్యం లేకపోయింది. దేశాంతరానికిపోయి యెలాగో పొట్ట పోసుకోవడానికి నిశ్చయించుకొన్నాను.

"నాకు చిన్నతనంలోనే మా మేనమామ కూతురినియిచ్చి వివాహం చేసేరు. విశేషకట్నాలతో పిల్లనిస్తామని అనేకసంబంధాలు నాకువచ్చినా, మాఅమ్మ పట్టుదలమీద మాతండ్రిమా మేనమామకూతురి నే చేసేడు. "తల్లీ తండ్రీ లేని పిల్లని మనం చేసుకోక పోతే యెలాగా? మాఅన్నయ్య చచ్చిపోయేటప్పుడు పిల్లని మనకి అప్ప జెప్పడం మరచిపోవడమే?" అని మాఅమ్మ కళ్లనీళ్లతో భర్తతో చెప్పడం నాకు బాగా జ్ఞాపకం.

"మా మేనమామ కూతురుపేరు రమణ. తల్లిదండ్రులు చిన్నప్పుడే కాలంచెయ్యడంచేత ఆమె మాయింటనే పెరిగింది. మావివాహం అయిన అయిదేళ్లకి రమణ కాపురానికి వచ్చింది. చిన్నతనంనుంచీ ఒక కంచంలో తిని ఒకచోటనే ఆడుకునేవాళ్ళ మవడంచేత ఆమెను నేను 'రమణా' అనిపిలవడానికి అలవాటుపడ్డాను. పెళ్లి అయినతర్వాత ఆఅలవాటు తప్పించుకోలేక పోయేను.

"రమణ అతిసాధు హృదయురాలైన పిల్ల. ఆమె మాఅమ్మకి కుమార్తెలు లేనిలోటు తీర్చింది. మాఅమ్మకి ఆమె పంచప్రాణాలూను. మా యిద్దరి అనురాగమూ చూసి మాఅమ్మ అధికానందం పొందేది. కన్న ప్రేమ కంటే పెంచినప్రేమ అధికం కదా?

"రమణ కాపురానికివచ్చిన మూడేళ్ళకి మా కొక కుమారుడు గలిగేడు. మనమడు పుట్టేడుకదా అనే సంతోషంచేత భారసాలనాడు మాతండ్రి బీదలకి విరివిగా అన్నప్రదానమున్నూ, బ్రాహ్మలకి గక్షిణలున్నూ ఇచ్చి

ఊళ్లో బంధువులిని అందరినీ పిలిచి విందు చేసేడు. 'అమ్మో! కొడుకుని కన్నావుటే?' అని మా అమ్మ రమకి అయిదుతులాలు బంగారపునాను చేయించి మెడలో పెట్టింది. ఇంక చెప్పేదేముంది? బంధువులూ, ఊళ్లో వాళ్ళూ యిచ్చిన బహుమతులతో మా పిల్లవాడి ఒళ్లు బంగారు మలామా అయిపోయింది. అయితే అన్ని రోజులూ ఒక్కలాగే వుంటాయీ? ఇప్పుడా రోజులు తల్చుకోవడంకంటె వేరే కష్టం నాకు లేదు."

[పొంగి పొర్లుచున్న దుఃఖమును ఆపుకొనలేక అప్పలస్వామి ఆడుదానివలె విచారించెను. యథోచితముగ ననునయింపుమాటలచే నేనాతని నొకింత యోదార్పగలిగితిని. మరికొంతసేపటికాతడు మరల చెప్పసాగెను.]

"ఎరిగినవాళ్లులేని దేశంపోయి అక్కడ నివసించే ఉద్దేశం చెప్పడంతోటే రమ తక్షణం తనసమ్మతం తెలిపింది. ఎన్నడుగాని రమ నామాటకి యెదురు చెప్పి యెరగదు.

"ఏ దేశం పోవుదునా?" అని ఆలోచించుకుంటూ అలవాటుప్రకారం ప్రస్తుతం మావి కాకపోయినా, మా పూర్వపుభూములమీద, తలవంచుకుని ఒకనాటి సాయంత్రం తిరుగుతున్నాను. విశాలంగా కనుచూపుమేర మహాలక్ష్మి ఒలుకుతూవుండే ఆ భూములమీద యెన్నిసార్లు వ్యవసాయం చేయించే వాడిని. ఆసంగతులు తలచుకుంటూ, ఇకముందు ఆభూములని చూడ్డానికైనా నోచుకోలేనుకదా అని ఆగకుండా ఉన్నదుఃఖాన్ని దిగమింగుతూ ఒకచోట కూర్చున్నాను.

"ప్రస్తుతం ఆభూములమీదనుండే పైర్లుచూసేసరికి 'మమ్మల్ని వదలడంతోటే యీభూములకి దరిద్రం వదిలిందికద' అనుకున్నాను. ఇంతలో వెనకనించి తెల్లటిబట్టలు కట్టుకుని తలపాగాతో ఒక పొడుగుపాటి మనిషి నాదగ్గిరకొచ్చేడు. బాగా దగ్గిరకొచ్చేక చూసి కొత్తమనిషిగా తెలుసుకుని, యథాలాభంగా 'ఏవూరయ్యా?' అన్నాను.

'మాది రామతీర్థాలండి.'

"శ్రీరామతీర్థం మావూరిదగ్గిర వూరేగనక, ఆ వూళ్లో నేనెరగనిమనిషి యెవరూ!"అని అనుకుని మళ్లా 'మీది రామతీర్థాలేనా?' అన్నాను.

"ఈప్రశ్న నే నడగడంతోటే అతడుపైమీద తువ్వాలు నేలవేసుకుని తీరుబాటుగా పొలంగట్టుమీద కూర్చొని మాట్లాడ్డం ప్రారంభించేడు. 'అసలు మాపుట్టుక రామతీర్థాలేనండి. చిన్నప్పుడు జరక్క మాతండ్రి దేశం లేచిపోయి పరమట వెళ్లిపోయేడు. రమారమి పాతికేళ్లవుతాయండి నేనూ అక్కడే వుండి పోయేను. ఓమారు మనదేశం చూద్దామని మనసేసి యిలా గొచ్చేనండి' అన్నాడు.

'అయితే మీరున్న దేవూరు?'

'నేనున్నది సింగరేణి అనేవూరు. అబ్బో, అదెక్కడండి. మనరాజ్యంకాదు. మనలోకంకాదు. అంతా తురకలు. హైద్రాబాదు నబాబుగారండి అక్కడ రాజు.'

'అక్కడ మీ రేంచేస్తారు?'

'బొగ్గుగనిలోనండి నాపని. నాకు నెలకి యిరవై రూపాయిలు యిస్తారు. అయితే మంది రామతీర్థాలేనా అండి?'

"కాదు. కాదు మాది నెల్లిమర్ల రామస్వామి నాయుడు కొడుకుని. అప్పలస్వామి నా పేరు!

"ఓహో! అలాగా అండి. మహానుభావుడు నాయుడు ధర్మరాజండి. పాపం ఆయనకి రాదగని కష్టాలు వచ్చేయని విన్నాను. ప్రభువు చచ్చిపోయేడుట గదండి పాపం!'

"అతనితో చాలాసేపు మాట్లాడి "సింగరేణి" బొగ్గుగనుల పరిస్థితులు తెలుసుకున్నాను. అక్కడికిపోతే ఒక రెరగకుండా ఉండవచ్చుకదా అనుకుని, మార్గం వగైరాలు కనుక్కుని సాయంత్రానికి యింటికి చేరుకున్నాను."

3

["అయితే యీ పిచ్చిగొడవతో నీకు నేను విసుగు కలిగిస్తున్నా నేమో క్షమించాలి మరి" అన్నాడు అప్పలస్వామి. ఆతని జీవితచరిత్ర నాకు విసుగెత్తించలేదని నేను ధైర్యము చెప్పినపిమ్మట మరల నాతడు ప్రారంభించెను.]

"సరే విను, చిన్నప్పటి స్నేహితుడవు నిన్ను చూడ్డంతోటే ప్రాణాలు లేచివచ్చేయి. నాకష్టాలిని చెప్పుకుందామంటే యిదివర కెవ్వడూ మనసు కలిసిన

మిత్రుడు దొరకలేదు. ప్రియమిత్రుడివైన నీతో నా దుఃఖాలు చెప్పుకుని హాయిగా యీ ప్రాణాలు వది లేస్తాను."

[అప్పలస్వామి భావోద్రేకమున నైదు నిమిష ములవరకును మాటలాడకుండెను. తరువాత మరల నిట్లూ ర్పుపుచ్చి చెప్పదొడగెను.]

"ఆరాత్రి రమణతో నానిశ్చయాన్ని తెలియచెప్పి మాముందు కార్యక్రమాన్ని గురించి చాలాసేపు మా ట్లాడుకున్నాము. తాను జన్మించిన స్థలాన్నీ, తన స్నేహితురాళ్లనీ వదలిపెట్టి దేశంకానిదేశం పోవడమూ, అందులోనూ పూర్వపుసౌన్నత్యంపోగా భుక్తికైనా లేని స్థితిలో వెళ్లడమూ తలుచుకుని రమణ ఎంతో విచారిం చినది. ఆమెను ఓదార్చడానికి నాకుకూడా ధైర్యం లేకపోయింది. 'ఇంటిదగ్గిర ఎన్నడూ కష్టపడి యెరగని రమణని యెన్నికష్టాలు పెట్టాలోకదా దైవమా' అని నేను మనస్సులోనే కుమిలిపోయేను. ఆరాత్రి మాకు నిద్రలేదు.

"రైలుఖర్చులకైనా చేతిలో దమ్మిడీలేదు. అందు చేత మర్నాడు మాయింటిని బేరంపెట్టి అమ్మివేసి అప్ప టికి మాకావూళ్లోవున్న అప్పులు తీర్చుకోగా మిగిలిన వందరూపాయిలు పట్టుకుని పిల్లవాడినీ రమణనీ తీసు కుని బయలుదేరెను.



"కావిట్లో ఒకకొమ్ముని పిల్లవాడూ, ఒకకొ మ్ముని మూటవుండగా నేను ముందు నడిచేను. ఇల్లుకది లితే మూడువందలరూపాయిల ఖరీదుగల యెడ్లజత కట్టిన బండిమీద వెళ్లేరమణకి నెత్తిమీద బరువైనమూట యెత్తి నావెనక నడిపించి తీసుకెళ్లేను.

"మేము బయలుదేరేసరికి మలికోడి కూసింది. ఇంకా ఊళ్లో యెవ్వరూ లేవనందుకు సంతోషిస్తూ ఊరుదాటిపోయేము. అబ్బా—ఆరోజు తలుచుకుంటే యిప్పటికీ నాగుండెలు కొట్టుకుంటాయి. మైలుదూరం పోయి వెనక్కితిరిగి తండ్రితాతలనాటి గ్రామానికి కడసారి నమస్కారంచేసి గుడ్లనీళ్లు గుక్కుకుంటూ "దైవమా! యింతతెచ్చేవుకదా" అనుకుని వెళ్లిపోయేను.

"అదే నేనావూరు ఆఖరుమారు చూడ్డం. నేను యి క్కడికి వచ్చేక అనేకసార్లు నెల్లిమర్ల వెళ్లాలనే కోరిక ఉండేది కాని సాగిందికాదు. రమణ ఒక్కసారి తన బాల్యస్నేహితురాళ్లని చూడాలని కోరిందికాని ఆమె కోరిక నేను తీర్చలేకపోయేను. ఇంక యీజన్మంలో నెల్లిమర్ల చూడ్డంసున్నా! మిత్రమా! నేను చచ్చిపోతాను. ఇంక ఒకరోజుకూడా నాకు ఆయువులేదు. నాచావు సమీపించినదని నాకు బాగా తెలుసును. నేను చచ్చి పోయినతర్వాత నాయెముకలు తీసుకెళ్లి నెల్లిమర్ల మట్టి మీద పడవేయుభారము నీది. అలాగైతేగాని నా ఆత్మ శాంతించదు. స్నేహితుడికోసం యీపాటి చెయ్యవూ?"

[అప్పలస్వామి దీనదృష్టులతో నావంక చూచెను. అప్రయత్నముగ నాతని నయనముల నశ్రులు చిమ్మెను. జన్మభూమియం దాతనికిగల యభిమానమున కచ్చెరువు పడి, అట్లే చేయుదునని యాతనికి వాగ్దానమొనర్చితిని. ఆయావేగముశాంతించినపిమ్మటఅప్పల స్వామి మరల చెప్పమొదలిడెను.]

"మరిమూడురోజులకి మేము చచ్చి చెడి సింగరేణి చేరుకున్నాము. దారిలో మేమనుభవించిన కష్టాలు నేను చెప్ప దలుచుకోలేదు.

"ఇంక సింగరేణిలో వ్యవహారం చూడండి. ఇల్లులేదు వాకిలిలేదు. చు ట్టాలులేరు. ఎరిగినవాళ్లు లేరు. దిక్కు లేని పక్షులమై, నిలవ నీడలేనివాళ్లమై మేము రైలుస్టేషనులో దిగేము. ఏమి చేయడానికీ తోచక వెర్రివాడిలాగ నిలబడేసరికి ఒక నల్లనిమనిషి యూని ఫారమ్ (Uniform)లో నా దగ్గరకు వచ్చి 'ఏఊరు?' అన్నాడు.

"అడగడమే తడవుగా నేనతనితో మా ప్రస్తుత పరిస్థితులు చెప్పేను. అప్పుడతడు 'పర్వాలేదు లెండి నాదికూడా మీతూర్పే. చిన్నప్పుడే యిక్కడికివచ్చేసేను;

నేను జొన్నగిరిలో పదిహేను మంది కూలీలమీద మేస్త్రీగా వున్నాను. మిమ్మల్ని మధ్యాహ్నం దొరదగ్గిరకితీసుకెళతాను. అంతవరకూ మా యింట్లో వుండండి. లెండి లెండి. పాపం పిల్లవాడు పడుకొట్టిపోయేడు. రండిరండి.' అని అతడు మాయీమాటలలో నొక్క దానిని నేను వద్దంటున్నాగాని వినక పట్టుకుని ముందు నడిచేడు. అహా! దేశంగాని దేశంలో ఇలా దయగలవాళ్లు వుంటారుకదా అనుకుని అతనివెనక మేమును నడిచి యింటికి చేరుకున్నాము.

"మేము పోయేసరికి, అతనిభార్య కాలం గడిపినదవడంచేత భర్త చెప్పినమాటలవల్ల మాసంగతి తెలుసుకుని పిల్లవాడికిన్నీ, రమణకిన్నీ ముందుభోజనం పెట్టింది. తరవాత నేను ఆయింటియజమానితో మాటలాడుతూ భోంచేసేను. ఆమాటల్లోనే నాకు గనులలో యేదైనా పని త్వరలో వేయించమని అతనితో చెప్పుకున్నాను. అతడున్నూ ఆమధ్యాహ్నమే నన్ను దొరదగ్గిరికి తీసుకొని వెళ్లుటకు నిశ్చయించుకున్నాడు.

"రమణ పిల్లవాడితో కూడా నేలమీద పైటచెరగు పరుచుకుని రాత్రి అల్లానిద్ర లేనందున నిద్రపోయింది.

నిద్రావస్థలో ఆ అమాయకురాలిని చూసేసరికి నా దుఃఖ మాగిందికాదు. అబ్బా! ఆదృశ్యం నేటికీనాకళ్ళకి కట్టినట్లుగా వుంటుంది.

"ఆమధ్యాహ్నం మాకు దొరగారిదర్శనం కాలేదు. ఎన్నడూ ఒకరియింట తినడానికి అలవాటుపడి వుండని వాడనవడంచేత నేను మొగమాటపడడంచూసి ఆయింటి యామె 'అమ్మో! నాయనా! అలాగ మొగమాటపడితే యెలాగవుతుంది బాబూ! కొత్తగావచ్చేవు గనక మా యింటి కొచ్చేవుగాని లేకపోతే యెందుకొస్తావు? నీకు పని అయి యిల్లు దొరికేదాకా మాయింట్లోనే వుండు. దేశంగానిదేశంలో మనలో మనం కాకపోతే యెలాగ? మొగమాటపడకు నాయనా!' అని దయతో చెప్పింది. అప్పుడామె తల్లిలాగా, ఆమెభర్త తండ్రిలాగా కనబడ్డారు.

"మర్నాడు మేస్త్రీ నన్ను దొరముందుకి తీసుకెళ్లి నాగురించి చాలాసిఫారసు చెప్పేడు. దొరగారు నన్ను ఎగాదిగా బాగాచూసి రోజుకి అర్ధరూపాయి చొప్పున కూలి ఏర్పరచి ఆమేస్త్రీకిందనే వేసేరు. మే మిద్దరం సలాంచేసి యింటికొచ్చేం.

"మరి మూడురోజులకి కంపెనీవారు నాకొక చిన్న టిక్కెట్ రేకుయిల్లు ఖాళీచేసియిచ్చేరు. అందులోకి మేము వెళ్లేము. పిల్లవాడిని యెత్తుకుని మావెనక మా యింటి యజమానురాలుకూడావచ్చి మా సదుపాయాలన్నీ చూసి మరీవెళ్లింది. వాళ్లింటికి మాయిల్లు దగ్గిరే కనక రోజూ ఆమె మాయింటికొచ్చి రమణకి ధైర్యంగా మాటలుచెపుతూ వుండేది.

౪

"నాలుగైదు నెలలు గడిచేయి. మొదట కష్టంగా తోచినపని నాకు క్రమంగా అలవాటైపోయింది. నెలకి వచ్చే పదిహేనురూపాయిలతోనూ రమణ కష్టంగా కాలంగడపడం నేర్చుకుంది.

"కాని ప్రతిఘడియా, ప్రతిక్షణమూ నాకు మా ప్రస్తుతావస్థలు తల్చుకునేసరికి గుండె "గుభేల్" మంటూ వుండేది. పూర్వపుపరిస్థితులు తల్చుకోవడం నాకు కష్టంగానే వుండేది. కాని యేంచెయ్యగలను? తెల్చుకోక తప్పేది కాదు.

"పనిలో వున్న నాతెలివితేటలవల్లనైతే నేమి మేస్త్రీ సిఫారసువల్లనైతేనేమి, ఒక సంవత్సరంనాటికి నాకుకూడా మేస్త్రీపని దొరికింది. దానితోపాటు ప్రస్తుతమున్న కూలివాడియిల్లు మానేసి మేస్త్రీల కోసం కట్టిన యింకొకపెద్దయింట్లోకి మార్చుకోవలసిందని కంపెనీవారు ఆర్డరు యిచ్చేరు. జీతం నెలకి యిరవై అయిదు రూపాయిలకి హెచ్చించేరు.

"ఇలాగ మూడుసంవత్సరాలు గడిచేయి. ప్రతి రోజూ సాయంత్ర మవడంతోటే గనులలో పనిచేసే కూలీలూ, మేస్త్రీలూకలిసి జట్లుగా బయలుదేరి సారా కొట్టుమీదపడి వొళ్లు తెలియకుండా తాగడం యిక్కడ అలవాటు. ఈరెండు రోజుల్లోనూ యీసంగతి నువ్వ కనిపెట్టేవుంటా వనుకుంటాను!"

[నే నంగీకార సూచకముగ తల నూపితిని.]

"నన్నుకూడా రమ్మని అనేకమార్లు వాళ్లు బల వంతం పెట్టినా నేను వెళ్ళలేదు. నాపని అయినతర్వాత తిన్నగా యింటికిచేరుకుని రమణ కేదైనా సహాయం చెయ్యడమో, లేక ప్రస్తుత విపరీతపరిస్థితులను గురించి తలపోసుకోవడమో నాపనులు. కొన్నిరాత్రులు నాఅవస్థలు తల్చుకుంటూవుంటే నిద్రలేకుండానే గడిచిపోయేవి. ఆరాత్రులు నిజంగా నాకు యమరాత్రులే.

"పైనచెప్పిన నాలుగు సంవత్సరాలూ జరిగిన తర్వాత దైవము మమ్మల్ని యీస్థితిలోకూడా చూడ లేకపోయేడు. నాకుమన్యపుజ్వరం తగిలి వరసగామూడు నెలలు బాధపడ్డాను. ఈమూడు నెల్లలోనూ మాకుటుంబం పడ్డబాధలు లెక్కలేదు. సంపాదించేవాణ్ని నేను పడి పోవడంతోటే ప్రతివిషయంలోనూ లోటు కనిపించింది. పాపం! రమణ యేంచెయ్యగలదు? ఇంతలనాజ్వరం కోసమే విచారిస్తుందా? అవతల యింట్లో లోటుపాట్లే చూసుకుంటుందా?

"నాకు జ్వరప్రకోపంచేత ప్రథమకోపం హెచ్చిపోయింది. మేము నిలవచేసుకున్నడబ్బు అయిపోవడమే కాకుండా అప్పులు పెరిగిపోయేయి ఇంక యెవ్వరూ అరువు యివ్వడం మానేసేరు. మూడు నెల్లకి నాకు జ్వరం తగ్గినా మరిరెండు నెల్లదాకా పనిలోకి వెళ్లడానికి శక్తి నాకు రాలేదు.

"ఈ రెండునెల్లలోనూ కొంతకాలం కూర్చున్న చోటినుంచి కదలలేకపోయేవాడిని. జిహ్వచచ్చి అనేక వస్తువులు తినాలని బుద్ధిపుట్టేది. అవి తెమ్మని నేను రమణని బాధపెట్టేవాడిని. ఇంట్లో తిండికే అరువు పుట్టినప్పుడు నేను కోరేవల్లా ఆమె యెలాగ తెచ్చి యిస్తుం దనే జ్ఞానం నాకు కొంచెమూ అప్పుడు లేకపోయింది.

"ఒకప్పుడు ఆమె యేదో వస్తువు నాకియ్యలేదని నాపక్కనున్న కర్రతో ఆమెను పశువుని బాదినట్లు బాదిన దుర్మార్గుడిని నేను. తర్వాత విచారిస్తే లాభమే ముంది? వెన్నలాంటి శరీరంమీద దెబ్బలుపడి రమణ మనస్సులో యేడుస్తూ యింట్లోకి పోవడం యిప్పటికీ నాకళ్లకి కట్టినట్లుగా ఉండి దుఃఖింప చేస్తుంది."

[అని చెప్పుసరికి నామిత్రుని శరీరము దుఃఖావేశమున గడగడ వణకసాగెను. నోట మాటరాలేదు. అప్పుడు నేను సాహస్తములతో నాతనిని బట్టుకొని "అప్పల స్వామీ! నువ్వు అలాగవిచారిస్తేయెలాగ? ధైర్యంతెచ్చుకోకపోతే ఈఅవస్థలో ప్రమాదంసుమా!" అని యాతని నోటిలో నిన్ని మంచినీళ్లుపోసితిని. భార్యావిషయమున తనక్రూరత్వమునకు నామిత్రుడు పడు పశ్చాత్తాపము నాహృదయమును కలచివైచినది. సేదదేరి ఆతడు మరల చెప్పసాగెను.]

"మిత్రమా! యెంతచెప్పుకున్నా యీ నాదుఃఖాలు తరగవు. నాజీవితకాలంలోకల్లా గొప్పమార్పు కలిగిన వీరోజులే. ఇంట్లో తిండిగడవడం కష్టమైపోయింది. ఒక్కొక్కప్పుడు రమణుపస్తుండి పిల్లాడికి అన్నంపెట్టేది. కొనకి అలాగా గడవలేదు.

"అప్పుడేమి జరిగినది? అయ్యో! ఆమాటలు నా పాడునోటితో చెప్పగలనా? అబ్బా! చెప్పక తప్పదు. ఏరమణ—మా అమ్మ అరచేతుల్లో—అల్లారుముద్దుగా పెరిగిందో—ఏరమణ ఒక్కనాడైనా ఆవుపాలు పాలెం నుంచి పరదాకైనా యింటికి తేవడానికి మాఅమ్మ ఒప్పుకునేదికాదో—ఆరమణ—చివరకి ఒక—కూలిదై—గనిలో పనిచెయ్యక తప్పిందికాదు. అయ్యో దైవమా!

[ఆవేశవశమున నామిత్రునికంఠము డగ్గుత్తిక పడియెను. ఆతనిముఖ మెర్రబడిపోయెను. ఆ గాసము హెచ్చయ్యెను. అట్టినవనంతమైన యింటబుట్టి తుదకొక కూలివాడై ప్రస్తుత దీనావస్థయందున్న నా మిత్రునిస్థితి గాంచినపుడు నాకనులం దశ్రులు చిమ్మినవి. కొరికొంత సేపటి కాతడు సేదదేరెను.]

"అబ్బ!—కోడికుయ్యకముందు లేచి, యింట్లో పనులుచేసుకుని, వంటచేసి, నాప్రథమకోపానికిఓర్చి, నాకు యిష్టమయేలాగు పాట్లుపడి పథ్యంపెట్టి, గనులలోకి పోయి సాయంత్రందాకా పనిచేసి యింటికివచ్చి, మళ్లా వండి మాకుపెట్టి తానుతిని కటికనేలమీద రమణ పడుకునేది.

"ఆమె సంపాదించినసొమ్ము తింటూ, లేనిపోని లోట్లు యెంచుతూ నీరసపుకోపాన్ని యెన్నిసార్లు రమణని దుర్మార్గుడనై కొట్టేనో నాపాపం నన్ను కుట్టికుడుపుతూంది.

"అయ్యో!రమణా! నువ్వు!ఓర్పుకి భూదేవిలాంటిదానివి. నాఅపరాధాలు క్షమించి (క్షమకోర్చి) నన్ను బ్రతికించి, నిన్ను దుఃఖపెట్టినందుకు నాకింతే కావాలి అని నన్ను విడిచిపెట్టి పోయేవుకదూ? ఈక్షణంలో

ఈ దుర్మార్గుడికంటికి నీవు కనపడ్డట్టయితే నీపాదాలు తీసుకుని నెత్తిమీద పెట్టుకోడా? అయ్యో! అంత భాగ్యం కూడానా? అబ్బ-అబ్బ-ఆయాసం-అబ్బ"-

[అప్పలస్వామి అక్కడ నేనున్నమాట మరచిపోయి ప్రాణేశ్వరి యగు రమణనిగురించి వాపోవసాగెను. అది యాసుపత్రియనియు, తాను జ్వరపీడితు డనియు మరచిపోయి ఆవేశపూరితుడై యాతడు ప్రాణేశ్వరి సాన్నిధ్యము గల్పించుకొని వెర్రివాని వలె మాటలాడసాగెను. ఆతడు మంచముపైనుండి లేవబోయి పడిపోయెను. నేను తక్షణ మాతనిని నాహృదయమున కానించుకొంటిని. నాయశ్రువు లాదీనునివక్షమును తడిపివైచిన వని వేరుగ చెప్పవలయునా?]

౫

"ఇంకా యెంతకని చెప్పుతోను? నేనుచేసినవన్నీ పాపాలే. ఉదయాన్నే పథ్యంపుచ్చుకుని నేను వీధి అరుగుమీద ఒక్కడినే కూర్చొనేవాణ్ణి. ఒక్కడినే కూర్చోవడంచేత యేమీ తోచేదికాదు. నీరసం—యింట్లో పేదరికం—రమణ కూలిచెయ్యడం—అన్నీ ఒక్కమారుగా నాతలలో ప్రవేశించి గిర్రున తిప్పేసేవి. ఒక్కొక్కప్పుడు పొడుచుకుని చచ్చిపోదామా' అనిపించేది. నేను చచ్చిపోతే రమణకష్టాలు గట్టెక్కుతాయేమోఅనుకునేవాడిని. ఆఖరుకిరమణకష్టించికూలిచెయ్యగా యీపాపిష్ఠి కళ్లతో చూడవలసివచ్చిందికదా అనుకునే వాడిని. ఒక్కడినే కూర్చుంటే యివే ఆలోచనలు బాధించేవి.

"మా యింటికి పదిగజాల దూరంలో వీరయ్య అనే కూలివాడు ఉండేవాడు. వాడుకూడా జ్వరంచేత బాధపడ్డవాడే. వాడు నాదగ్గిరకివచ్చి కూర్చొనేవాడు. ఒకరితో ఒకళ్లంమాటలు చెప్పుకుంటూ ఉండే వాళ్లం. వాడు వెళ్లిపోవడంతోటే నా మామూలు విచారం నాకు తప్పేదికాదు.

"ఇంతలో నాకు కాస్త నడవగల దారుఢ్యం వచ్చింది. నేనూ వీరయ్య కలిసి సాయంత్రంవేళ ఒక ఫర్లాంగుదూరం వ్యాయామంకోసం నడిచేవాళ్లం. క్రమంగా నాకు శక్తివచ్చినకొద్దీ దూరం హెచ్చించేవాళ్లం. ఒకనాడు వీరయ్య నన్ను ఊరు చివరకి తీసుకుపోయి అప్పలస్వామీ! ఏమిటో యెప్పుడూ విచారిస్తూ కూర్చుంటావు. నీవిచారం తగ్గించే మందు ఉంది సేవింపకూడదూ?' అన్నాడు.

"'వీరయ్యా! నావిచారం నాతనువుతోటే కాని మానదు. ఈవిచారానికి మందూ మాకూ పనిచెయ్యవు."

"'ఆ—ఆ—అలాగెప్పుడూ అనకేం? ఈవేళ నాతోటిరా-దాని మజాచూపిస్తాను. అది సేవిస్తే నువ్వింతకాలం యింట్లో కూర్చోవాలా? యీపాటికే పనిలోకి పోయి ఉండేవాడివి!

"'అదేం మందు?'

"'ఏం మందూ? ఒక్కడ్రాం వేస్తే యివన్నీ పరారీ—'

"'ఏమో—నాకెన్నడూ అలవాటులేదు. ఈ అయిశ్వర్యానికి తోడు అది కూడానా?'

"'ఏమిటి? అయిశ్వర్యం యేమిటి ఒక్కరోజు వ్యాపారానికీ. కాకపోతే నేను యిప్పిస్తానురా యీవాళ చూద్దువు గాని.'

"ఇంక నీవు నమ్ముతావో నమ్మవో కాని అది కడుపులోపడ్డ ఒక గంటకి నాకెక్కడలేని ఉత్సాహం కలిగింది. ఆక్షణములో గనిలోనికిపోయి పని చేద్దామా, అన్నంతశక్తి కలిగింది. ఆరాత్రి రమణని నేను భోజనం దగ్గిర దుఃఖపెట్టలేదు. అప్పటి కైదవమాసం గర్భవతియైన రమణ, నాకుకలిగిన అన్నహితవుచూచి ఎంతో సంతోషించింది. నాకుజ్వరంవచ్చిన నాలుగునెలలకీ ఆమె సంతోషంతో అన్నం తిన్నరోజు అది ఒక్కటే.

"ఆమర్నాడుకూడా వీరయ్య నాకు బలవంతం చేసి మళ్లా ఒకడ్రాం పోయించేడు. అలాగే నాలుగైదు రోజులు వీరయ్య సొమ్ముతో తాగేను. అదేమి కారణమో కాని రోజుకిరోజూ అపరిమితమైన శక్తివచ్చి పదిహేను రోజులలో నాపనికి నేను పోయేను.

"తర్వాత ఒకనాడు వీరయ్య నన్ను సారా దుకాణానికి తీసుకుపోయి "ఏమయ్యోయ్! మేస్త్రీగారిని చూశావా? కాతా పెట్టాలిసుమా!," అని దుకాణదారుడికి నన్ను అప్పజెప్పేడు. ఒక్కనాడు తాగడం మానేశానంటే ఆవేళ నిద్రలేదు. ఉత్సాహం లేదు. శాంతం లేదు. మర్నాడు గనిలో పనిసున్నా.

"నేను పనిలో ప్రవేశించినతర్వాత వారానికో మాటు జీతం అందుకుని కొంతసొమ్ము సారాకి యిచ్చేసి మిగిలినది రమణచేతి కిచ్చేవాణ్ని. అంతజీతం అయితే యింటికి తెచ్చే దింత తక్కువేమని ఆమె నన్నెన్నడూ అడగలేదు, జిహ్వ చచ్చి ఉండడంచేత రోజూ యేదో కొనుక్కు తింటున్నానని ఆమె అభిప్రాయం కాబోలు? ఇదివరలో అయిన అప్పులు తీరాలని ఆమె నూనకుండా

నాతోటిపాటు గనిలో పనిచేస్తూనే ఉండేది. 'ఇంకా నువ్వు పనిచెయ్యడ మెందుకు?' అని నేనంటే నవ్వుతూ 'ఇంకొక్క రెండు నెల్లుచేసి అప్పుడు మానేస్తాను' అనేది.



"ఏమయ్యోయ్! మేస్త్రీగారిని చూశావా? కాంతా పెట్టాలిసుమా!"

"పాతబాకీలు అన్నీ తీరి వల్లా సంసారం తేలింది. నేనూ రమణాకూడా పనిచేసి సంపాదించడంవల్ల నేను పైనచేస్తూ వున్నఖర్చు అంతగా యిబ్బంది కలగచెయ్య లేదు. క్రమంగా నాకు తాగుడు మామూలుకంటే అధికమై పోయింది. మునుపు తాగినందువల్ల నాకు శరీర విస్మృత స్మారకం తప్పడం వగైరాలు లేవు. నేను తాగుతూ ఉన్నసంగతి రమణతో చెప్పడానికి భయపడేవాణ్ని.

"మునుపటిలాగ కాకుండా ఇప్పుడు నాకుస్నేహితులు హెచ్చిపోయినారు. సాయంత్రపువేళ వాళ్లూ నేనూ కలిసి సారా దుకాణానికి పోయేవాళ్లం. వాళ్లు మత్తెక్కేటట్లు తాగుతూ ఉంటే నేను ఊరుకో లేకపోయేను.

"ఒకనాడు స్మారకంతప్పి ఊరవతల పడిపోయేను. మామూలు వేళకి నేను యింటికి వెళ్లలేదు. సరిగా ఒంటిగంట రాత్రికి నాకు తెలివివచ్చి చూసుకున్నాను. ఒక్క స్నేహితుడైనా దగ్గరలేదు. నేను ఒక్కడిని రోడ్డు ఒడ్డున చీకట్లో పడివున్నాను.(కొంతసేపటికి మెల్లిగా తూలుతూ లేచి యింటికి పోయేను

"పిల్లవాడు నిద్రపోతున్నాడు. రమణ దీపం వెలిగించుకుని దీనురాలై అక్కడ కూర్చున్నాది. నేను వెళ్లడంతోటే చిన్ను అంటుకున్న బట్టలూ, యొఱ్ఱబారిన కళ్లూ, వేషమూ చూసి ఆమె నాసంగతంతా కనిపెట్టేసింది. ఆమె దీనురాలై నా వంకచూసింది. ఆచూపుల ముందు నేను అణిగిపోయేను. అంతవరకూ భోంచెయ్యకుండా ఉన్న రమణా నేనూ అప్పుడు భోంచేసి నిద్రపోయేము.

౬

"రమణ యిప్పుడు యెనిమిదో మాసం గర్భవతి. ఆమె యింక గనిలోకిపోయి పని చెయ్యలేకపోయింది. పని చెయ్యలేక ఆమెయే మానివేసింది గాని, నా తాగుడు సాగదుకదా అని దురాత్రగ్రుడనై నే నామెను మానమని చెప్పలేదు. మిత్రమా! ఈవిషయంలో నే నెంతమాత్రమూ క్షమార్హుడిని కానుసుమా!

[నా స్నేహితుని యుద్వేగ్రస్వనమున దుఃఖోద్రేకము గోచరించుచుండెను.]

"రమణ పనిమానేయడంతోటే రాబడి తగ్గిపోయింది. ఇవతల నా తాగుడు హెచ్చిపోయింది. ఆమె నాకప్పుడప్పుడు తాగుడు మానమని బోధపరుస్తూ ఉండేది. ఆమెముందర యెగురు మాట్లాడలేక సరే అని ఒప్పుకునేవాడిని కాని బానిసనైపోయినతర్వాత మానడ మేలాగ?

"వారం అవడంతోటే సారాకొట్టుకి మునుపటికంటె డబ్బు హెచ్చు యివ్వవలసి వచ్చేది. రోజూ ఒళ్లు తెలియక యేరోడ్డుమీదో పడిపోయి, యే అర్ధరాత్రికో యింటికి చేరుకునే వాణ్ని. అంతవరకూ రమణ నాకోసం అలాగే కూర్చునేది. పాపం! ఆమె కష్టం నాకేమి తెలుస్తుంది?

"ఇంటికి జీతంతెచ్చి ఒకవారం యిచ్చేను. రమణ యింటికి కావలసిన డబ్బు ఉంచి మిగిలినది నాఖర్చుకు కొంత యిచ్చింది. ఈమో స్థిరుగా నాఅలవాటు క్రమంగా తగ్గించాలని ఆమె అభిప్రాయం కాబోలు! కాని ఆసొమ్ము నాకెక్కడ! రెండు రోజుల్లో సొమ్ము అయిపోయింది. సారావాడు యింక అరువు యివ్వలేదు.

"ఇంటికివచ్చి రమణని బతిమాలుకున్నాను. రేపటి నుంచీ ఖచ్చితిగా మానేస్తా నన్నాను. కొసకి దయదలచి ఆమె ఆనాటికి కొంత సొమ్మిచ్చింది. మర్నాడుకూడా యిదే రీతిగా జరిగింది.

"మూడో నాడు వరీ రమదగ్గిర సొమ్ము లేకపోయినది. నేను ఏమైనా యిమ్మని బతిమాలుకున్నాను. పాపం! దగ్గిర సొమ్ములేందే యేమి యిస్తుంది? నా అవస్థ చూసి పొరుగింటివాళ్లని ఆమె బదులు అడుగుతే యెవ్వరూ యివ్వలేదు.

"ఆరాత్రి జరిగిన సంగతి తలుచుకుంటే యిప్పటికీ నావొళ్లు గగుర్పొడుస్తుంది. ఇంట్లో సొమ్ముండే రమణ అబద్ధమాడుతూందనుకున్నాను. కల్లెర్రచేసి సొమ్మిస్తావా, యివ్వవా? అని అడిగేను.

"నేను సరియైనస్థితిలో ఉన్నప్పుడు ఎన్నడూ రమణ నానోటినుండి అలాంటి మాటలు వినలేదు. అందుచేత ఆమె సుడిగాలి దెబ్బకి తీగెలాగ గడగడలాడిపోయింది. ఆమె నిస్తబ్ధురాలై మాట్లాడలేకపోయింది. ఆకోప తీవ్రాన్ని నాకు ముందువెనకలు తెలియలేదు. తత్క్షణం లేచి—చేతులో ఉన్న పేప బెత్తంతో—ఆమెను—నారమణని—అయ్యో—అయ్యో చెప్పలేను—చెప్పలేను"

[అనుచు అప్పలస్వామి దుఃఖాయాసములు ముప్పిరిగొన ఒక్కపట్టున మంచము మీదనుండి లేచి అశక్తత చేత మూర్ఛపోయెను. నేనిట్లు జరుగునని తెలియక అతని చరిత్రవినుటలో మునిగియున్నందున, ఆపాటును అడ్డగింపలేక పోయితిని.

పూర్ణపశ్చాత్తప్తుడగు నాతని యవస్థనుచూచి నాగుండెలు బ్రద్దలైనవి. తత్క్షణ మచ్చటి వైద్యశాలా పరిచారకులతో గూడ నే నాతనిని మంచముపైని బరుండపెట్టి చేతనైన యుపచారము లొనర్చితిని. దుఃఖభరమధికమై పోయినందున నాతని దేహము గడగడ వడకుచుండెను. ముక్కుపుటము లదరుచుండెను. అరగంటవర కాతనికి మాట్లాడు శక్తి కలుగలేదు.]

"రమణ నేలని పడిపోయింది. ఆమెనిండు మాలాలు ఒంటిమీద స్మారకంలేదు. అప్పుడామె మెడలో మా అమ్మపెట్టిననాను నాకళ్లబడ్డాది. ఆమె వస్తువులకల్లా మిగిలినదది ఒక్కటే వెంటనే అది తెంపేసిపట్టుకుపోయేను.

"ఆరాత్రి ఆనానుతో నేనేంచేసేనో నాకే తెలియదు. సారాదుకాణం వరకు వెళ్లి అక్కడ తాగుట మాత్రంనే నెరుగుదును నాకు ఒంటిమీద తెలివివచ్చి చూసుకునే సరికి ఆసుపత్రిలో మంచంమీద పడివున్నాను.

"రమణనా పక్కని ఏడుస్తూకూర్చుంది. [ఇక్కడ అప్పలస్వామి ఒక్కనిముషము మాటాడక కండ్లనీళ్లు తుడుచుకొని మళ్లా ప్రారంభించేడు.] శరీరం నిండా గాయాలుపడి రక్తాలు కారుతున్నాయి. డాక్టరు నాగాయాలకి కట్లుకడుతూ, నేను బాధపడుతూవుంటే 'తప్పతాగేటప్పుడు బాధలేదురా?' అని యెత్తిపొడుపుమాటలాడేవాడు. నాగాయాల బాధకంటె ఆమాటలే నన్ను హెచ్చుగా బాధించేయని మీకు వేరే చెప్పాలా?

"ఆమాటలు నాకంటె రమణనే యెక్కువగా బాధించేయని నాఅభిప్రాయం. డాక్టరు అలాంటి మాటలాడేటప్పుడూ, నేను బాధకోర్వలేక 'అమ్మో', అన్నప్పుడూ ఆమెముఖం చాటుచేసుకుని పైటకొంగుతో కళ్లనీళ్లు ఒత్తుకుంటూ ఉండేది. నాకు మాట్లాడ్డానికి శక్తిలేకపోయింది.

"మూడురోజులు క్రిందట నేను రమణయెడల చేసిననేరం అప్పుడు జ్ఞప్తికొచ్చింది. డాక్టరు వెళ్లేడు. రమణ నాముఖంవేపు దీనంగా చూస్తూంది. నేను దాహానికని సంజ్ఞ చేసేను. ఆమెయిన్ని నీళ్లునా నోట్లోపోసింది. ఆమెను నా ప్రక్కలో కూర్చోమన్నాను. ఆమెమెడమీద పేపబెత్తపు తట్లు ఇంకా స్పష్టంగా ఉన్నాయి.

"ఆమె చెయ్యి నా రెండుచేతులతోటే పట్టుకుని నాగుండెలు మీద వేసుకున్నాను ప్రయత్నంతో రమణా!" అని పిలిచేను కన్నీళ్లలోనుండి ఆమె నన్ను చూసింది. 'క్షమించవూ' అన్నాను. ఆమెముఖం పక్కకి తిప్పి ఎడతెగకుండా వస్తూన్న కన్నీటిని ఒత్తుకుంది.

"ఇంక వెయ్యి చెప్పడం యెందుకూ? నెలరోజులు నే నాసుపత్రిలో వున్నాను. పండుకున్నప్పుడు తప్ప ప్రతి ఘుడియా రమణ నా ఉపచారాల్లో ఉండేది. ఆమె అమృతహస్త ప్రభావంవల్లనే నాగాయాలు మాని నేను బతికేనుగాని మందులవల్ల కాదని నేను స్పష్టంగా చెప్పగలను.

"మిత్రమా! ఇక్కడ ఒక విచారకరమైనసంగతి చెప్పవలసి వస్తూంది. అల్లాటి సంగతులు చెప్పడానికి నన్ను ఏళ్లో మొరడులాగ భగవంతుడు బతికించేడు. నేను ఆసుపత్రిలో ఉండడం, రమణ పని చెయ్యలేనిస్థితిలో ఉండడం నీకు చెప్పేను కదా! ఈ రోజుల్లో మాకు జీవనం యెలాగ గడిచిందనుకున్నావు. అప్పుడే మాపుత్రవాడు పన్నెండేళ్లవాడు గనిలో పనిచేసి మమ్మల్ని పోషించి తల్లిదండ్రుల ఋణం తీర్చుకున్నాడు.

"నెలరోజులూ అయిన తర్వాత నేను యింటికి వెళ్లవచ్చునని డాక్టరు చెప్పినాడు. నేను యింటికి పోయిన నాలుగురోజులలో వయస్సుకి తగినిపనిచేతను, పనికి తగిన తిండి లేకపోవుటచేతనూ, మాపిల్లవాడికి జ్వరంతగిలింది. పదిరోజుల దాకా బాధపడి, వాడు యిహలోకాన మాఋణం తీర్చేసి పరలోకానికి పోయేడు. ఇలాగ్గా నాతాగుడు భూతానికి నాకడుపున బుట్టిన బిడ్డని కూడా అర్పించేసి మొండి వాణ్ణై బతికి ఉన్నాను.

[గర్భశోకము అప్పలస్వామికి దుర్భరమైపోయెను. ఆతడు నాతో మాటలు మాని స్త్రీవలె వాపోవసాగెను. అప్పుడా విషాదహృదయుండగు జనకుని నోదార్చుటకు నాకు సాహసము లేకపోయినది మరి అయిదు నిమిషములకు కొంతశోక ముపశాంతి చేసుకొని యాతడు చెప్పుట మరల మొదలుపెట్టెను. విచిత్ర దైవసంఘటనల కాశ్చర్యపడుచు, నా మిత్రుని దుఃఖభాజన మగు చరిత్రమును వినుచుంటిని.]

"పుత్రశోకంచేత రమణ మరి యెత్తిగ లేదు. నేనెన్నివిధాల ధైర్యంచెప్పినా ఆమె వినలేదు. ఆమె యిహలోక సౌఖ్యాలే మానేసింది. నేను పూర్వపు దుర్గుణాలు మానేసే నన్న సంతోషం ఆమెకి లేకపోయింది.

"ఆనెలలో మరి పదిరోజులకి రమణకు ప్రసవవేదన లారంభమైనవి. మూడు దినాలవరకూ రమణకి నిద్రాహారాలు లేవు. అపరిమితమైన ప్రసవవేదనలామె ఆరోజుల్లో అనుభవించింది. మొదటిమన్యాగాని ఆవూళ్లో ఆదరించిన మేస్త్రీ చనిపోవడంతోటే ఆతనిభార్య పుట్టింటికి పోయింది. అందుచేత ఒకరి సహాయంకూడా మాకప్పుడు లేదు.

"మూడో నాటిరాత్రి రెండు జాములైంది. పట్టణం అంతామాటు మణిగిపోయింది. దూరాన్ని ఎక్కడో కుక్కల అరుపులు తప్ప ఆ నిశ్శబ్దాని కింకే అంతరాయం లేదు. కన్ను పొడుచుకుంటే కానరాకుండా చీకట్లు నిండిపోయేయి. రమణ యింట్లో గదిలో బాధపడుతూంది. నేను దైవప్రార్థన చేసుకుంటూ గది యివతల కూర్చున్నాను. మినుకు మినుకుమంటూ ఒక దీపము నా కునుకుపాట్లకి తోడైనది.

"అరగంట సేపల్లా జరిగింది. నేనక్కడ గోడకి చేరబడి మూడురోజులనుంచీ నిద్రలేనందుచేత నిద్రపోయేను. ఇంతలోనే "అమ్మో" అనే ఆర్తనాదం ఆ గంభీర నిశ్శబ్దాన్ని చీల్చుకుని వచ్చింది.

"నేను ఉలికిపడి లేచేను. ఇంక ఆలోచిస్తే లాభమేముంది? నేను ధైర్య మాపుకోలేకపోయేను. వెనకా ముందూ చూడకుండా గదిలోకి పరుగెత్తేను.



"నారమణ నేలని పడిపోయివుంది. ప్రాణాలు లేని శిశువొకటి ఆపక్కనే పడివుంది. "రమణా" అని పిల్చేను. చలనంలేదు. గుండెలు జారిపోయి మళ్లా "రమణా" అన్నాను. కళ్లు మెల్లిగా విడ్డాయి ఆమె మాట్లాడ్డానికి ప్రయత్నించింది. శక్యం కాలేదు. మళ్లా కళ్లు మూతలు పడిపోయేయి.

"'రమణా!' అని మళ్లా పిల్చేను. చలనంలేదు. జవాబులేదు. ఇంక ఆగలేక ఆమెను ముట్టుకున్నాను. శరీరం చలవబారిపోయి మంచుగడ్డలాగుంది. 'రమణా! పలకవూ?' జవాబు లేదు. కదిపి ఒత్తిగిల్లించేను. శరీరం కొయ్యబారిపోయింది. ఇంకేముంది? నారమణ నన్ను ఒదిలిపెట్టేసింది దుఃఖపూరితమైన యిహలోకమీద. ఆమె కళ్లు శాశ్వతంగా మూతలు పడిపోయేయి. నాతల తిరిగిపోయింది. కళ్లు చీకట్లు కమ్మేయి."

[క్రమంగా అప్పలస్వామికి ఆవేశం హెచ్చిపోవుచుండెను. అతనిని నేను జాగ్రత్తగా పట్టుకున్నాను. కాని నాకు దుఃఖ మాగలేదు. మహాసతిసీత, సావిత్రి, అరుంధతులను బోలు నా పతివ్రత మరణము వినుటతోడనే నేను నిలువున నీరైపోయితిని. అప్పలస్వామి

మాట చెప్పవలెనా? ఆతడు దుఃఖోద్రేకమున సొమ్మసిలి తెప్పిరిలి మగల ప్రారంభించెను]

౭

"మరిరెండురోజులకి నాకు ఆసుపత్రిలో తెలివి వచ్చింది. మిత్రమా! ఇంకా చెప్పుకోవడం యెందుకూ? బ్రతుకు వెలితై పోయింది. మునపటిలాగ నాకు మంచి నీళ్లు యివ్వడానికి రమణ నాప్రక్కని లేదు. దాహంతో దీనుడినై అరిచేను. నా అరుపులు యెవరికైనా వినబడ్డాయో లేదో నేను చెప్పలేను.

"రమణా! ఎక్కడున్నావు? నీవంటి విలువగల వస్తువుని వాడుకోవడ మెరగని నావంటివాడికి నీవు దక్కుతావా? నీశరీరం, నీప్రాణాలు సమస్తం నాతాగుడుభూతానికి అప్పజెప్పేశావా? అయ్యో! "పదేళ్లపిల్లవాడినే నీతాగుడు మహాగ్నిలో దగ్ధంచేస్తేనే నేపాటి?" అంటున్నావా?"

"మహాపరాధిని; క్షమించు. నీపాదాలుపట్టడానికైనా నేను అర్హుణ్ణికాను. నిన్నుకొట్టినదెబ్బలు—యిప్పుడు—పదిరెట్లు—తీవ్రంగా—నాకు తగులుతున్నాయి. అబ్బా—దాహం—దాహం—దాహం."

[చప్పున నేనులేచి ఆతనినోట నిన్ని నీళ్లుపోసితిని. వెర్రివానివలె నాతడు నావంక కొంతసేపు మాచి యిట్లనెను.]

"విన్నావా నాకథ అంతానూ? బాల్యస్నేహితుడవైన నిన్నుచూచి నాప్రాణాలు లేచొచ్చాయి. నీతో నాకష్టసుఖాలు మాట్లాడ్డంవల్ల నాగుండెల్లో బరువు తీరింది. నేనింక ఈవూళ్లో వుండలేను. నెల్లిమర్ల నన్ను తీసుకుపోతే సుఖంగా చచ్చిపోతాను."

[మరినాలుగురోజులలో నేనున్నూ, అప్పలస్వామిన్నీ నెల్లిమర్లకు బయలుదేరేము. నే నతని నక్కడ విడిచిపెట్టినపిమ్మట నాలుగైదునెల్లకు, అర్థరాత్రివేళ అతడెవ్వరితో చెప్పకుండా పారిపోయినట్లున్నూ, మరిమూడురోజుల కాతనిశవము ఏటిలో ఒకనూతిగులో గొరికినట్లున్నూ నాకు వర్తమానమువచ్చినది.

ఇంకొకపర్యాయము నేను సింగరేశివెళ్లినప్పుడు ఒకవిశేషం చూచితిని. అక్కడ తూర్పుకూలీలందరూ కలసి రమణ మహాపతివ్రతయని గ్రహించిరి. వారు చందావేసుకుని రమణపేరిట నొకమంటపము గట్టిరి. "పేరంటాలగుడి" అని దాని నిప్పటికిని వాడుచుందురు. ప్రతిమంగళవారమునూ ఊరిలో కొందరిప్పటికినీ పసపుకుంకుమలు రమణ కర్పించి భక్తితో నమస్కారము లొనర్చుచుందురు.]

సంపూర్ణము

పేదఱిమి

భుక్తి లభియింప కెన్నియో ప్రొద్దులు సనె
నిద్రగాంచక యెన్నియో నిశలు గడచె
హాయి మదిఁ జోటు గానక మాయమయ్యె
కటకటా, యింక నేటి కీకటికి బ్రదుకు.

—నిఱుపేద.

వరూథినీ-ప్రవరాఖ్యులు

"ప్రాంచద్భూషణ బాహుమూలరుచితోఁ బాలిండ్లు పొంగారఁ బై
యంచల్ మోవఁగఁ గౌఁగిలించి యధరం బాసింప 'హా, శ్రీహరీ!'
యంచుం బ్రాహ్మణుఁ డోర మోమిడి తదీయాంసద్వయం బంటి
పొమ్మంచుం ద్రోచెఁ.. ...."

మనుచరిత్ర.

చిత్రకారుఁడు: శ్రీ. కే. వి. సోమయాజులుగారు, రాజమండ్రి.

వేంగీచాళుక్యులు

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు

గుణగాంకుడైన మూడవ విజయాదిత్యునికి సంతానము లేనికారణమున గావచ్చును అతడు తనయనుజుడైన విక్రమాదిత్య భూపతిని యౌవరాజ్యమునకు పట్టము గట్టెను. ఈతనికే విక్రమాంకుడనియు పేరు కలదు. ఈతడు విక్రమాక్రాంత సకల ధరాచక్రుడనియు[1], కంఠికాదామకంఠుడనియు [2]చాళుక్యశాసనములు నుడువుచున్నవి. ఇదివఱలో తెలిపినట్లు ఈతడు తన యగ్రజన్ముడైన గుణగ విజయాదిత్యునికి గంగ-రట్టయుద్ధములలో దోడ్పడి సచ్చమూపతి[3]యని పేరుగాంచెను; కాని తుద కీతడా మహాసంగ్రామములలోనె వీరశయనము నొందుటచేత గావచ్చును వేంగీచాళుక్య సింహాసనము నధిష్ఠించు భాగ్య మీతనికి గలుగలేదు. ఈతనికి వేంగాంబికయనుభార్య కలదు[4]. యువరాజుగ నుండగనే కాలధర్మము నొందుటవలన నీతడు చాళుక్యశాసనములలో యువరాజ విక్రమాదిత్య భూపతియనియే పేర్కొనంబడియున్నాడు. ఈతనికిని వేంగాంబికకు నుదయించినవాడు చాళుక్య భీమభూపాలు డనుపేరుగల విష్ణువర్ధనుడు. ఇతనికి విష్ణురాజనియు నామాంతరము కలదు.

మూడవ విజయాదిత్యుని యనంతరము ఆతని సోదరుడైన విక్రమాదిత్య భూపాలుడు యువరాజుగనే కాలధర్మము నొందుటచేత ఆతనిపిదప నతని కుమారులలో నగ్రజుడైన[5]

1. ఆం. సా. ప. ప. సం ౧౧, సంచిక ౬. చాళుక్యభీముని అత్తిలితామ్రశాసనము.

2. చాళుక్యమొదటిశక్తివర్మపెన్నేఱు శాసనము. ఈశాసనపు రేకులెచ్చట నున్నవో తెలియదు; ఈ శాసనపు నకలు మాత్రము ఇవియట్టు దొరగారు సంగ్రహించి యుంచిన తెలుగు శాసన సంపుటములలో గలదు. (15-6-26; పుట 348).

S. I. I. Vol. I, p. 46, No. 37.

3. శక్తివర్మ పెన్నేఱు శాసనము.

4. కీర్తిశేషులైన శ్రీకొమర్రాజు వేంకటలక్ష్మణరావు పంతులు గారు చాళుక్యభీముని అత్తిలి తామ్రశాసనమున కనుబంధముగ ప్రకటించిన చాళుక్యభీముని పండిపాక తామ్రశాసనమున విక్రమాదిత్యుని భార్య వేంగాంబిక యని కలదు; కాని నావద్దనున్న ప్రథమచాళుక్యభీముని మఱియొక తామ్రశాసనపు నకలులో నామె పేరు గోమాంబిక యనికలదు. ఇందేది నిజమో తెలియదు. ఈ రెండుశాసనములకును అసలుమూలము రేకులు ఇప్పుడెచ్చట నున్నవియు దెలియరావు. అందువలన సరియైన ప్రత్యక్షశాసన ప్రమాణము గాన్పించువఱకు నిందేదిసత్యమైనదియో నిర్ధారించుట కష్టము.

5. C. P. No. 14—1908-09.

చాళుక్య భీమభూపాలుడు వేంగీవిషయమున కధిపతి కావలసియుండెను; కాని యాతని కా యాధిపత్య మంతసులభముగ లభింపలేదు. సింహాసన మధిష్ఠించుటకు పోవలసిన రాజమార్గమంతయు బహుకంటకావృతముగ నుండెను. వేంగీవిషయములోని రాజకీయ పరిస్థితులు మఱల నొకమాఱు విషమములయ్యెను. బలవంతుడును, ప్రతాపవంతుడునైన రాజచంద్రు డస్తంగతు డైనపిదప సాధారణముగ నేమి జరగునో గుణాగ విజయాదిత్య మరణానంతర మదియే యాంధ్రదేశమునను జరగెను. విజయాదిత్యుని దుస్సహమైన ప్రతాపానల మునబడి యట్టుడికినట్లుడికి వేగివేగి వెనుకకు తగ్గిన రాష్ట్రకూటులు మొదలగువారికి మఱియొకమాఱు వేంగీరాజ్యమును కల్లోలపఱుప నవకాశము కలిగెను.

విజయాదిత్యుని మరణముతో నెప్పటి యట్ల మఱల వేంగీరాజ్యలక్ష్మిని వశమొనర్చుకొనుటకై చాళుక్యులలో చాళుక్యులకు తగవులు సంభవించెను. విజయాదిత్యుని కెదురు తిరిగి యాతనితో బోరాడి పరాజితుడైన యాతని సోదరుడు యుద్ధమల్లుడును, ఆతని కుమారులు తాలపరాజ, అరికేసరులును[6],

6. యువరాజవిక్రమాదిత్యునికి యుద్ధమల్లుడను సోదరుడొక డుండినట్లు శాసనముల కెసిబడకే తెలియును. ఆతని కుమారుడే తాలపరాజు. ఈతాలపరాజుమాత్రమేకాక యాతనికి అరికేసరి యను మఱియొక కుమారుడు కూడ నుండిన ట్లూహింపనవకాశము కలదు. అదియెట్లన: వేంగీమండలనివాసియైన జైనబ్రాహ్మణుడగు కన్నడ కవి యొకడు కలడు. ఆదిపంపయని యతని నామము. అతడు పులిగెరిరాజును, చాళుక్యవంశోత్పన్నుడు నైన అరికేసరి కాశ్రయుడుగ నుండి విక్రమార్జునవిజయమను నామాంతరముగల భారతమును రచియించెను. అందతడు తన పోషకుని వంశవృక్షము నీక్రిందిరీతి నిచ్చియున్నాడు.

యుద్ధమల్లుడు
|
(మొదటి) అరికేసరి
|
(మొదటి) నరసింహభూపతి — భద్రదేవుడు
|
(మొదటి) దుగ్ధమల్లుడు
|
బద్దెగభూపతి
|
(రెండవ) నరసింహభూపతి
(భార్య) జాకవ్వ
|
(రెండవ) అరికేసరి
(ఆదిపంపకవి కాశ్రయుడు)
(క్రీ. శ. ౯౪౧ వ సం.ర ప్రాంతమువాడు)

విక్రమాదిత్య భూపతి యితరకుమారులును సింహాసన మెక్కనుద్యమించు భీమభూపాలుని కడ్డుతగిలి కత్తులుదూసి రణభేరి మ్రోగించిరి. రాజ్యము వీరభోజ్యమని యార్యులు పలుకునప్పుడు వీరకుమారు లుపేక్ష వహింతురా? వారు తమశత్రువునకు శత్రువులగుటచేత దమమిత్రులైన రాష్ట్రకూటరాజుల నాశ్రయించి యీ కుటుంబకలహములలో వారి సాహాయ్యము నపేక్షించిరి. వేంగీచాళుక్య రాజులపై ప్రబలశత్రుత్వము కలిగి యీ రాజ్యవినాశనమున కెదురుచూచు రాష్ట్రకూటాధిపతులు స్వరాజ్యసంపాదనాకాంక్షతో దమ్మాశ్రయింపవచ్చు నసంతృప్తిపరులగు భీమవిష్ణువర్ధనుని దాయాదులకు దమవాకిలి నెప్పుడును తెఱచియే యుంచిరి. గుణగ విజయాదిత్యుని యవసానకాలమునందుండిన రెండవ కృష్ణవల్లభుడే యప్పటి కింకను రాష్ట్రకూటుల కధిపతిగ నుండెను. వీరెల్లరును తమతమ దుస్తంత్రములను విప్పి వేంగీరాజ్యముపై నెత్తివెళ్లి, లోకబాంధవు డస్తమించినవెనుక లోకము నాక్రమించు తిమిరపటలమువలెనే దాని నాక్రమించుకొనిరి. వేంగి రాష్ట్రకూటాది పరరాజన్యులకు వశమయ్యెను. ఈవిధమున మొట్టమొదట భీమభూపాలుడు దైవోపహతుడైనను ఆశోపహతుడుకాక తనతండ్రి తాతల నాటినుండియు భక్తియుక్తులై పనిచేయు యోధవర్గమును జేరదీసి ప్రతికూలపరిస్థితుల కెదురీదజొచ్చెను. భీమభూపాలునికి మువ్వురు కుమారులు కలరు: ఒకడు విజయాదిత్య నామాంకితుడు: మఱియొకడు ఇఱిమర్తి గండబిరుదాంచితుడు: వేఱొకడు విక్రమాదిత్యాభిధానుడు. వీరు ఈకష్టకాలమున భీమభూపాలునికి కుడియెడమభుజములవలె ప్రవర్తించిరి. వీరుగాక-- భీమభూపాలునికి నాగిపోతి యని పెంపుడుతల్లియొకతె కలదు. ఆమెకొక కూతురుండెను. ఆమెపేరు గాముకాంబ. ఈమెకు మహాకాలుడను నొకకుమారుడు పుట్టెను. ఇతడు కుమారస్వామివలె మహాశక్తియుక్తుడైనవాడు. ఇతడు భీమభూపాలునికి విశ్వాసపాత్రుడైన సేవకుడై ఆతని మహాసైన్యాధిపతియయ్యెను. శత్రువుల అన్యోన్యాస్త్ర సమాయోగమున నగ్ని ప్రజ్వలించుచోట్ల నీత డన్నిమాఱులలో తన స్వామియైన భీమభూపాలునికంటె ముందుపోయి శత్రువులను రూపుమాపినట్లు చాళుక్యశాసనముల

దీని ననుసరించి పండితులు కొందఱు ఆదిపంపకవి తెలిపినసంగతులు నిజముగునేని ఈవంశమువారు పూర్వచాళుక్యులనియే యభిప్రాయపడి యున్నారు. (See Dynasties of the Canarese Districts, Page, 39, Footnote 1.) కాని యీవంశమునందలి రాజులపేర్లెక్కడను అనగా పశ్చిమ చాళుక్యవంశమునగాని, పూర్వచాళుక్య వంశమునగాని, రాజనగరమని నుడివిన పులిగెరిశాసనములలోగాని కానరాకపోవుటచేత ఆదిపంపకవి తెలిపిన విషయములందు సత్యముకలదాయని కొందఱు శంకించుచున్నారు. ఆదిపంపకవి యసత్యవంశవృక్షము నిచ్చుటకు హేతువుకానరాదు. ఒకవేళ నీవంశమువారు పూర్వచాళుక్యశాఖకే చెందినవారైనచో నీవంశవృక్షమున మొట్టమొదట దెలుపబడిన యుద్ధమల్లుడు తొలపరాజుతండ్రియైన యుద్ధమల్లుడే యుండవచ్చును. అట్లయినచో యుద్ధమల్లునకు తొలపరాజ, అరికేసరులను ఇరువురు కుమారు లుండినట్లగను. తరమున కిరువదియైదేండ్ల చొప్పున రెండవ అరికేసరినుండి వెనుకకు లెక్కవేసికొని వెళ్లినను మొదటి అరికేసరి కొంచె మించుమించుగ మొదటిచాళుక్య భీమునినాటివాడు కాగలడు.

వలన దెలియుచున్నది.[7] గుణగవిజయాదిత్యుని ప్రధానమంత్రియు, సుప్రసిద్ధ సైన్యాధిపతియు నైన పాండురంగవిభుని మనుమడగు కడెయరాజు భీమభూపాలునికి బాసటమై నిలిచిన మఱియొక సైన్యాధిపతి. ఈపైన పేర్కొనంబడిన వారలెల్లరు భీమభూపాలుని పక్షమవలంబించి, విపక్ష పక్షమును పెక్కుచోట్ల నెదుర్కొని యసమాన శౌర్య ప్రతాపములనుజూపి మహాఘోరముగ పోరాడిరి. మూడవ విజయాదిత్యానంతరము రాష్ట్రకూటాదులకును, చాళుక్య భీమభూపాలాదులకును నిరంతరము ఘోరసంగ్రామములు జరగుచునే యుండెను. ఉభయపక్షములకు నిట్లు మూడువందల యఱువదియుద్ధములు సంభవించెననియు, ఇన్నిటిలో చాళుక్యభీమాదులె విజయులైరనియు నొకానొక శాసనము తెలుపుచున్నది.[8] కాని తెలుపబడిన యుద్ధసంఖ్య విపరీతముగనుండుటచేత నిదియొకవేళ నతిశయోక్తియని కొట్టివేసినను మొత్తముమీద పెక్కుతడవ లుభయులకు సంగ్రామములు జరగెననిమాత్రము విశ్వసింపవచ్చును; లేదా, యీ సంఖ్య నిజమగుననియే విశ్వసించువో ప్రతిదినము నుభయబలములకు నెచ్చటనో యొకచోట యుద్ధము జరగుచునే యుండెననియు, ఇట్లు మూడువందల యఱువదియుద్ధములు మూడువందల యఱువదిదినములు జరగెననియు నూహించి తన్మూలమున రాష్ట్రకూట చాళుక్యయుద్ధములు కొంచెమించుమించుగా సంవత్సరకాలము సాగెననియు, ఇంత కాలము వేంగి రాష్ట్రకూటాదుల యధీనముననే యుండెననియు, చాళుక్యభీమభూపాలుడే శత్రుసైన్యముల నిర్జించి తుదకు పితృపితామహార్జితమైన వేంగీరాజ్యమును స్వాధీనపఱచుకొనెననియు నొకవిధముగ సమన్వయించుకొనవచ్చును. ఎట్లయిననేమి తుదకు చాళుక్యభీమభూపాల విష్ణువర్ధనుడు వేంగీరాజ్యలక్ష్మి రక్తదాహమును తీర్చి యామెను కైవసముచేసికొనెను: వేంగికి కష్టదినము లంతరించి శుభదివసము లవతరించెను. రణరంగవీరుల శౌర్యప్రతాపానలము చల్లారి దేశమునందు శాంతిశీతలచ్ఛాయలు వ్యాపించెను. దాయాదులను, రాష్ట్రకూట కృష్ణవల్లభుని, ఆతనికి దోడుగా వచ్చిన యతని సామంతులను జయించి భీమభూపాలుడు విజయశంఖమును పూరించెను. వెలుతురునకు ముందు చీకటివలె భీమభూలుని ముందు కర్ణాటలాటాధిపతులు పలాయితులైరి[9]. ఇట్లు ఆహవకర్కశులును, రణరంగభీములును, సంగ్రామపార్థులునైన యోధానుయోధులయొక్కయు, సైన్యాధిపతులయొక్కయు తోడ్పాటుతో కదనప్రచండుడైన విష్ణువర్ధనమహారాజు తనరాజ్యమును మఱల సముపార్జించుకొని శాలివాహన శకము ౮౧౪-వ సంవత్సరమున చైత్రబహుళ ౨ సోమవారము నాడు అనూరాధా నక్షత్రమున మిథునలగ్నమున అనగా క్రీ. శ. ౮౯౨-వ సంవత్సరము ఏప్రిల్ నెల ౧౭-వ తేదిని వేంగీచాళుక్యరా

7. Ep. Ind. Vol. V, P. 132
8. Ep. Ind. Vol. IV, P. 226
9. C. P. No. 1 of 1913-14

జ్యమునకు పట్టాభిషిక్తుడయ్యెను.[10] నిజపట్టబంధ సమయమున సంప్రార్థితుడై యీతడు కౌండిన్యగోత్రుడును, వేదవేదాంగ పారంగతుడును, క్రమవిదుడును, 'ఉమ్మరకంఠిబోళు'[11]ను, రేవమయ్యమనుమడును, ద్రోణభట్టు కుమారుడునైన పోతమయ్యకు ఉత్తరకండేఱ్వాడి విషయములోని కూకిపఱ్ఱుగ్రామమును దానమొసంగెను[12]. ఇతనికిని ఇతని దాయాదులకును జరిగిన యుద్ధములలో పెక్కురుబ్రాహ్మణులుకూడ యోధులైనిలిచి, తమశస్త్రముల వాడిమియు, అస్త్రములపోడిమియు జూపి భీమభూపాలుని కృతజ్ఞతకు పాత్రులైరి. ఇట్టివారిలో కౌండిన్యగోత్రుడును, వాజసనేయ బ్రహ్మచారియు, సబ్బిశర్మపౌత్రుడును, విడిశర్మపుత్రుడు నగు రంగాధికక్కరాభిధానుడు పేర్కొనందగినవాడు. ఈ వీరవరేణ్యుడు ఆపత్కాలమున దనకుజేసిన 'ఖడ్గసహాయము'ను పాటించి యతనికి భీమభూపాలుడు పండిపాకగ్రామమును దానముచేసెను.[13] అంతవఱకు దనకును, దనవంశమునకును ద్రోహులై ప్రవర్తించిన దుర్నయులను తగురీతిని శిక్షించి భీమభూపతి ద్రోహార్జునుడన్న బిరుదమును ధరించెను. ఇతనికి శౌచకందర్పుడనియు వేఱొక బిరుదము కలదు.

చాళుక్యరాష్ట్రకూటయుద్ధములు బహుకాలము జరగినను భీమనృపాలుని సమరకౌశలమున కాటపట్టులై తనర్చిన యుద్ధభూములేవియో మనకు దెలియరాదు. కాని వానిలో విరజాపుర, నిరవద్యపుర, పెరువంగూరుగ్రామములు మాత్రము శాసనములందు పేర్కొనంబడినవి. నిరవద్యపుర, పెరువంగూరుయుద్ధములలో పదునాఱేండ్లలే ప్రాయముగల భీమరాజతనయుడైన ఇఱిమర్తిగండడు అభిమన్యుకుమారునింబోలె పరాక్రమించి శత్రువులను సంహరించి సంస్తుతిగాంచెను. నిరవద్యపురరణమున అతడు కరితురగ ధనుర్ధరాదులచేత నుదగ్రమైన వల్లభసేనను గజారూఢుడై మృగపతిహరిణములనువలెనే చెదరగొట్టి అనన్యసామాన్య సమరవిద్యాప్రావీణ్యమును గనబఱిచెను. పెరువంగూరు గ్రామరణమున వల్లభదండనాయకుడైన దండెన గుండయ యనునాతడు విజృంభించి చాళుక్యసైన్యముల నురుమాడుచుండ ఈవీరకుమారుడు భీతార్తులై చెదరిన తనబలములను జేయూపి నిలువరించి వాటికి ధైర్యము నూలుకొల్పి, శత్రుసైన్యముపై గవిసి దానిని చించిచెండాడుటయెకాక కుంతాయుధ హస్తుడై తనమదపుటేనుగునుండి యావల్లభదండనాయకుని పొడిచి యాతనిం గధావ

10. భీముని అత్తిలి తామ్రశాసనము.

11. బోళు అనునది బోయఅనుదాని బహువచనము. ఏకవచనమున బోండు, బోఁడు, బోయఁడు అనురూపములును ప్రాచీనశాసనముల గానవచ్చును. బోళుపదము నిచ్చట గౌరవవాచకముగ గ్రహింపబడినది. ఈ 'బోయ' యను విశేషణవాచకమునుగూర్చి శాలంకాయన నందివర్మ పెదవేగిశాసనమును చూడుడు. (భారతి సం. ౧, సంచిక ౬.)

12. Ep. Ind. Vol, V, Page 127.

13. అత్తిలితామ్రశాసనానుబంధమున పండిపాక తామ్రశాసనము.

శేషునిం గావించి, లాటాధిపతులను, దాయాదులను జీమూతపుంజమును ఝంఝానిలమట్లు పోద్రోలెను. విరోధిభూనాథు లీచాళుక్యకుమారుని రణక్రీడానైపుణికి వెఱగుపడియు భీతినొంది, తంత్రములం బన్ని యుద్ధాంతరమున నాతని నూరకపోనీక చుట్టుముట్టి కడతేర్చిరి.[14]

భీమభూపతి కీకుమారవీరునిపై వాత్సల్యము మెండు. తండ్రి వాత్సల్యమును చూరగొనిన యీ వీరకుమారుడు పిన్నవయసుననే మహాదాతయై, యర్థిజనంబులకు ధనము నొసంగి గొప్పకీర్తి సంపాదించెను. భీమరాజీరాజకుమారునికి పారలౌకికక్రియలు నిర్వర్తించి, యాసమయమున 'విద్యాస్థానపారావారపారగు'లైన నలువది యైదుగురు బ్రాహ్మణులకు ఉత్తరకండేర్వాడి విషయములోని వెడతులూరు గ్రామమును దాన మొసంగెను.[15]

భీమభూపాలుని రెండవ కుమారుడైన విజయాదిత్యుడుకూడ ఇఱిమర్తిగండనికి తీసిపోయిన వాడుకాడు. ఆతడును నిజముగ విజయాదిత్యుడే. ఈతని శౌర్యపటిమకు సాక్షీభూతమై నిల్చినస్థలము విరజాపురము. విరజాపురసంగ్రామమున నీతడు రాష్ట్రకూటసైన్యము నోడించి, యచ్చట తన విజయచిహ్నముగ నొక కీర్తిస్తంభమును ప్రతిష్ఠించెను.[16] అప్పుడు సమరశాస్త్ర విశారదులైన యిట్టి శౌర్యమూర్తులుండిరి గనుకనే చాళుక్య రాజ్యలక్ష్మి వేంగీసింహాపీఠినుండి కదలలేదు.

ఇఱిమర్తిగండ, విజయాదిత్యులను గుఱించి చెప్పినట్లు మూడవతనయుడైన విక్రమాదిత్యునిగుఱించి, ఆతడీచాళుక్యరాష్ట్రకూట సమరముల తండ్రియైన భీమరాజునకెట్లు తోడ్పడినదియు శాసనము లేమియు జెప్పుటలేదు. ఆతడప్పటి కింకను బాలుడై యుండుటయే యిందులకు కారణము కావచ్చును. ఇఱిమర్తిగండడే పదునాఱేండ్ల ప్రాయముగలవాడైన యప్పుడు ఆతనికంటె తరువాతివాడు కాదగు నీవిక్రమాదిత్యుడు బాలుడై యుండునని యూహించుట సమంజసము కాకపోదు.

'పెరువంగూరు విరజాపుర నిరవద్యపురము' లను నీమూడు గ్రామములును అప్పుడు యుద్ధము జరిగినచోట్లని మనకు దెలిసినను అవి యెచ్చటివో తెలిసికొనుటమాత్రము కష్టముగ నున్నది. పెరువంగూరన పెద్దవంగూరగునేమో. వంగూరను పేరుగల గ్రామమొకటి ఏలూరుతాలూకాలో కలదు. అదియే పెరువంగూరగునేమో సంశయింప దగియున్నది. విరజాపుర మిప్పటి విజాపురమని కొందఱి యభిప్రాయము. ఇది యగుననికాని, కాదనికాని చెప్పుటకు తగిన యాధారములు కానరావు. నిరవద్యపురము తరువాతి చాళుక్యశాసనములలో[17] 'నిరవద్యప్రోలు' అనియు పేర్కొనం

14. C. P. No. 1 of 1913-1914.
15. Ibid.
16. Ind. Ant. Vol. XIII, P. 213.
శక్తివర్మ పెన్నేఱు తామ్రశాసనము.
17. S. I. I. IV. No. 1243; C. P. No. 3 of 1921-22;

బడినది. ఆశాసనములందు పేర్కొనంబడిన యితర గ్రామములసంగతి ననుసరించి చూడగా ఇది యిప్పటి నిడదవోలు అయియుండవచ్చు ననుట కవకాశము కలదు.

మంగియువరాజు జ్యేష్ఠపుత్రుడైన రెండవ విజయసింహావల్లభుని (క్రీ. శ. ౭౦౧-౭౧౮) పెనుకపఱ్ఱు దానశాసనమననుసరించి యారాజునకు 'నిరవద్య' బిరుద మున్నట్లూహింపనగును.[18] ఇదియే నిజమైనయెడల ఆనగరము రెండవ జయసింహా వల్లభుని పేర కట్టబడి, చాళుక్యులకాలమున ప్రసిద్ధికివచ్చిన ముఖ్యదుర్గములలో నొక్కటియై, పేరును పెంపును గాంచెనని చెప్పవచ్చును.

విష్ణువర్ధన నామాంకితులైన చాళుక్య ప్రభువులలో నీభీమరాజు ఆరవవాడగుట ఈతనిని ఆఱవ విష్ణువర్ధనుడనియు, భీమనామాంకితులలో నీతడు ప్రథముడగుట ప్రథమచాళుక్యభీముడనియు నందురు. పరాక్రమవంతుడై యీతడు తనపెదతండ్రియైన మూడవ విజయాదిత్యుడు సంపాదించిన కళింగమును కూడ నిలబెట్టుకొని వేంగితోగూడ దానిని పరిపాలించెను. చాళుక్యాధికారము ఈతనికాలమునను కళింగముపై సాగుచుండెననుటకు ఎలమంచి కళింగదేశ, దేవరాష్ట్రవిషయములకు సంబంధించిన యీతని తామ్రశాసనమే తార్కాణము[19].

భీమభూపాలుడు మహారాజాధిరాజపరమేశ్వరుడు: పరమబ్రహ్మాణ్యుడు: సర్వలోకాశ్రయుడు. ఇతడు గాంధర్వవిద్యాభిమానియై, తద్విద్యయందు ప్రవీణులైనవారి నాదరించి, దానాదికములచేత సత్కరించి పోషించెను. ఈ భీమభూపాలుని అత్తిలి తామ్రశాసనము లట్టి సమస్తగాంధర్వవిద్యావేదినియైన 'చల్లవ' యను వేశ్యాంగనకీయబడిన దానమును దెలుపుచున్నది.[20] శివభక్తిపరాయణుడై భీమభూపాలుడుచాళుక్య భీమేశ్వరుడను పేర ఈశ్వరుని ప్రతిష్ఠించి ఆదేవునికి రమ్యహర్మ్యమును గట్టించి కీర్తిగాంచెను.[21] ఈచాళుక్యభీమేశ్వర దేవహర్మ్యమున్న గ్రామమే నేడు చాళుక్యభీమవరమను పేర బరగుచున్నది. ఇది కాకినాడ తాలూకాలో చామర్లకోట గ్రామమునకు ప్రక్క గలదు. ఈ చాళుక్య భీమేశ్వరక్షేత్రమే కుమారారామమని ప్రసిద్ధికెక్కినది.[22] ఈ భీమభూపతి ప్రోత్సాహమున చట్టపనామాంకితుడైన

18. భారతి సం. ౧, సంచిక ౧౦, పుట ౧౮౧, ఫుట్‌నోటు 3.

19. C. P. No. 14 of 1908-1909.

20 అత్తిలి తామ్రశాసనము.

21. Ep. Ind. Vol. IV. P. 226.

22. చాళుక్యభీమవరము శాసనములు చూడుడు; ఈక్షేత్రము శ్రీనాథుని భీమేశ్వర పురాణమునందును పేర్కొనం బడినది.

"సరిసామంతుఁడు శ్రీకుమారవనికాచాళుక్య భీమేశ్వరే
శ్వరదేవుం డుపకంఠబాంధవుఁడు శ్రీసంవేద్య రాడ్భైరవుం
డిరవుం బొర్వును బల్వలేశుఁడు మృకండేశుండుగా నేలె ని
ద్ధరణీమండలి భీమనాథుఁడు నిరాతంక ప్రతాపోద్ధతిన్."—ఆ ౫. ౮౯.

యీతని సామంతుడొకడు భీమభూపాలుని పరిపాలనము పదునేడవ సంవత్సరమున అనగా క్రీ.శ. ౯౦౯-వ యేట బెజవాడలోని ఇంద్రకీల పర్వతముమీద పార్థేశ్వరాలయమును గట్టించెను.[23]

విక్రమాదిత్య తనూభవుడైన యీవిష్ణువర్ధనుని పరిపాలనమున ప్రారంభదశలో వేంగీరాజ్యము అల్లకల్లోలముగ నుండినను కాలక్రమమున నందు శాంతి సంస్థాపితమై, దేశము పాడిపంటలకు నెలవయ్యెను. ఈతడు క్రీ. శ. ౮౯౨ మొదలు ౯౨౨ వఱకు ముప్పదిసంవత్సరములు జనరంజకముగ పరిపాలించి పరలోకమున కేగెను.

అతని యనంతరము అతని కుమారులలో నగ్రజు[24]డైన విజయాదిత్యభూపాలుడు రాజ్యమునకు వచ్చెను. విజయాదిత్య నామాంకితులైన చాళుక్యరాజులలో ఈతడు నాలవవాడు. కొల్లభి[25]గండ విజయాదిత్యుడనియు[26], కొల్ల

ఈకుమారారామము ప్రసిద్ధములైన పంచారామక్షేత్రములలో నొకటి. చాళుక్యభీమేశ్వరాలయము నందలి ప్రాచీనశాసనములలో నిది కుమారారామమనియే పేర్కొనబడినది. దీనికే భీమారామమనియు నామాంతర మున్నట్లు భీమేశ్వరపురాణమువలన దెలియుచున్నది. ధరణాలకోట అమరారామము, గుణపూడి (భీమవరము తాలూకాలోని యిప్పటి గునుపూడి) సోమారామము, పాలకోట (నరసాపురంతాలూకాలోని యిప్పటి పాలకొల్లు) క్షీరారామము, 'చాళుక్యవంశరాజధాని యగు చాళుక్యభీమవర నామగ్రామంబు......భీమారామము', దక్షారామము-ఇవి పంచారామములుగ భీమేశ్వరపురాణమున దెలుపబడినవి. క్రీ. శ. ౧౨౮౬ వ సంవత్సరమునాటి శాసనమొకటి పంచారామముల నిట్లు పేర్కొనుచున్నది:

"భీమాపురము దాకరేమి పాల్కొలను దా, ద్రాక్షారామపురి శ్రీనుదమరదాలు
అను నంధ్రధరణి పంచారామముల మహా, దేవరలకు....................."

ఇందలి దాక్షారామము, అమరారామము, క్షీరారామములు మనకు దెలియుచునేయున్నవి గాన మిగిలిన భీమాపురము దాకరేములలో ఏదియో యొకటి చాళుక్య భీమవరము, మఱియొకటి గునుపూడియు కావలసియుండును. దాక్షారామ శాసనములలో నాగ్రామము 'పెద్దదాకరేమి' అని పేర్కొనంబడినది అచ్చటి దేవుని పేరుకూడ భీమేశ్వరుడే యగుటచేత దానికి 'పెద్దదాకరేమి' యనియు, కుమార భీమేశ్వరస్థానమగు చాళుక్య భీమవరమునకు డాకరేమి లేక చిన్నదాకరేమియనియు వ్యవహారనామముండెడిది దేమో? డాకరేమి ప్రాకృతరూపము. ఇదియే సంస్కృతమున దాక్షారామమైనది. ఇచ్చట భీమేశ్వర ప్రతిష్ఠయై యీక్షేత్రము పది పదునొకండు శతాబ్దులలో కాలాముఖశైవ విజృంభణకాలమున ప్రధానశైవక్షేత్రములలో నొకటిగ ప్రసిద్ధిజెంది ప్రాముఖ్యము గన్నినప్పుడు పవిత్రత హెచ్చుటకై నామసామ్యముండుటచేత దీనికి దక్షగాథముడిపెట్టి యుందురు.

23. Ep. Coll. 833 of 1917.

24. Ep. Ind. Vol. VII, P. 177.

25. ఈపదము శాసనములందు కొల్లభియనియేకాక కొల్లబియనియు గలదు. కొల్లభిగండబిరుదము కమ్మనాటిని క్రీ. శ. పదిపదునొకండు శతాబ్దులలో పాలించిన తెలుగుచోళులలోను గానవచ్చుచున్నది.

"బల్లహుతో ఘనబిజ్జన, వల్లాటనవచ్చు పాముఁబట్టినఁగని యా
బల్లహుఁ డిచ్చె గుణాంకము, కొల్లభిఁగొని జనులుగండగోపాలుఁ డనఁగ."

—ఓపిలిసిద్ధి చోడరాజు కొణిదెనశాసనము.

26. Ep. Ind. Vol. VII, p. 177.

భిగండ భాస్కరుడనియు[27], కొల్లభిగండ డనియు[28], కలియర్త్యంకుశనియు[29], కలియర్తిగండ డనియు[30] నీతనికి నామాంతరములు కలవు.

ఇతడు తనతండ్రియైన భీమభూపతి జీవించియుండగనే తన యనుపమాన భుజబలమున వైరివర్గమును విధ్వస్తమొనరించి పరాక్రమవంతుడని పేరొందెను. ఈతనికి 'చాళుక్యకుల కల్యాణ పరంపరానియోగాధి కృతపట్టవర్ధినీ' వంశజుడును, స్వామ్యనుజ్ఞా ప్రకారము దుర్ధర్షబలుండయిన దద్దరుడనువానిని జంపిన కుబ్జవిష్ణు వర్ధనానుచరుడగు కాలకంప వంశప్రసూతుడును, సోమాదిత్య పౌత్రుడును, పృథివీరాజ పుత్రుడును, కుంతాదిత్య నామాంతరుడును అయిన భండనాదిత్యుడనువాడు విశ్వాసపాత్రుడైన భటుడును, అనుచరుడునై పెక్కుయుద్ధముల అతనికి తోడ్పడి స్వామిహితము నెఱవేర్చుచు వచ్చెను.

మూడవ విజయాదిత్యుని కాలమునుండియు చాళుక్యాధికారమునకు లోపడియున్న కళింగాధిపతులు ఈ విజయాదిత్యుని కాలమున స్వాతంత్ర్యమును సంపాదించుటకై ప్రయత్నించి యుండవచ్చును: దానంజేసియే యీతడు కళింగదేశముపై దాడివెడలి వారిని జయించినట్లు చాళుక్యశాసనములు నుడువుచున్నవి.[31] ఈతడు తండ్రి, పెదతండ్రులవలెనే త్రికళింగాటవీయుక్తముగ వేంగీమండలమును పరిపాలించెను.[32] ఈతని దానశాసనము లేవియు నింతవఱకు దొరకలేదు.

ఇంతటి స్వల్పకాలము మాత్రమే యీతడు పరిపాలించుటకు దాయాదుల కయ్యములో, శత్రువుల దండయాత్రలో కారణమై యుండవచ్చును. విరజాపురమున జరిగిన సంగ్రామమున నీతడు వీరస్వర్గము చూరగొనెనని యొకానొకశాసనము చెప్పుచున్నది;[33] కాని పెక్కు చాళుక్యశాసనములు విరజాపురమునందలి యీతని కీర్తిస్తంభప్రతిష్ఠనే యుగ్గడించుచున్నవి. అందువలన విరజాపుర యుద్ధమున నీతడు నిహతుడయ్యెనన్న విషయమునందలి యాథార్థ్యము సంశయింపదగియున్నది. అట్లుకాక కీర్తిస్తంభప్రతిష్ఠయు, నిహతుడగుటయుగూడ సత్యములే యగునెడల, విజయాదిత్య నృపాలునికిని, ఆతని శత్రువులకును విరజాపురమున రెండుమారులు యుద్ధము జరిగెననియు అందు మొదటిమాఱు విజయాదిత్యుడు విజయమునొంది, యచట దన విజయచిహ్నముగ కీర్తిస్తంభమును ప్రతిష్ఠించెననియు, రెండవమాఱు జరగిన యుద్ధమున నతడు నిహతుడయ్యెననియు సమన్వయించుకొనదగును.

27. Ind. Ant. Vol. XIII, p. 248.
28. Ep. Ind. Vol. IV, p. 226; Ep. Ind. Vol. VII. p. 177.
29. S. I. I. p. 36; Ind. Ant. Vol. XIII, p. 50.
30. Sewell's Lists of Antiquities, Vol. II, p. 13, No. 84.
31. Ind Ant. Vol. XIII, p. 213.
32. Ep. Ind. Vol. V, p. 131.
33. C. P. No. 23 of 1916-1917.

ఈ విజయాదిత్యునికి ఇరువురు భార్యలు కలరు. అందొకరిపేరు మేఱాంబ[34]. రెండవ భార్యపేరు తెలియరాదు. ఇరువురు భార్యల యందు నాతని కిరువురు కుమారులు కలిగిరి. అందొకనిపేరు రాజమహేంద్రాపరనామము గల అమ్మరాజు; రెండవ వానిపేరు విష్ణువర్ధన నామాంతరముగల భీమభూపాలుడు. ఈ భీమ భూపాలుడే మేఱాంబానందనుడు. అమ్మరాజు తల్లిపేరు మనకు దెలియదుకాని యాతడు చాళుక్యశాసనములలో విజయాదిత్యుని అగ్ర సూనుడని చెప్పబడియున్నాడు;[35] ఇందువలన నితడు పట్టమహిషికి జన్మించినవారిలో జ్యేష్ఠు డనికాని, లేక చాళుక్యశాసనముల ననుసరించి కొందఱు చెప్పునట్లు ప్రప్రథమమున జన్మించిన వాడని కాని చెప్పవలసి యుండును. ఈ భీమ భూపాలామ్మరాజు లిరువురిలో అమ్మరాజ భూభుజుడే తండ్రియనంతరము రాజ్యమునకు వచ్చెను.

సాధారణముగ చాళుక్యులలో నితని పూర్వులకువలెనే యితనికిని వేంగిసింహాసన మంత సులభముగ స్వాధీనము కాలేదు. కొల్లభిగండ విజయాదిత్యునికి విక్రమాదిత్యుడను పేరుగల సోదరుడుండినట్లు మనకు దెలియును. ఆతడును, అమ్మరాజ రాజమహేంద్రుని యితర దాయాదులు మఱికొందఱును ఏకమై వేంగీ చాళుక్యులలోని ప్రధానపాలక కుటుంబము నకు సహజశత్రువులైన రాష్ట్రకూటులతో జేరి ఆతనికి చాళుక్యరాజ్యము వశముకాకుండ కుట్రలు పన్నజొచ్చిరి.[36] వారు తుదకు అమ్మ రాజుయొక్క తండ్రి తాతలనాటినుండియు అత్యంతము విశ్వాసపాత్రులుగ బనిచేసిన సైన్యాధిపతులను, సేవకులను, తుదకు ప్రజ లనుగూడ తమపక్షమునకు త్రిప్పుకొని అత నిపై విక్రమించిరి. అయినను ఆతడు మేరు పర్వతమువలె చలియింపక, ఖడ్గైకసహాయుడై దాయాది విరోధివర్గముల నురుమాడి ప్రతా పము జూపియు, శక్తిత్రయసంపన్నుడై చతు ర్విధోపాయములను బ్రయోగించి కొందఱిని లోపఱుచుకొనియు జనులను వశీకరణము చేసి కొని తుదకు వేంగిరాజ్యమునకు పట్టభద్రు డయ్యెను. ఈతడు ప్రథమచాళుక్య భీమసై న్యాధిపతియైన మహాకాలునికి పెన్నాతవాడి విషయములోని ద్రుజ్జూరు గ్రామమును[37], కొల్ల భిగండ విజయాదిత్య సేవకుడైన భండనా దిత్యునికి కండేఱువాడి విషయములోని గొం టూరు గ్రామమును[38] దానముచేసినట్లు శాసన ములు కలవు. పైనుడివిన విషయములతో వీటిని సమన్వయించి చూచినచో మహాకాల,

---

34. Ep. Ind. Vol. V, P. 134.
శాసనములందు ఈ ఱ (ఴ) పొందిన మార్పులనుబట్టి చూడగా ఈ 'మేఱాంబ' అనుపేరును ఇప్పుడు 'మేడాంబ' అనియు, 'మేళాంబ' అనియు, 'మేలాంబ' అనియు, తుదకు 'మేహాంబ' అనియు ఉచ్చరింపవచ్చును.
35. Ep. Ind. Vol. VII, p. 177.
36. S. I. I. Vol. I, p. 39. No 36.
37. Ep. Ind. Vol. V, p. 131.
38. S. I. I. Vol. I, p. 39.

కుంతాదిత్యు లిరువురును మొట్టమొదట శత్రుపక్షమున జేరగా, పిదప అమ్మరాజు దానోపాయమున వారిని తనపక్షమునకు త్రిప్పుకొనెనని యోజింపదగియుండును; లేదా యీకష్టకాలమున వారలిరువురును అత్యంతము తోడ్పడి యీతనికి వేంగిసింహాసనము నిలుచునట్లు చేయుటచేతనైనను కావచ్చును అమ్మరాజు వారిని దానాదికముల సత్కరించియుండును. కాని, తండ్రితాతలనుండి వచ్చువారు మొదట పరరాజుపక్షమున గలియగా, నీతడు వారిని దనపక్షమునకు ద్రిప్పుకొనెనని శాసనములు నుడువుచుండుటచేత మొదటచేసిన సమన్వయమే సరియైనది కావచ్చును. ఎట్లయిననేమి తుదకు విజయాదిత్యాగ్రసూనుడైన అమ్మరాజ రాజమహేంద్రుడు వేంగీమండలమునకు పట్టభద్రుడయ్యెను: శత్రువుల తంత్రములు చిరకాలము సాగలేదు.

అమ్మరాజ నామాంకితులైన చాళుక్యనృపతులలో నీతడు మొదటివాడు: ఇతనికి రాజమహేంద్రుడనియేగాక విష్ణువర్ధనుడనియు నామాంతరము కలదు. ఇతడు సర్వలోకాశ్రయ బిరుదాంచితుడు.

ఇతని కాలమున రాజ్యము శాంతముగ నుండెను. రాష్ట్రకూటనృపాలుర యలజడి తగ్గెను. రెండవ కృష్ణవల్లభుని యనంతరము కొంతకాలము వఱకు సమర్థులైన రాజులు సింహాసనమునకు వచ్చియుండలేదు. కృష్ణవల్లభుని కిరువురు భార్యలు కలరు. వారిరువురివలన నాతనికి జగత్తుంగు డనియు, బద్దిగ అమోఘవర్షుడనియు పేర్లుగల యిరువురు కుమారులు కలిగిరి. జగత్తుంగుడు రాజ్యమునకు రాకుండగనే కాలధర్మము నొందెను. అందువలన కృష్ణవల్లభుని యనంతరము ఆతని పౌత్రుడును, జగత్తుంగుని పుత్రుడు నగు నిత్యవర్ష బిరుదాంచితుడైన (మూడవ) ఇంద్రభూపాలుడు రాష్ట్రకూట సింహాసనము నధిష్ఠించెను. ఈతడు కూడ రాష్ట్రకూటరాజ్యమును చాలకాలము పాలించి యుండలేదు. ఈతనికి అమోఘవర్షుడనియు, గోవిందభూపాలుడనియు నిరువురు కుమారులుండిరి. ఈ యమోఘవర్షుడు రాజ్యము చేయలేదనియు, నాతడు తండ్రియైన ఇంద్రరాజు పరలోకగతుడైన యనతికాలముననే తనువు చాలించెననియు తెలియుచున్నది. అందువలన ఇంద్రభూపతి యనంతరము ఆతని ద్వితీయపుత్రుడైన గోవిందరాజు రాష్ట్రకూటులకు రాజయ్యెను. ఈతనికి ప్రభూతవర్ష, సువర్ణవర్ష, నృపతుంగ,వీరనారాయణ, నృపతిత్రినేత్రాది బిరుదములు కలవు. వేంగీచాళుక్య ప్రభువైన అమ్మరాజ రాజమహేంద్రుని కీతడు సమకాలికుడు. అమ్మరాజుయొక్క పరిపాలనా ప్రారంభదశలో నీతడు వేంగీరాజ్యమును కల్లోలపఱుచుటలో గొంతవఱకు కృతకృత్యుడైనను తుద కాతని రాజనీతివలనను, బుద్ధి కుశలతవలనను ఈ గోవిందరాజుయొక్క తంత్రములు భగ్నము లయ్యెను. అయినను ఆశాప్రపూరితములైన తృష్ణావలోకనములతో నాతడు వేంగీరాజ్య రాజకీయపరిస్థితులను గని పెట్టుచునే యుండెను. అమ్మరాజ విష్ణువర్ధనుడు సమర్థుడును, రాజనీతి చతురుడును, సమర విద్యాపారంగతుడు నగు పరిపాలకు డగుటచే

గోవిందరాజుయొక్క యాటలు సాగిరాలేదు. చాళుక్య-రాష్ట్రకూట సంగ్రామములు చాల కాలమునుండి జరుగుచుండుట చేత, ఇంత కాలము నుండియు రాష్ట్రకూట చాళుక్యులలో నెవరు జయించుచు వచ్చినను చాళుక్యరాజ్యమైన వేంగీదేశమున కాలక్రమమున గొన్ని రాష్ట్రకూట కుటుంబములు స్థిరనివాసముచేసికొని వర్ధిల్లజొచ్చినవి. వేంగీదేశముమీదను, చాళుక్యాధీశులపైనను భక్తి గౌరవాభిమానములుగల రాష్ట్రకూటులను చాళుక్యరాజులు ఆదరించి, సమ్మానించుచు వచ్చిరి. క్రమక్రమముగా రాష్ట్రకూటులు చాళుక్యసేనలో సైనికులుగను, రాజ్యమున సామంతులుగను, రాజ్యపరిపాలనమున సేవకులుగను జేరి ఆంధ్రదేశ నివాసులైరి. సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజయిన మొదటి ఉమ్మరాజు మాన్యఖేట పురవరేశ్వరుడననియు, మహారట్టవంశజుడననియు జెప్పకొన్న ఇందపరాజనునతనికి వెలనాడు విషయములోని పులివఱ్ఱునొసంగి, యాతనిం దన సామంతుని గావించుకొని యాదరించెను.[39] ఈతడు ఇందపరాజనునతని పౌత్రుడని తెలియుచున్నది. కాని యీతనికిని, మాన్యఖేటము రాజధానిగా నప్పుడు పాలించుచుండిన రాష్ట్రకూట పాలకవంశమువారికి నేవిధమైన సంబంధము నున్నట్లింతవఱకు దెలియరాదు. ఎట్లయిన నేమి, వేంగీదేశముపై నభిమానము గలిగి, దానిని మాతృదేశము చేసికొని, చాళుక్యాధికారమునకు లోపడియుండిన విదేశీయులకును తగినగౌరవాదరణములుజరుగుచుండెనని యూహించుట కీవిషయము తార్కాణముగ నున్నది.

ఈ రాజమహేంద్రుని కాలమున ఆతని పేరనే యిప్పటి రాజమహేంద్రవరము కట్టబడినట్లును, ఆతడే చాళుక్యరాజధానిని పెదవేగినుండి రాజమహేంద్రవరమునకు మార్చినట్లును గాధకలదు. రాజమహేంద్ర బిరుదాంచితులైన చాళుక్యప్రభువులు ఇంతకు పూర్వమెవ్వరును లేకపోవుటచేత పైగాధలో కొంత సత్యము కలదనుటకు అవకాశము కలదు. ఈతడు క్రీ. శ. ౯౨౧ మొదలు ౯౨౭ వఱకు నేడేండ్లు పరిపాలించెను.

39. C. P. No. 3 of 1923-24.

ప్రణయార్పణము - హృదయపరివర్తనము

పెమ్మరాజు లక్ష్మీపతిగారు

ధర్మాత్మన తులకావ్యవి, నిర్మాణచణున్ వివేకవినయున్ గవితా
మర్మోపదేష్ట, వేంకట, శర్మాహ్వాయుఁ దలతు భక్తిసంగతమతినై.

క. బ్రాహ్మణగుణములు లేకయు, బ్రాహ్మణగృహమందు సంభవము గని యు తన్
బ్రాహ్మణుడని చెప్పెడి యం, బ్రహ్మ యొకడు తిరుగు నొక్కగ్రామమునందున్.

సీ. నేలంపుటంచు పాదాలపై జీరాడ, పట్టుదోవతి గూడ కట్టు గట్టి
యొడ్డాణమును బోలు నొకతోలుపటకాను, పొలుపారగా నడుమున బిగించి
గుండీలు లేకుండ కుచుచేతులు కల్గు, జుబ్బానుబోలు కంచుకము దొడిగి
కొమరారు సరిగదుకూల మొక్కటి మడ్చి; పైటవోలెను వల్లెవాటుగూర్చి
యొక్కముంజేత గడియారగ; మొకట రవలు, చెక్కియున్నట్టి మణికట్టు, శిరముపైన
ప్రక్కపాపట యును గల్గి టక్కుజూపు, పురుషవేశ్యయె నాదగి తిరుగుచుండు.

క. పొగయోడనుండి యప్పుడ, దిగివచ్చిన తెల్లదొరలతీరున నాతం
డగపడు నొక్కొకపట్టున, నగరిజనము తన్నుజూచి నల్లదొర యనన్.

క. చదివెను, చక్కనిపొండితి, యొదవెను; ప్రారబ్ధకర్మమో ! మరియేమో !
పదుగురు తులువలగూడుచు, మదమున జరియించు నీతిమాలినపనులన్.

ఉ. ఆయతకాంతిదీధితు లజాండముఁ గప్పెడు బ్రహ్మతేజ మే
మాయెనో మాయమై, యటు కటా వికటాకృతి వచ్చె, యావన
ప్రాయవిలాసనవ్యరుచిరంబులు కాక కపోలవాటికా
స్నాయువు వెండి చూడ్కికి నసహ్యములై కనుపట్టు నెంతయున్.

ఉ. అయ్యయు నమ్మయున్ దగ నహర్నిశమున్ బని పూని చెప్పి యా
కొయ్యను మార్పలేక కడకున్ కొడుకున్ విడనాడి వృద్ధులై
యయ్యమరేంద్రలోకసుఖ మందిరి; యందరు నిందచేయ నీ
యయ్య చరింపఁజొచ్చెను నిరంకుశుడై మదమున్ వహించుచున్.

ఉ. వారక వడ్డికిచ్చి కడు వర్ధిలజేయుచు తండ్రి నీర, మా
హారము కూడ మాని శ్రమలంది గడించినమేటివిత్తముల్
మారిచి యాస్తినంతయు సమాప్తము చేసె నతండు యావన
స్వైరవిహారుడై నయవిచారవిహీనత నొక్కమాత్రలోన్.

క. పలికెడి దేమిక తుదకున్, గలుద్రావుట మాంసఖాదనంబనుపనులన్
మెలగిన కులము జనంబులు, వెలివెట్టిననైన చా వివేకరహితుడై.

క. జూదం బాడుట త్రాగి వి, వాదము లాడుటయు వేశ్యభామాకేళీ
మోదరతుండగుటయు గ్ర, వ్యాధజనముగూడి వేటకై యరుగుటయున్.

వ. మున్నగు దుర్వ్యసనంబులం దగిలి యజస్రంబు విహరించుచుండు.

ఉ. ఆపురిచెంగటన్ గిసలయప్రసవప్రకరప్రభాసము
ద్దీపితచూతభూరుహతతిన్ విలసిల్లు విహంగముల్, కలా
లాపకలాపలాలితవిలాసము లొల్క మనోజ్ఞలాస్యకే
ళీపరిశోభితప్రణయలీలల దేలుచు జూడ్కి నాగుచున్.

౨

మ. భుజమం దొక్కతుపాకి దాల్చి కడు నింపుల్ నింపు తద్భూరుహ
వ్రజసంవాసితనుల్లసత్ఖగకులారావంబు లాలించి వే
డ్క జనింపన్ జనె నొక్కనా డతడు వే టాడంగ నవ్వీట స
ర్వజనంబుల్ తను నింద సేయగ నఖర్వక్రౌర్యగర్వోద్ధతిన్.

గీ. సతతహింసాపరత్వదోషాతిరేక, దారుణానలతాపసంతప్తు డగుచు
సృష్టి బొలిచ్చి పెంచెడు ప్రేమరసము, హృదయకుసుమమరందమే యింకిపోయె.

చ. లలితనభోవినీలిమవిలాసరసార్ద్రిములై రసాలమం
జులసుమమంజరీనిచయశోభల దేలి విహంగనిస్వనా
వళు లలరారె గోమలశుభద్యుతు లీన వనాంతలక్ష్మి తా
గలకలనవ్వుచున్న దనగా దగు మోహనలీల దేలుచున్.

గీ. ఆవిహంగసుమధురగానామృతమున, జేసియైన, నామూర్ఖహృత్క్షేత్ర మపుడు
ప్రేమబీజము లవి యంకురింపరాని, కటికరానేలవోలె కర్కశత దాల్చె.

ఉ. అంచితదేహవల్లరు లొయ్యారముగా బెనగొంచు, మించి పు
ష్పించిన యారసాలతరుబృందములన్ బెనగొన్న యానికుం

జాంచలవీథు లారయుచు నం దొకచోట మృదూక్తులన్ గుబా
ళించెడుగువ్వజంట రవళిం జెవి జేర్చుచు బొంచి చూచుచున్.

మ. కుసుమోపేతలతావితానముల నాకుం జొంపపుం జాయలన్
విసపుంజూపుల జొన్పి చొన్పి కలయన్ వీక్షించి వీక్షించి యం
దసమానప్రణయాతిరేక మధురవ్యాసంగలోలాంతరం
గసముద్భాసిత మైన యాపులుగు జంటం గాంచె వా డయ్యెడన్.

మ. అలసౌధాంతర భర్మడోలల నసూర్యంపశ్యలౌ పుట్టుభో
గులు లావణ్యవతీద్వితీయులగు నాక్షోణీశులం బోలె న
వ్యలతాంతైక గృహాంతరంబుల నమందానందసామ్రాజ్యము
జ్జ్వలగాంధర్వకళావికాస మొలయన్ బాలించుచున్ జొక్కుచున్.

ఉ. పూవుల బూవులట్టులు చివుళ్లజివుళ్లనుబోలె నేకమై
యావిహగద్వయం బటు లతావళికిం బ్రభవించి మించు తీ
రై విలసిల్లె నేర్పరుపరాక యటున్నను వానిదృష్టి తా
బూవుల గ్రుచ్చుసూదివలె పోయెను లక్ష్యవిశుద్ధి యేర్పడన్.

క. ఏయుట కనువుగ నుండుట,కై యల్లన మెల్లమెల్ల నడుగుల నిడి యా
చాయల నొక్కనికుంజము, చాయ కరిగి పొంచి దృష్టి సారించి వెసన్.

సీ. కుడిరొమ్మున దుపాకిమడమను హత్తించి, డాచేయి జాచి గొట్టంబు బట్టి
నడు మొకించుక వంచి యెడమకా ల్ముందిడి, దృష్టితోడ తుపాకి ద్రిప్పుకొనుచు
గుడిచేతితర్జని గుఱ్ఱంబునడుగుభాగంబున జేర్చి డాకన్ను మూసి
వలపలికంటితో పులుగుల గని గురి, చక్కజేయుచు మీటు నొక్కినంత
నంతలో గాలిచేత నిట్టట్టు గదలి, యాపులుగుజంట గాపాడ నమరినట్లు
తీవ లడ్డమైన దుపాకి దెబ్బ సరిగ, పారదయ్యె నట్లయ్యు నప్పట్టునందు.

ఉ. ఢా మనుమ్రోతతోడ నకటా పడిపోయెను ప్రాణహీనమై
యామిథునంబునందు నొకయండజ మయ్యెడ బుష్పపల్లవ
స్తోమము రాలె ధూమపరిధూసరితంబయి, యాక్షణంబునన్
వ్యోమతలంబుపై నెగిరిపోయెను దక్కినపక్షి గ్రక్కునన్.

చ. అటు వినువీథి కేగి వలయక్రమ మారగ రెండురెక్కలున్
దటతట గొట్టు చార్తనినదంబులు దిక్కుల నించుచుండె, తా

దటుకున భూమిభాగపతితంబగు నవ్విహగంబు జూచి యా
కటికకసాయి యప్పులుగుకంఠము చే నిఱికించె గ్రక్కునన్.

చ. కనులను దెల్లనౌపొరలు గ్రమ్మెను, రక్తము కారుచుండె ము
క్కున, మెడ వ్రాలిపోయె; కటుక్రూరత నమ్మెయి నున్నదాని జే
కొని యతఁడేగె గొంచుఁ గనికుంజముపొంతకు దానిజోడు నిం
గి నెగురజొచ్చె నప్పుడరుక్రేవ దురంతవిషాదవేదనన్.

సీ. తీపారుప్రేముడితీవల్లినలీల, నల్లిబిల్లిగ తీవ లల్లుచోట
గమనీయ ప్రేమప్రకాశవికసనమన, గుసుమగుచ్ఛంబు లింపెసగుచోట(?)
నెయ్యంపునెత్తావి నిగిడి సుడియునోజ, విపులతావులు వెల్లివిరియుచోట
ప్రణయపీయూషవర్షప్రసారణమన; నలరుదేనియసోన లొలుకుచోట
నిశ్చలప్రేమనిష్ఠాతపశ్చరణవిధానమౌనుల కాశ్రమమైనచోట
దుచ్ఛకశ్మలదుర్గంధదూషితముగ, కటకటా యొక్కమర్త్యమృగం బొనర్చె.

చ. జగ మొకనాటకంబట రసజ్ఞుడు దానట మానవుం డిసీ!
యగణితప్రేమభావసముదంచితనాట్యకళావిలోలమౌ
ఖగమిథునంబు జంపితిని కాని వసింపగబోలదొక్కొ! యే
మిగతి రసార్ద్రిమాహృదయమే యిటు లెండుచు గొయ్యపారినన్!

గీ. హృదయమున బ్రేమరసమది యొదవకున్న, బ్రణయరాగరక్తిమ మొయి బరగకున్న
జిత్తమించుక రసస్పృష్టి చేయకున్న, బ్రతుకనేటికి జీవచ్ఛవంబువోలె.

3

ఉ. చెప్పగరానిబాధ తనచిత్తము నేచగ జిత్తబాధలన్
జెప్పగలేని యప్పులుగు చెప్పక చెప్పినబాధ చెప్పినన్
జెప్పినదాని మాటల నశేషవిషాదగభీరవారిధిన్
దెప్పలదేలుచుండెడు హృదింద్రియమే కనుగాక యేరికిన్.

ఉ. ఆగతిప్రేమగీతము లహర్నిశమున్ రచియించు వీణపై
తీగలరెంటియం దొకటి త్రెస్సెను; తక్కిన యొక్కతీగపై
మ్రోగదొడంగె నట్లశుభరోదనరావము నిర్నిమిత్త దుః
ఖాగమదోషదూషితజగంబున బ్రేమకు నిట్టివే గతుల్.

చ. మదిమదిఁజేర్చి బ్రేమగుణమంజుల బంధము నందుగూర్చి, ము
న్నదికినయట్టి జంటహృదయంబది చీల్చె గిరాతు డంత, నా

భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు
హిందీమహాసభాధ్యక్షులు, ఏలూరు

కందుల వీరరాఘవస్వామి నాయుడుగారు
ఆంధ్రరాష్ట్రీయమహాసభాధ్యక్షులు, ఏలూరు



మాగంటి బాపినీడు చౌదరిగారు
ఆంధ్రగ్రంథాలయసభాహ్వానసంఘాధ్యక్షులు, ఏలూరు

శ్రీమతి ఆచంట రుక్మిణమ్మగారు
ఆంధ్రమహిళాసభాధ్యక్షురాలు, ఏలూరు

సి. రాజగోపాలాచార్యులు గారు

ఏలూరునందు ఖద్దరుప్రదర్శనమును ప్రారంభించిరి

మధ్వశ్రీ కాశీ కృష్ణాచార్యులుగారు

ప్రకృతిమహాసభాధ్యక్షులు, ఏలూరు



శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావుగారు

(నుయ్యూరు జమీందారుగారు)

ఆంధ్రమహాసభాధ్యక్షులు, ఏలూరు

డాక్టరు పి. వరదరాజులునాయుడు గారు

సాంఘికసభాధ్యక్షులు, ఏలూరు

హృదయవ్రణంబునుండి ప్రవహించెడు శోణితధారలొక్కొ నా
నుదితములయ్యె శోకవికృతోక్తి కలాపము లమ్ముఖంబునన్.

ఉత్సాహ. కీరుకీరుకీరుమని యొకేవిధాన నాతనిన్
జేరియరచు నట్టునిట్టు చెట్టు బుట్ట జేరు, దు
ర్వారదుఃఖభారమున, నరణ్యరోదనం బదె
వ్వారు వింద్రు, దిక్కులేని పక్షి కాదె, యింతకున్!

శా. శోకాలాపకలాపముల్ నిగిడి యచ్చో నెల్లెడన్ నిండ నీ
లోకంబంతయు నేడ్చుచున్నదనుచ ట్లుండెన్ సమీపస్థుఁడై
యాకర్ణించియు జాలినొంద డతఁడావంతైన దత్క్రౌర్యలీ
లాకాఠిన్యపటిష్ఠమైన హృదయోల్లాసంబు దీపింపగన్.

మ. పలలం బబ్బెనటంచు నాతఁడలరున్; బ్రాణంబు భేదించు న
గ్గలపున్ శోకము జెందె నప్పులుగుసౌఖ్యంబిట్లు దుఃఖాంకపం
కిలమైపోయెడు; నిట్టి ద్వంద్వముల లంకెల్ గాక యోజించినన్
గలదే యొక్కయఖండ భావ మది లోకంబందు నెందేనియున్.

ఉ. పోయినపక్షితో నెగిరిపోయెను చాయయువోలె మాయమై
యాయెడస్వీయమైన హృదయద్విజరాజము, శూన్యగర్భమై
హేయమునైన కాయ మొకయింపు ఘటింపమి మోయనొల్లకే
మోయకయుండరామి బెనుమ్రోత లెసంగగ మ్రోయుచున్నెడన్.

క. కువకువవాపోవుచు దన, కవడాయంగోరు, క్రూరకర్మునిగని, చే
రవెరచియరచును డెందం, బవియించెడు రోదనమున నలమటచెందున్.

మ. అపు డాపక్షిని గాంచి యాత డిది యత్యాశ్చర్య మీవింత ము
న్నెపుడున్ జూడ దుపాకిమ్రోత విని దా మేమూలకోపోవుగా
క పులుంగుల్ దరిజేరి యిట్లరచునే కానిమ్మటం చాత్మకా
ర్యపరత్వంబున భావనల్ విడచి క్రౌర్యప్రక్రియాధుర్యుఁడై.

చ. చెలువు దొరంగి యయ్యెడమచేతను వ్రేలుచునున్నయట్టి య
ప్పులుగును రెండుచేతులను బూనుచు దారుణలీల దాని యీ
కల బెకలింప జొచ్చె నదిగాంచి యసహ్యమహావిషాద వి
హ్వలయయి దానిజోడు విపులార్తరవంబుల నింగి నింపుచున్.

ఉ. ఎప్పటికన్న నెక్కుడుగ నేడ్చుచు నత్తఱి రెండుకన్నులన్
నిప్పులు పోయుచున్న నతనిం గనలేక తదంతికంబునం
దుప్పరవీధి గొట్టుకొనుచుండె, నతం డదిచూచి వేడ్కమై
నప్పుడు దానిగూడ వెరవారగ బట్టుకొనంగ నెంచుచోన్.

క. తగులబడుచుండె నల్లెడ, జగమంతయు బక్షి కపు డసహ్యంబగు నె
వ్వగ పెల్లున తనడెందము, వగులుటయు దనంత భూమిపై బడిపోయెన్.

క. పడిపోయి యాకురంగట, బడియుండిన నల్లరాతిపై గడువడిమై
మెడద్రిప్పుచు దనతల బాడి,పొడియానటు కొట్టుకొనుచు బాడవడగుటయున్.

శా. దానిం బట్టుకొనంగ నెంచి కడునుత్సాహంబుమై నేగి య
ట్లే నిల్వంబడె నిల్వునీరగుచు జాలింజెంది చిత్రంబు చం
దానం జేష్టలుపక్కి యప్పులుగుచెంతన్ లోన దన్నిశ్చల
ధ్యానంబందు దనుంగొనెన్ బ్రణయతత్త్వార్థ ప్రభాపుంజముల్.

ఉ. గుండెలులేని మొండి కలగుండువడన్ దొడగెన్ మహోర్మి న
య్యండజరాజమట్లు ప్రణయార్పణబుద్ధి నొసంగినట్టి యు
ద్దండబలిప్రకారము నెదం దలపోసి విషాదతాప త
ప్తుండయి యేమిచేయుటకు దోచనిమాంద్యము తన్ను గ్రమ్మినన్.

ఉ. చెప్పిరి బంధుగుల్, హితులు చెప్పిరి, చెప్పిరి తల్లిదండ్రు లా
చెప్పిన వాక్యముల్ చెవులజేరవ వానికి నాడు, మాటలన్
జెప్పక త్యాగరూపమున జేసె పులుం గుపదేశ మట్టి మూ
ర్పప్పుడు కల్గె ఘోరబధిరాంధతవాసె హృదంతరంబునన్.

గీ. కలుషహారిణి దివిజగంగాభవాని, చల్లనగు తల్లి కరుణారసంపువెల్లి
పూజ్యమైనట్టి దేవతా భూమినుండి, యవతరించె నాతని హృదయావనిపయి.

గీ. రసములను బీల్చి క్రౌర్యము రగులజేయు, గ్రీష్మ మది యంతరించిన మృగశిరాప్ర
వేశమైయొప్పె హృదయపృథ్వీతలమున, బ్రేమచైతన్య మది యంకురింపదొడగె.

గీ. నల్లరాయియు దా నరుణార్ద్రమయ్యె, కారిపేరెడు పక్షిరక్తంబుకతన
నల్లరాతినిబోలు డెందంబుకూడ, నొప్పె కరుణారుణార్ద్ర రసోదయమున.

చ. అపు డెదనెంచె నిట్టు లకటా కడుక్రూరుడ నెన్నరాని పా
పపుబను లాచరించి తటు బంధులుమిత్రులు తల్లితండ్రి చె
ప్పపలుకు లూదనైతి కులముంజెడె నాస్తియు నాస్తియయ్యె నే
వపుబ్రతుకయ్యె భ్రష్టుడ నపాత్రుడ బాపపురాసి నిస్సిరో!

చ. "జగముల నెల్లెడన్ దురితసంతమసంబు జయింపగోరి పొ
ల్పుగ పరమేష్ఠి నిల్పినవెలుంగ"ట భూసురులట్టి జన్మమం
దగలిగి యిట్టి ఘోరదురితంబు లొనర్చితి; లాభమున్నె యే
వగచిన? నోరులేని యొకపక్షియె నాకిటు బుద్ధిచెప్పనే!

ఉ. ప్రాణము దీసినాడ నిమిషార్ధములోపల రామ! రామ! యీ
ప్రాణము లీయజాలక మహాపరితాపము నందుచుంటి నా
ప్రాణములైన నిచ్చెద పరాత్పర! ప్రాణమునిమ్ము వీని కీ
ప్రాణుల జంపుబుద్ధి యిటు ప్రాణుల కేటికి గల్గజేసెదో!

ఉ. కాలినపొట్టకై ఖచరకాంతలువోని విహంగమంబులన్
గూలిచినాడ నేల గడుగ్రూరత రాక్షసునట్లు పాపి జం
డాలుడనైతి పాపపుటెడంద గ్రహించునె? నిత్యనవ్యశో
భాలయమంజుల ప్రణయభావ రహస్యము లీజగంబునన్.

ఉ. జీవులబట్టి జీవులు భుజింపగ జేయుచు నిట్టివాని గ
ట్టా! విధి చంపునన్నను, నెడారియె మర్త్యహృదంతరం బిసీ!
జీవము పల్లవింప రసస్పృష్టియొనర్చినగాదె! యింతకున్
బూవులపైన నిప్పలను బోసితి నాకిక నేటిప్రేముడుల్.

గీ. అవని స్వర్గీయచైతన్య మంకురింప, జేయమ్రోగుచు రససృష్టిచేయజాలు
పరమపావనహృదయ విపంచియందు, ప్రేమతంత్రులు పూర్తిగా త్రెస్సెనకట!

ఉ. కర్మ మొకండె కారణముగాని నరుండొక కర్తకాడు, త
త్కర్మము ధర్మమే ఫలలఖాదికి సృష్టిని గాంచు డంచు, నీ
కర్మవిదుల్ వచించెదరుగాక యొకింత తలంచిచూడగా
నర్మిలిలేని మర్త్యహృదయంబున కేగతులొక్కొ యింతకున్.

శా. సౌందర్యార్చకు డంట మర్త్యుడు బుభుక్షాపీడకై ప్రేమకున్
సౌందర్యంబున కాటపట్టగు శకుంతద్వంద్వమున్ జంపు టే
చందంబో కగ దివ్యసుందరకళాసామ్రాజ్యపారత్వ మిం
పొందంబొందని జన్మమేటి కది ఛీ! పో! పోచకా, భూమిపై?

గీ. ప్రేమమయుడైన తండ్రివి! సృష్టియందు, జేల నెత్తురుకూడు పెట్టితివి మాకు?
పెట్టితివిపో యిదేటికి వెండి ప్రేమ,మధువుఁబోసితి హృదయపద్మంబునందు!

గీ. ప్రేమశృంగార రససుచిత్రితము జేసి, మెరయజేసిన యాద్విజమిథున జీవి
తంపు నాటకమది విషాదాంతముగ నొనర్చెనేలొకో! ఆ జగన్నాటకుండు!